www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 229 | శుక్రవారం | 8 ఫిబ్రవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

వానాకాలం నుంచే

ఎస్ఆర్ఎస్‌పి కింద 14.40లక్షల ఎకరాలకు నీరు

మేడిగడ్డ నీటిసిరి

మేడిగడ్డ నుంచి మానేరు డ్యాంలకు 50టిఎంసిలు

జూన్ నాటికే కాలువలు సర్వం సిద్ధం చేయాలి

కాకతీయ, వరద కాలువల మధ్య 1.10లక్షల ఎకరాలకు నీరిచ్చే పనులు ప్రారంభించాలి

ఆయకట్టు ప్రజాప్రతినిధులతో సమీక్షలో సిఎం కెసిఆర్ ఆదేశాలు



మన తెలంగాణ/హైదరాబాద్

ఈ ఏడాది వర్షాకాలంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని మొత్తం 14.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి అనువుగా జూన్ నాటికే కాల్వలు, తూముల నిర్మాణం, లైనింగ్ పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మేడిగడ్డ బ్యారేజి నుంచి ఈ వర్షాకాలంలో నీటిని ఎత్తిపోయడం ప్రారంభమవుతుందని ఆ నీటిని మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యాములకు తరలిస్తామన్నారు. ఈ రెండు డ్యాముల్లో కలిపి 50 టిఎంసిల నిల్వ సామర్థ్యం ఉంటుందని, ఆ నీటితో ఎస్.ఆర్.ఎస్.పి. కాల్వల ద్వారా అన్ని చెరువులను నింపాలని ఆదేశించారు. ప్రాజెక్టుల ద్వారా నీళ్లొస్తున్నాయి, పనులు చేయడానికి నిధులిస్తున్నాం, అయినా పంట పొలాలకు నీరందించకుంటే పాపం చేసిన వారమవుతామని సిఎం వ్యాఖ్యానించారు. ఎస్.ఆర్.ఎస్.పి. ఆయకట్టు పరిధిలోని ప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రగతి భవన్ లో సమావేశమయ్యారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సిఎస్ ఎస్.కె.జోషి, సిఎంఓ కార్యదర్శి స్మితా సభర్వాల్, ఓఎస్డి శ్రీధర్ తరువాయి 6లో

దిగివచ్చిన వడ్డీ రేట్లు

రెపోలో 0.25% కోత

సులభతరం కానున్న గృహ రుణాలు 9



రూ.1.60 లక్షల వరకు

హామీలేకుండా రైతురుణం

ఆర్‌బిఐ కానుక

ముంబయి: రైతు సంక్షేమం కోసం తాజాగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ కూడా కానుక ప్రకటించింది. హామీ అవసరం లేకుండా ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని రూ. లక్ష నుంచి రూ. 1.60లక్షలకు పెంచుతున్నట్లు గురువారంనాడు వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆరో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బిఐ ప్రకటించింది. ఈ సందర్భంగా వ్యవసాయ తరువాయి 6లో

కోరుట్ల, కొల్లాపూర్

కొత్త రెవెన్యూ డివిజన్లు

ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్

జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్‌లను కొత్త రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్‌ను గురువారం వెలువరించింది. దీనికి సంబంధించి అభ్యంతరాలు, అభిప్రాయాలు, సూచనలు, సలహాలను సమర్పించడానికి ప్రభుత్వం నెల రోజుల అవకాశం కల్పించింది. వీటిని లిఖిత పూర్వకంగా తరువాయి 6లో

భారీ ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్‌లో 10మంది నక్సల్స్ మృతి

మృతుల్లో ఐదుగురు మహిళలు

ఆయుధాలు, మందుగుండు ఐఇడి స్వాధీనం

అబూజ్‌మడ్ అడవుల్లో ఘటన



మన తెలంగాణ/కొత్తగూడెం

ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్ అడవి నెత్తురోడింది. పచ్చని అడవి తుపాకుల మోతతో దద్దరిల్లింది. ఇరువైపులా తుపాకులు గర్జించాయి. అ డవిలో స్వేచ్ఛగా తిరుగుతున్న మావోయిస్టు దళానికి పోలీసులకు మధ్య ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిలా అబూజ్‌మడ్ అటవీప్రాంతంలో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో పది మంది నక్సల్స్ నేలకొరిగారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ ఎస్‌సి మోహిత్ గార్గ్ కథనం ప్రకారం బీజాపూన్ జిల్లాలోని బోడ్గా అటవీప్రాంతంలోమావోయిస్టులు పెద్ద ఎత్తున సమావేశమైయ్యారనే సమాచరం మేరకు కూంబింగ్ చేస్తూ తిరుగుతున్న పోలీసులకు మావోయిస్టులకు తా రసపడ్డారు. ముందుగా మావోయి స్టు నక్సల్స్ కాల్పులు ప్రారంభించగా తేరుకున్న పోలీసులు కూడా ఎదురు కాల్పులు ప్రారంభించారు. కాల్పుల అనంతరం పరిసరాలను పరిశీలించగా సంఘటనా ప్రదేశంలో తరువాయి 6లో

కవ్వాల్ పులులకు కరెంట్ ఉరి నుంచి రక్షణ

విద్యుత్ లైన్ల మంజూరుపై ఆంక్షలు

హైకోర్టు ఆదేశాలు



మన తెలంగాణ/హైదరాబాద్

అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల రక్షణ కోసం హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సులభంగా పులుల్ని వేటాడేందుకు విద్యుత్ తీగలను ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం విస్తరించిన ప్రాంతంలో తరువాయి 6లో

కొత్త డిసిసి చీఫ్‌లు 10

మాతో ఆటలొద్దు

ముజఫర్‌పూర్ విచారణాధికారిని బదిలీ చేసి ధిక్కారానికి పాల్పడ్డారు

సిబిఐ మాజీ తాత్కాలిక చీఫ్ నాగేశ్వరరావుకు సుప్రీం చివాట్లు

12న హాజరుకావాలని ఆదేశం



10

23 పార్టీల మహాకల్తీ కూటమి

ఎమర్జెన్సీ విధాతలు నన్ను వ్యవస్థల వినాశకారి అంటారా ?

లోక్‌సభలో విపక్షాలపై ధ్వజమెత్తిన మోడీ



12

కుంచెపోటు



ఆ ప్రేమ, అభిమానం మీద కూడా సిబిఐ,ఇడిలతో దాడి చేయిద్దాం సార్!

మార్చి 13నుంచి

పిజిఇసెట్ దరఖాస్తులు 3

మే 28నుంచి31 వరకు ఆన్‌లైన్ పరీక్షలు

తండ్రి ఎదుటే గ్యాంగ్ రేప్ 12

బీహార్‌లో దారుణం

రోడ్లకు బలి

ఏటా దేశవ్యాప్తంగా లక్షన్నర మంది దుర్మరణం



మన తెలంగాణ /హైదరాబాద్

దేశం మొత్తంమీద జాతీయ, రాష్ట్ర రహదారుల్లో జరుగుతున్న ప్రమాదాల్లో ఏటా సగటున ఒకటిన్నర లక్ష మంది ప్రజలు మృత్యువాత పడుతున్నారు. వాహనాల్లో ప్రయాణించేవారే కాకుండా రోడ్లపై నడిచివెళ్ళే పాదచారులు కూడా ఈ ప్రమాదాల్లో చనిపోతున్నారు. పాదచారులు రోజుకు సగటున 40 మందికంటే ఎక్కువే చనిపోతున్నట్లు కేంద్ర రోడ్డురవాణా మంత్రిత్వశాఖ అంచనా వేసింది. వరుసగా నాలుగేళ్ళుగా దేశం మొత్తంమీద జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను విశ్లేషించిన మంత్రిత్వశాఖ అధికంగా రోడ్డు ప్రమాదాలు తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో జరుగుతుండగా చనిపోతున్నది మాత్రం ఎక్కువగా తమిళనాడులోనేనని పేర్కొంది. 2017లో తరువాయి 6లో

జయరాం హత్య కేసు విచారణ అధికారిగా ఎస్‌పి కెఎస్ రావు 2

ఎస్‌బిఐ లాకర్ నుంచి

80తులాల బంగారం మాయం

హైదరాబాద్ విజయనగర్ కాలనీ బ్రాంచ్‌లో...

మన తెలంగాణ/సిటీబ్యూరో

నగరంలోని విజయనగర్ కాలనీలోని ఎస్‌బిఐ లాకర్‌లోని 80 తులాల బంగారం మాయమైంది. అదే కాలనీకి తరువాయి 6లో

కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టించిందే ఉత్తమ్

- సర్వే సత్యనారాయణ 2

జయరాం హత్య కేసు హైదరాబాద్‌కు బదిలీ

విచారణ అధికారిగా బంజారాహిల్స్ ఎసిపి కెఎస్ రావు

మనతెలంగాణ/సిటీబ్యూరో: సంచలనం సృష్టించిన ప్రముఖ పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరాం హత్య కేసును ఏపి పోలీసులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషనుకు బదిలీ చేశారు. జయరాం హత్య కేసు విచారణ అధికారిగా బంజారాహిల్స్ ఎసిపి కెఎస్ రావును నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 1వ తేదీన చిగురుపాటి జయరాం హత్యకు గురికావడంతో అతడి మామ పించయ్య చౌదరి ఫిర్యాదు మేరకు నందిగామ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ఇద్దరు నిందితులు రాకేష్ రెడ్డి, శ్రీనివాస్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. జయరాంను హైదరాబాద్‌లో హత్య చేసి నందిగామకు తీసుకువచ్చి కారు ప్రమాదంలో మృతిచెందనట్లుగా డ్రామా ఆడేందుకు ప్రయత్నించారు. కేసుకు సంబంధించిన పత్రాలు, అటాచ్‌మెంట్స్‌ను పరిశీలించి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మళ్లీ కేసు నమోదు చేస్తామని నగర సిపి అంజనీకుమార్ తెలిపారు. కేసుతో సంబంధం ఉన్న వారందరినీ విచారిస్తామని సిపి స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టించిందే ఉత్తమ్

కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ



మనతెలంగాణ/గజ్వేల్: అత్యంత అసమర్థుడైన పిసిసి అధక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డిని వెంటనే ఆ పదవి నుంచి తప్పించకపోతే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలువలేమని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. గురువారం వర్గల్ మండలంల నెంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తమ్ పై ఘాటైన విమర్శలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఉత్తమ్ భ్రష్టుపట్టించారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో టిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను ఎదుర్కొనే సత్తా ఉత్తమ్‌కు లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులకు టికట్ల కేటాయింపులో ఉత్తమ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. ప్రియాంక గాంధీకి పార్టీ బాధ్యతలు అప్పచెప్పిన కారణంగా యుపిలో బిజెపికి ఎదురు దెబ్బ తప్పదన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో పిసిసి నుంచి ఉత్తమ్‌ను తప్పించి సమర్థుడైన నాయకున్ని నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ప్రచార కార్యదర్శి నిమ్మ రంగారెడ్డి, వర్గల్ , ములుగు మండలాల బాధ్యులు నరేందర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి మాన్యం భూములకు రక్ష

- అన్యాక్రాంతంపై ప్రభుత్వం సీరియస్
- ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశాలు
- పాత రికార్డుల కోసం అధికారుల అన్వేషణ

మన తెలంగాణ/హైదరాబాద్ : దేవుడి భూములను కబ్జా చేసేవారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపనుంది. దేవుడి మాన్యం భూముల పరిరక్షణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని దేవాదాయ శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కబ్జా దారులు ఎంతటి వారైనా వదిలిపెట్టవద్దని, కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలో ఉన్న భూములను సర్వే చేసి వాటిపై నివేదిక తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులతో సర్వేకు ప్రణాళిక సిద్ధమైంది. ధూప, దీప నైవేద్యం కోసం ఇచ్చిన దేవుడి మాన్యాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో దేవాలయాలకు ఎవరెవరు భూములను విరాళంగా ఇచ్చారో వివరాలను, భూములకు సంబంధించిన రికార్డులను అధికారులు వెదకడం మొదలుపెట్టారు. గ్రామాల్లో చిన్న దేవాలయాలకు సైతం పెద్ద ఎత్తున భూములున్నాయన్న విషయం అధికారుల దృష్టికి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా దేవుడి మాన్యాల వివరాలు సరిగ్గా లేని కారణంగా ఏ ఆలయానికి ఎంత భూమి ఉందో అధికారులకై స్పష్టత లేదు. సరైన రికార్డులు లేకపోవడంతో భూముల హద్దులు గుర్తించలేకపోతున్నామని ఓ అధికారి తెలిపారు. దేవుడి భూములకు సంబంధించి ఏదైనా సమస్య వస్తే రెవెన్యూ రికార్డుల్లో వెతుక్కుంటామని, అక్కడ కూడా వాటికి సంబంధించిన సరైన రికార్డులు కనిపించడం లేదని, ప్రస్తుతం పాత రికార్డులు ఎక్కడ దొరుకుతాయని అన్వేషిస్తున్నట్లు తెలిపారు.

సర్వే అనంతరం నోటీసులు

కబ్జాకు గురైన దేవుడి మాన్యం భూములను గుర్తించి ఆ భూములను సర్వే చేసి అనంతరం నోటీసులు జారీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఆలయాలకు భూములు ఇచ్చిన మృతిచెందినవారి వారసులు కోర్టులో కేసులు వేయడంతో ఆ వివరాలపైనా దృష్టి పెట్టారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామికి చెందిన 358 ఎకరాల భూమిపై పూర్తి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మేడ్చల్ జిల్లాలోని బాచుపల్లి మండలం నిజాంపేట (సర్వే నం.308,332,333,184లోని) భూముల అన్యాక్రాంతంపై గతంలో కోర్టులో కేసు వేయడం, దీనిపై న్యాయమూర్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన అంశాన్ని గుర్తుచేసిన అధికారులు ఈ విషయంలో నిజానిజాలు వెలికితీయడానికి మరోసారి సర్వే చేయాలని నిర్ణయించారు. నగరంలోని లంగర్‌హౌస్ శ్రీరామచంద్ర స్వామి భూములపై కోర్టులో కేసు విచారణ ఉన్నందున వివరాలను అందజేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు అందాయి. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ ఆలయానికి చెందిన (సర్వే నం.92లోని 1.34 ఎకరాల) స్థలానికి సంబంధించిన రికార్డుల కోసం అధికారులు టౌన్ సర్వే ల్యాండ్ రికార్డ్స్‌ను ఆశ్రయించారు. దేవరయాంజాల్‌లోని సీతారామచంద్ర స్వామికి చెందిన 1,531 ఎకరాల మాన్యంపై అధికారులు దృష్టి పెట్టారు. ఈ భూముల్లో వెలసిన అక్రమ కట్టడాల ద్వారా ఎవరు లబ్ధిపొందుతున్నారో గుర్తించి దేవాదాయ చట్టంలోని సెక్షన్ 83 ప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. పెద్దపల్లి మండలం కాసులపల్లి, గోపయ్యపల్లి ప్రాంతాల్లో ఉన్న 462 ఎకరాల దేవుడి మాన్యంపై అధికారులు నివేదిక సిద్ధం చేశారు.



ఎప్పటినుంచి ఆ భూమి సాగు చేస్తున్నారన్న విషయాలను... దీంతోపాటు దేవుడి మాన్యం భూముల్లో రైతులు వ్యవసాయం చేస్తే వారు ఎప్పటి నుంచి సాగు చేస్తున్నారన్న విషయాలను కూడా పరిగణలోకి తీసుకొని రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దేవుడికి సంబంధించిన స్థలాలో కమర్షియల్ భవనాల కేటాయింపు, వాటి రెంటల్ అగ్రిమెంట్స్‌ను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలో కొన్ని ఆలయాలకు సంబంధించి (సికింద్రాబాద్ ఉజ్జయిని, గణేష్) కమర్షియల్ కాంప్లెక్సుల నిర్వహణ పేరిట దేవుడి సొమ్మును కొందరు నొక్కేస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఆ వివరాలను సేకరించే పనిలో పడ్డారు. రాష్ట్రంలోని దేవుడి మాన్యాలపై పూర్తిస్థాయి నివేదిక వచ్చిన అనంతరం ఆ నివేదికను మరోసారి తనిఖీ చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

- ఉత్తమ డ్రైవర్లకు అవార్డుల ప్రదానం
- డ్రైవర్లకు సునీల్‌శర్మ, కృష్ణప్రసాద్ దిశానిర్దేశం



మన తెలంగాణ / హైదరాబాద్ : రోడ్డు భద్రతను సామాజిక బాధ్యతగా గుర్తించాలని రోడ్డు సెఫ్టీ అథారిటీ ఛైర్మన్ టి.కృష్ణ ప్రసాద్, రోడ్లు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ అన్నారు. ఈ బాధ్యతను ప్రతీ ఒక్కరూ సక్రమంగా నిర్వర్తిస్తే ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రమాదాల వల్ల కలిగే ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా రవాణా శాఖ, ఆర్‌టిసి సంయుక్తంగా గురువారం నిర్వహించిన సదస్సు సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై డ్రైవర్లకు దిశానిర్దేశం చేశారు. ఉత్తమ డ్రైవర్లకు అవార్డులను అందజేశారు. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రమాద రహిత ప్రయాణానికి ఆర్‌టిసి గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. సునీల్‌శర్మ మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడపాల్సిన అవసరం ఉందన్నారు. నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ మాట్లాడుతూ రవాణా రంగానికి ఆర్‌టిసి వెన్నెముక లాంటిదన్నారు. ఆర్‌టిసి కార్యదర్శి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ, ఐటి) పురుషోత్తం మాట్లాడుతూ రహదారుల ప్రమాదాల నివారణే ధ్యేయంగా డ్రైవర్లు తమ విధి నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని, డ్రైవర్ల పాత్ర కీలకమైనదన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిని నిరోధించడానికి రవాణా శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ జాయింట్ కమిషనర్ పాండురంగ నాయక్ తెలిపారు. అవార్డులను అందుకున్న వారి వివరాలు సమగ్రంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ డ్రైవర్లుగా నగదు ప్రోత్సాహకాలను అందుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన జిఎన్.రెడ్డి ప్రథమ బహుమతి కింద రూ.12వేలు, ద్వితీయ బహుమతి కిం కరీంనగర్ 2 డిపోకు చెందిన ఎ.కృష్ణ రూ.10 వేలు, తృతీయ బహుమతి కింద హయత్‌నగర్ 1కు చెందిన బి.రాములు రూ.8వేలను అందజేశారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఉత్తమ డ్రైవర్లుగా ప్రథమ బహుమతిని కుషాయిగూడకు చెందిన కెఆర్.రెడ్డి రూ.4,600, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద ఉప్పల్ డిపోకు చెందిన ఎన్.రామాచారి, వి,హరినాథ్‌లు వరుసగా రూ.4,250, రూ.4వేలను అందుకున్నారు. కరీంనగర్ జోన్ కింద ఉత్తమ డ్రైవర్లుగా సత్తుపల్లి డిపోకు చెందిన వి.బాబు ప్రథమ బహుమతి రూ.4,500, మంచిర్యాల డిపోకు చెందిన ఎండి..జావేద్ రూ.4,250, తృతీయ బహుమతి నిర్మల్ డిపోకు చెందిన ఎన్.గంగాధర్, హైదరాబాద్ జోన్ ఉత్తమ డ్రైవర్లుగా నల్గొండ డిపోకు చెందిన ఎండి.జి.మోయినుద్దీన్ రూ.4,500, ద్వితీయ బహుమతి కింద మహబూబ్‌నగర్ డిపో ఎండి.అబ్దుల్ రహమాన్ రూ.4, 250, తృతీయ బహుమతి కింద హైదరాబాద్ 2 డిపోకు చెందిన కె.జనార్ధన్ రూ.4వేలను అందుకున్నారు. దీంతో పాటు రాష్ట్రస్థాయిలో క్యాటగిరి 1, 2, 3 కింద కూడా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ రుణ పరిమితిని రూ. లక్ష నుంచి రూ. 1.60 లక్షలకు పెంచుతున్నట్లు ఆర్‌బిఐ ప్రకటించడం పట్ల బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు.



గవర్నర్‌కు పంచాయతీ ఎన్నికల రిపోర్టు

అందజేసిన ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం రూపొందించిన సమగ్ర నివేదికను గవర్నర్ నరసింహన్‌కు ఎలక్షన్ కమిషనర్ నాగిరెడ్డి గురువారం అందచేశారు. జనవరిలో మూడు విడతల్లో జరిగిన ఎన్నికల వివరాలలు ఈ నివేదికలో ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను గవర్నర్‌కు ఈ భేటీ సందర్భంగా వివరించారు.

ఎగ్జిబిషన్ మూసివేయాలని హైకోర్టులో పిల్

మన తెలంగాణ/ హైదరాబాద్ : అగ్నిమాపక శాఖ నుంచి తగిన అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మూసేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. జనవరి 31న ఎగ్జిబిషన్ నిర్వహణ సమయంలోనే భారీ అగ్నిప్రమాదం జరిగిందని, రోజూ 50 వేల మంది సందర్శించుతారని, అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదని, ఈ కేసును సీఐడీ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు అప్పగించేలా ఆదేశాలివ్వాలని పిల్‌లో హైకోర్టును కోరారు. హైదరాబాద్‌కు చెందిన ఖాజా ఐజాఉద్దీన్ దాఖలు చేసిన ఈ పిల్‌లో ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, అగ్నిమాపక శాఖ డీజీ, జిల్లా అగ్నిమాపక అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్, బేగంపేట పోలీస్ స్టేషన్ అధికారి, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శులను చేశారు. చట్ట ప్రకారం ఎగ్జిబిషన్ నిర్వహణకు అగ్నిమాపక శాఖ నుంచి నిరభ్యంతర పత్రాన్ని పొందాలన్న నిబంధనను ఎగ్జిబిషన్ సొసైటీ ఉల్లంఘించిందని, భారీ అగ్నిప్రమాదం తర్వాత రెండు రోజులు ఆగి తిరిగి ప్రారంభించినపుడు నిరభ్యంతర పత్రాన్ని పొందలేదన్నారు. ఘటన స్థలంలో ఫైరింజన్‌ఉన్నా పనిచేయలేదన్నారు. నిర్వాహకుల తప్పిదం వల్లే ప్రమాదమైందని, అయితే ప్రమాదవశాత్తూ జరిగినట్లుగా పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఎగ్జిబిషన్‌ను మూసేసి దాని నిర్వహకుల్ని ప్రాసిక్యూట్ చేసేందుకు ఆదేశాలివ్వాలని పిల్‌లో కోరారు.


కేంద్ర పథకాల అమలును మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్ని రాష్ట్రాల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పిలుపునిచ్చారు.

'ప్యాక్స్' పర్సన్ ఇంఛార్జీల పదవీకాలం పొడిగింపు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రాథమిక చేనేత సహకార సంఘాల పర్సన్ ఇంఛార్జీ కమిటీల పదవీకాలాన్ని మరో 6 నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పర్సన్ ఇంఛార్జీ కమిటీల పదవీకాలం ఈనెల 11తో ముగిసింది. దీంతో మరో ఆరు నెలలు పర్సన్ ఇంఛార్జీల పాలన కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు వ్యవసాయ, సహకార శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు.

నీటి పొదుపునకూ 'స్వచ్ఛభారత్' తరహా ఉద్యమం

కేంద్ర జల సంఘం ఆలోచన



మన తెలంగాణ/హైదరాబాద్: స్వచ్ఛ భారత్ తరహాలో నీటి పొదుపుకు కూడా ఉద్యమాన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని కేంద్ర జల సంఘం చైర్మన్ మసూద్ హుస్సేన్ వ్యాఖ్యానించారు. నీటి సంరక్షణలో సంప్రదాయ పద్ధతులను పునరుద్ధరించాల్సిన అవసరముందని, నీటిని కాపాడాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తెరగాలన్నారు. విదేశాల్లో మాదిరిగా నీటి పునర్వినియోగాన్ని, నీటిని శుద్ధిచేసి వాడడాన్ని అలవాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నీటి పొదుపు కేవలం ప్రభుత్వ బాధ్యతలా చూడవద్దని, ప్రజలంతా భాగస్వాములై, ఆచరిస్తేనే పొదుపు విజయవంతమవుతుందన్నారు. కేంద్ర జలసంఘం, కేంద్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలో 'నీటి పొదుపు, మన బాధ్యత' అనే అంశంపై హిందీలో నిర్వహించిన టెక్నికల్ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మసూద్ హుస్సేన్ పై విధంగా వ్యాఖ్యానించారు. ప్రపంచంలో 18 శాతం జనాభా భారత్‌లోనే నివసిస్తున్నారని, కానీ నీటి వనరులు మాత్రం నాలుగు శాతం అందుబాటులో ఉన్నాయన్నారు. సింధు, గంగ, బ్రహ్మపుత్ర, నర్మద, తపతి, మహానది, గోదావరి, కృష్ణా, కావేరి వంటి విస్తారమైన నదులతో దేశం జలసంపన్నంగా ఉందని, వీటిని సరిగ్గా అనుసంధానించి వాడితే, దేశం సుసంపన్నం అవుతుందని పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధి రేటు కు, నీటి పొదుపు, సమర్ధ వినియోగానికి అవినాభావ సంబంధం ఉంటుందని, అన్ని రా ష్ట్రాలు బిందు సేద్యం, మైక్రో ఇరిగేషన్, డ్రిప్‌ల ను ప్రోత్సహించాలని, తక్కువ నీటితో ఎక్కువ సాగుచేయాలని సూచించారు. రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకం దేశంలో పెద్ద సమస్యగా పరిణమించిందని, ఈ విభేదాలతో అనేక ప్రాజెక్టులు నిలిచిపోయాయని, ప్రాజెక్టులు ఆలస్యంతో, ఫలితంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలుగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నదీ జలాలను కాపాడాల్సిన అవసరాన్ని విద్యావంతులు గుర్తెరగాలని సూచించారు.

పకడ్బందీగా పిఎం కిసాన్ సమ్మాన్

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రాలకు కేంద్ర కేబినెట్ కార్యదర్శి ఆదేశం

మన తెలంగాణ/ హైదరాబాద్: చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పథకాన్ని రాష్ట్రాలు పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర కేబినెట్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ సిన్హా విజ్ఞప్తి చేశారు. వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో పాటు ఆయా రాష్ట్రాల్లోని వ్యవసాయ శాఖ కార్యదర్శులతో ఢిల్లీ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పిఎం కిసాన్ పథకం మార్గదర్శకాలను రాష్ట్రాలకు వివరించడంతోపాటు లబ్ధిదారుల వివరాలను వీలైనంత తొందరగా సమగ్రంగా కేంద్రానికి అందజేయాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా రాష్ట్రాలు ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన ఏర్పాట్లను చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ సచివాలయం నుంచి వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పథకానికి అర్హులైన లబ్ధిదారుల వివరాలను వీడియో కాన్ఫరెన్సు ద్వారా వివరించడంతో పాటు తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాలు, అందులోని అంశాలను ఉదహరించారు.

మార్చి 13 నుంచి పిజిఇసెట్ దరఖాస్తులు

మే 28 నుంచి 31 వరకు ఆన్‌లైన్ పరీక్షలు



మన తెలంగాణ/హైదరాబాద్ : ఎం.టెక్, ఎం.ఇ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పిజిఇసెట్ ప్రవేశ పరీక్షకు మార్చి 13 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం కానున్నాయి. గురువారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ టి.పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన పిజిఇసెట్ కమిటీ సమావేశంలో షెడ్యూల్ ఖరారైంది. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఆర్.లింబాద్రి, కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎస్.రామచంద్రం, ఒయు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కుమార్, లైసనింగ్ ఆఫీసర్ పి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. మే 28 నుంచి 31 వరకు జరుగనున్న పిజిఇసెట్‌కు ఏప్రిల్ 30 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తు రుసుం రూ. వెయ్యి(ఎస్‌సి,ఎస్‌టిలకు రూ.500) కాగా, అపరాధ రుసుంతో మే 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మే 22 నుంచి మే 27 వరకు విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రంలో 129 ఇంజనీరింగ్ కళాశాలలు ఎం.ఇ, ఎం.టెక్ కోర్సులు అందిస్తుండగా, 96 కళాశాలలు ఎం.ఫార్మసీలు కోర్సులు అందిస్తున్నాయి. అలాగే 14 కళాశాలలు ఫార్మా-డి, మూడు కళాశాలలు ఎం.ఆర్క్ కోర్సులు అందిస్తున్నాయి.

మేం వస్తే ట్రిపుల్ తలాక్ రద్దు : కాంగ్రెస్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ట్రిపుల్ తలాక్ బిల్లును రద్దు చేస్తామని ఆ పార్టీ మహిళా విభాగం చీఫ్ సుస్మితా దేవ్ చెప్పారు. ఢిల్లీలో గురువారం కాంగ్రెస్ మైనారిటీ విభాగం సదస్సులో మాట్లాడుతూ ముస్లిం పురుషులపై ముస్లిం మహిళలను ఈ బిల్లు ద్వారా రెచ్చగొట్టే వాతావరణాన్ని ప్రధాని మోదీ సృష్టించారని ఆరోపించారు. ట్రిపుల్ తలాక్ బిల్లు అమలైతే మహిళా సాధికారత సాధ్యమవుతుందని చెబుతున్నా ముస్లిం పురుషులను జైళ్లలో మగ్గేలా, వారిని పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పేలా ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంతకాల ఉద్యమం సాగించిన వేలాది ముస్లిం మహిళలను ఆమె అభినందించారు. ఈ బిల్లుకు పార్లమెంట్‌లో వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని, 2019లో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే దీన్ని తొలగిస్తుందని సుస్మితా దేవ్ స్పష్టం చేశారు.

నా భర్త హత్యలో శిఖా ప్రమేయం : పద్మశ్రీ

హైదరాబాద్ : తన భర్త హత్య కేసులో శిఖా చౌదరి ప్రమేయం ఉందని ఎన్‌ఆర్‌ఐ వ్యాపారవేత్త చిగురుపాటి జయరాం భార్య పద్మశ్రీ ఆరోపించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ శిఖా ప్రమేయం లేకుంటే తన భర్త చనిపోయేవారు కాదని అన్నారు. తమ ఆస్తులు లాక్కునేందుకే ప్రియుడితో కలిసి తన భర్తను హత్య చేయించిందని ఆమె ఆరోపించారు. ఆమె వ్యవహారం చూసి తన భర్తకు ప్రాణహాని ఉందని ఐదేళ్ల క్రితమే భయపడినట్టు వెల్లడించారు. హత్యకు ప్లాన్ చేసింది శిఖాయేనని స్పష్టం చేశారు. పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తే అన్ని విషయాలు బయటపడతాయన్నారు. పేద అమ్మాయి అయిన శిఖా చౌదరి నేడు బిఎండబ్ల్యూ కారులో ఎలా తిరుగుతోందని ప్రశ్నించారు. విలాసవంతమైన జీవితానికి అలవాటుపడిందని, డబ్బు కోసం ఆమె ఎంతకైనా తెగిస్తుందని మండిపడ్డారు. అలాంటి అమ్మాయి తమ ఇంట్లో ఉండటం దురదృష్టమన్నారు. జయరాం చనిపోయిన కబురు తెలిసినా తర్వాత నందిగామ ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. జయరాం ఇంటికి వెళ్లి పలు కీలక పత్రాలు, విలువైన వస్తువులు తీసుకుపోయిందని ఆరోపించారు. ఎక్స్‌ప్రెస్ టీవీలో ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించిన తర్వాతే ఆ చానల్ నాశమైందన్నారు.

మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకు జనసేన పార్టీ కమిటీలు

మన తెలంగాణ/హైదరాబాద్ : జనసేన పార్టీ తెలంగాణలో మూడు పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఎగ్జిక్యూటివ్, వర్కింగ్ కమిటీలను నియమించింది. గురువారం ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సికింద్రాబాద్, మల్కాజిగిరి, ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గాలకు నియమించిన ఎగ్జిక్యూటివ్, వర్కింగ్ కమిటీల సభ్యుల వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్లమెంటు నియోజకవర్గాలకు కమిటీలను నియమిస్తున్న క్రమంలోనే తెలంగాణలోని ఖమ్మం, సికింద్రాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకర్గాల కమిటీలు, అందులోని సభ్యుల వివరాలను వెల్లడించారు. మూడు పార్లమెంటు నియోజకవర్గాల ఎగ్జిక్యూటివ్ కమిటీల్లో 11 మంది చొప్పున, వర్కింగ్ కమిటీల్లో 32 మంది చొప్పున సభ్యులను నియమించారు.



హైదరాబాద్‌లోని ట్రిడెంట్ హోటల్‌లో గురువారం రాత్రి జరిగిన మైహోం సిమెంట్స్ అధినేత జూపల్లి జగపతిరావు కుమార్తె వివాహ నిశ్చితార్థం కార్యక్రమానికి హాజరైన టిఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్



అవార్డీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ 2019 క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించిన రాష్ట్ర హోం మంత్రి మహ్మూద్ మహమూద్ అలీ

స్పీకర్ పోచారానికి సిఎం కెసిఆర్ పరామర్శ







మన తెలంగాణ/బాన్సువాడ: తల్లి మరణంతో బాధాతప్త హృదయంతో ఉన్న శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని గురువారం ముఖ్యమంత్రి కెసిఆర్ పరామర్శించారు. హైదరాబాద్ నుంచి కామారెడ్డి జిల్లా బాన్సువాడకు హెలికాప్టర్‌లో వచ్చిన సిఎం అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా పోచారం గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డికి సిఎం ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సిఎం కెసిఆర్ వెంట శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ మంత్రి నాయిని నర్సింహా రెడ్డి, శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, ఖమ్మం ఎంపి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల శాసనసభ్యులు ప్రశాంత్ రెడ్డి, జీవన్ రెడ్డి, బిగాల గణేష్ గుప్త, గంప గోవర్ధన్, బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ షిండే, సురేందర్, జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, జహీరాబాద్ ఎంపి బిబి పాటిల్‌తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్ శర్మ తదితరులున్నారు.

కిసాన్ సమ్మాన్‌కు స్వల్ప సవరణలు

- ఉమ్మడి భూమిలో ఎవరికి ఎక్కువుంటే వారి పేరుమీద నగదు సాయం
- పన్ను చెల్లింపుదారులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలకు నగదు సాయం లేదు



మన తెలంగాణ/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకా'నికి వ్యవసాయ మంత్రిత్వశాఖ గురువారం స్వల్ప సవరణలు చేసింది. ఒక కుటుంబంలోని పలువురు సభ్యుల మధ్య ఐదు ఎకరాల మేరకు ఉమ్మడిగా సాగుభూమి ఉన్నట్లయితే అందులో ఎవరికి ఎక్కువగా భూమి ఉంటే వారి పేరుమీద ఉన్న బ్యాంకు ఖాతాలోకే నగదు జమ అవుతుందని స్పష్టం చేసింది. సవరణ చేసిన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో స్పష్టత ఇచ్చింది. భూ రికార్డుల ఆధారంగా ఆ కుటుంబంలో ఏ సభ్యులకు ఎక్కువ భూమి ఉన్నట్లు ఉంటే వారికే ఆరు వేల రూపాయల సాయాన్ని ఇస్తామని స్పష్టత ఇచ్చింది. ఒకవేళ పలు కుటుంబాలకు కలిపి ఐదు ఎకరాలకంటే ఎక్కువ భూమి ఉన్నట్లు తేలితే ఆ భూమి విస్తీర్ణానికి అనుగుణంగా కుటుంబాలకు నగదు సాయం ఉంటుందని స్పష్టం చేసింది. ఐదారు కుటుంబాలకు కలిపి ఇరవై ఎకరాలకంటే ఎక్కువ భూమి ఉన్నట్లయితే ఒక్కో కుటుంబానికి ఐదు ఎకరాలు దాటకపోయినట్లయితే ఆ కుటుంబాలకు ఆరు వేల రూపాయల చొప్పున నగదు సాయం ఉంటుందని వివరణ ఇచ్చింది. ఒకవేళ ఒక కుటుంబానికి ఐదు ఎకరాలకంటే ఎక్కువ ఉండి మిగిలిన కుటుంబాలకు అంతకంటే తక్కువ ఉన్నట్లయితే ఐదు ఎకరాలకంటే ఎక్కువ భూమి ఉన్న కుటుంబానికి ఎలాంటి సాయమూ అందదని, ఐదు ఎకరాల కంటే తక్కువ ఉన్న కుటుంబానికి మాత్రం అందుతుందని స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న వ్యవసాయ శాఖల ముఖ్య కార్యదర్శులతో గురువారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్సులో కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి మాట్లాడిన తర్వాత ఈ వివరణ రావడం గమనార్హం.

ఆ ఏడు అంశాల కిందికి వస్తే సాయం లేనట్లే

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ సమ్మాన్ పథకానికి మార్గదర్శకాలను విడుదల చేసిన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ దీని పరిధిలోకి రాని సెక్షన్ల ప్రజలకు స్పష్టత ఇచ్చింది. వ్యవస్థీకృతమైన భూమికి హక్కుదారులుగా ఉన్నా (రికార్డుల ప్రకారం), గతంలోగానీ ప్రస్తుతం గానీ ఏదేని రాజ్యాంగపరమైన పదవుల్లో ఉన్నా, గతంలో గానీ ఇప్పుడుగానీ మంత్రులుగా, పార్లమెంటు సభ్యులుగా, శాసనసభ్యులుగా, శాసనమండలి సభ్యులుగా, మేయర్‌గా, మున్సిపల్ చైర్‌పర్సన్‌గా, జిల్లా పంచాయతీ చైర్‌పర్సన్లుగా ఉన్నా ఈ పథకం కింద లబ్ధి పొందడానికి అర్హత ఉండదని పేర్కొనింది. గతంలో లేదా ప్రస్తుతం రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నా, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగులుగా గతంలోగానీ ప్రస్తుతంగానీ ఉన్నా, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థల్లో గతంలోగానీ ఇప్పుడుగానీ రెగ్యులర్ ఉద్యోగులుగా ఉన్నా, స్థానిక సంస్థల్లో గతంలోగానీ ఇప్పుడుగానీ ఉద్యోగులుగా ఉన్నా ఈ పథకం వర్తించదని స్పష్టం చేసింది. గతంలో ఉద్యోగులుగా ఉండి ప్రస్తుతం పది వేల రూపాయలకంటే ఎక్కువగా పింఛను అందుకుంటున్నవారు కూడా ఈ పథకానికి అర్హులు కారని పేర్కొనింది. ఇక డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్ట్‌లు, ఇతర వృత్తులు చేసుకునేవారు కూడా అర్హులు కారని పేర్కొనింది. గతేడాది ఆదాయపు పన్ను చెల్లించినవారు కూడా అర్హులు కారని వివరించింది.

విషమంగానే మధులిక పరిస్థితి

24గంటలు దాటితేకాని చెప్పలేం: వైద్యులు



మనతెలంగాణ/ సిటీ బ్యూరో : ప్రేమోన్మాది భరత్ పక్కా ప్రణాళికతోనే దాడి చేశాడని, మధులికను 15 చోట్ల తీవ్రంగా గాయపరిచాడని పోలీసులు స్పష్టం చేశారు. ప్రేమోన్మాది దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మధులిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడడంతో పలు ఆపరేషన్లు చేయాల్సిన అవసరం ఉందని యశోద ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఇన్ఫెక్షన్ సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సంచలనం సృష్టించిన మధులిక కేసులో నిజాలు వెలికితీసేపనిలో పడ్డారు పోలీసులు. మధులికను హత్య చేసేందుకే కొబ్బరిబోండాలు నరికే కత్తితో దాడిచేసినట్లు పోలీసులు తేల్చారు.

రక్త దానం చేసే వారు ముందుకు రావాలి

మధులికకు తీవ్రంగా రక్త స్రావం కావడంతో రక్తం కావాల్సి ఉందని, రక్తాన్ని ఎక్కిస్తూ ఉన్నామని. ఇంకా రక్తం అవసరం ఉందని, ఏ గ్రూపు వారైనా రక్తం దానం చేసేందుకు ముందుకు రావాలని వైద్యులు కోరారు. మధులిక ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని, మరో 24గంటలు దాటితే కాని ఏమీ చెప్పలేమని డాక్టర్లు తెలిపారు. బీపీని కంట్రోల్ చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. దాడిలో మెడకు తీవ్ర గాయమైందని ఎమ్‌ఆర్‌ఐ స్కాన్‌లో తెలిసిందన్నారు. దాడి చేసిన కత్తి తుప్పు పట్టి ఉందని దీంతో ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు.

'బావా నువ్వు సూపర్'

సిద్దిపేట సమీకృత మార్కెట్ బాగుంది
హరీష్‌కు కెటిఆర్ అభినందనలు







మన తెలంగాణ/ హైదరాబాద్: సమీకృత మోడల్ మార్కెట్‌ను సిద్దిపేటలో నిర్మించినందుకు బావ హరీష్‌రావుకు టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ట్విట్టర్‌లో అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ సూచనల మేరకు తన నియోజకవర్గంలోని సిద్దిపేట జిల్లా కేంద్రంలో టి.హరీష్ రావు ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన సమీకృత మార్కెట్ పట్ల కెటిఆర్ ఆకర్షితులై హరీష్‌రావును అభినందించారు. ఆరు ఎకరాల స్థలంలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ మార్కెట్ వ్యాపారులకు, వినియోగదారులకు ఉపయోగంగా ఉంది. మార్కెట్ నిర్మాణానికి ముందు అపరిశుభ్రవాతావరణంలో చేపల మార్కెట్, అలాగే మాంసం దుకాణాలు కూడాఉండేవి, అలాగే కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు దుమ్ముధూళిలో వ్యాపారం చేసేవారు. అపరిశుభ్రవాతావరణంలో ఉన్న ఈ మార్కెట్లను తొలగించి ప్రజాఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ మోండా మార్కెట్ మాదిరిగా నిర్మించాలని సిఎం. కెసిఆర్ సూచించగా స్థానిక ఎంఎల్‌ఎ, మాజీమంత్రి హరీష్ రావు తక్షణం స్పందించి ఆరు ఎకరాల స్థలంలో మార్కెట్ నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించారు. ప్రస్తుతం ఆరోగ్యకరమైన వాతావరణంలో విశాలంగా వ్యాపారులకు అనువుగా మార్కెట్ నిర్మాణం జరిగింది. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారు. ప్రజల అవసరాలు, ఆరోగ్య దృష్ట్యా మార్కెట్ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించిన హరీష్ రావుకు ట్విట్టర్‌లో బావ హరీష్‌కు అభివందనలు అంటూ కెటిఆర్ పోస్టు చేశారు.

తెలంగాణలో 'పవర్'ఫుల్ ముఖ్యమంత్రి



జెన్‌కో సిఎండి ప్రభాకర్‌రావు కితాబు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో 'పవర్' ఫుల్ ముఖ్యమంత్రి ఉన్నారని, అందుకే విద్యుత్ రంగంలో అద్భుతాలు చేస్తున్నామని టిఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత విద్యుత్ సరఫరా నష్టాలను తగ్గించామని, ఇంకా తగ్గించేలా పలు చర్యలు తీసుకుంటున్నామని, రెప్పపాటు కరెంటు నిలిచిపోకుండా 24 గంటలూ సరఫరా చేయగలుగుతున్నామన్నారు. కేంద్ర విద్యుత్ పరిశోధనా సంస్థ (సిపిఆర్‌ఐ) ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో గురువారం జరిగిన 'హై ఓల్టేజీ ఇంజనీరింగ్ టెక్నాలజీ' అనే సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాకరరావు మాట్లాడుతూ, విద్యుత్ సరఫరాకు సంబంధించి కొత్త లైను వేయాలంటే సిపిఆర్‌ఐ నుంచి విధిగా అనుమతి తీసుకోవాల్సిందేనన్నారు. తాను వృత్తిరీత్యా ఇంజనీర్‌ను కాకున్నా, వేల మంది ఇంజనీర్లతో కలిసి పనిచేస్తున్నానన్నారు. ప్రతి పనికీ ఆర్థిక అవసరాలు ఉంటాయని, ఆ పనులు చేసిపెట్టే డిగ్రీని చదువుకున్న వాడినని చెప్పడంతో సభలో నవ్వులు కురిశాయి. విద్యుత్ వ్యవస్థ బలోపేతం కోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని, ప్రభుత్వ చర్యలు, ముందుచూపు కారణంగా డిమాండ్ పెరిగినా వ్యవస్థ తట్టుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో 1727 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగంతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్ర స్థానంలో ఉందన్నారు. వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, తీవ్రమైన కోతల నుంచి నిరంతర విద్యుత్ ఇచ్చే స్థాయికి చేరుకున్నామని, ముఖ్యమంత్రి కెసిఆర్ విజన్ వల్లే ఇది సాధ్యమైందని వివరించారు. సిపిఆర్‌ఐ డైరెక్టర్ జనరల్ విఎస్ నంద కుమార్ అధ్యక్షతన ఈ సదస్సు జరగగా, దేశ, విదేశాల నుంచి విద్యుత్ రంగ నిపుణులు సమావేశంలో పాల్గొన్నారు.

శివరాంపల్లి ప్లాంట్ పరిశీలన

220 కెవి హెచ్‌టిఎల్‌ఎస్ (హై టెంపరేచర్ లో శాగ్) కండక్టర్ నిర్మాణ పనులను టిఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శివరాంపల్లిలో జరుగుతున్న ఈ పనులను త్వరగా పూర్తిచేసి, నాణ్యమైన విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంలో భాగంగా రూ.100 కోట్ల వ్యయంతో హెచ్‌టిఎల్‌ఎస్ పనులు చేపట్టారు. ఇందులో రూ.59 కోట్ల వరకు పవర్ సిస్టం డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి గ్రాంటుగా వస్తుంది. ఈ పనులు పూర్తయితే నగరంలో 220 కెవి లైన్లపై ఉన్న సరఫరా ఒత్తిడి కొంత మేర తగ్గుతుంది. భవిష్యత్తులో పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా వ్యవస్థ సిద్ధమవుతుంది. అయితే ఈ పనులను త్వరగా పూర్తిచేయడానికి కార్మికులు, ఇంజనీర్ల సంఖ్యను పెంచాలని, 10వ తేదీ నాటికి పనులు పూర్తిచేయాలని ప్రభాకరరావు కాంట్రాక్టు ఏజెన్సీని ఆదేశించారు. సిఎండితో పాటు ట్రాన్స్‌కో డైరెక్టర్లు టి. జగత్‌రెడ్డి, జె.సూర్యప్రకాష్, సిఇ వివేకానంద, ఎస్‌ఇ రామరాజు తదితరులు తనిఖీలో పాల్గొన్నారు.



వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి తాళం!

పనివేళల్లో సైతం గేటుకు గొళ్లెం



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రం మొత్తానికి వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యాలయంగా సేవలందిస్తున్న కోఠిలోని ఆ శాఖ డైరెక్టర్ కార్యాలయం గత కొన్ని రోజులుగా నిత్యం తాళంతోనే కనిపిస్తోంది. ఆఫీసు పనివేళల్లో సైతం ప్రధాన ద్వారానికి తాళం, గొళ్ళెం వేసి ఉంటున్నాయి. కానీ లోపలి సిబ్బంది మాత్రం యధావిధిగా పనులు చేసుకుంటున్నారు. ఏదేని అవసరం నిమిత్తం వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, సామాన్య ప్రజానీకం ఆ కార్యాలయానికి వెళ్ళడంతోనే ప్రధాన ద్వారం దగ్గర తాళం వేసి ఉండడంతో విస్తుపోతున్నారు. పనిచేయాల్సిన సమయంలో సైతం తాళం వేసి ఉండడం చూసి ఆశ్చర్యపోతున్నారు.
కాపలాగా ఉన్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులు తాళం వేసి ఎందుకు ఉంచాల్సి వచ్చిందో వింత వాదన వివరిస్తున్నారు. ఆ శాఖ ఉన్నతాధికారి ఇచ్చిన ఉత్తర్వును తప్పుగా అర్థం చేసుకోవడమే ఈ మొత్తం వ్యవహారానికి ప్రధాన కారణం. పూర్వపరాల్లోకి వెళ్తే... ఈ కార్యాలయంలో పనిచేసే కొద్దిమంది సిబ్బంది ఇటీవల పేకాట ఆడుతుండడం, మద్యం సేవిస్తూ ఉన్నట్లు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోవడంతో పనివేళలు ముగిసిన తర్వాత ఆఫీసులో ఎవ్వరూ ఉండవద్దని ఉన్నతాధికారి సర్క్యులర్ మెమోను జారీ చేశారు. పనిఒత్తిడితో ఎవరైనా ఉండాల్సి వస్తే ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. సందర్శకులను కూడా మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల మధ్యే అనుమతిస్తామని ఆ అధికారి పేర్కొన్నారు. ఆ సర్క్యులర్‌ను కార్యాలయంలో పలు చోట్ల గోడలకు కూడా అంటించారు. ఒక అధికారిక కార్యక్రమంపై ఆ అధికారి ఢిల్లీ వెళ్ళడంతో ఆ సర్క్యులర్ సారాంశాన్ని అర్థం చేసుకోవడంలో చోటుచేసుకున్న పొరపాటుతో ఏకంగా కార్యాలయ ద్వారాలనే మూసివేసే స్థాయికి చేరుకుంది. వివిధ అధికారిక పనులమీదే జిల్లాల నుంచి అధికారులు, సిబ్బంది ప్రతి రోజూ ఈ కార్యాలయానికి వచ్చిపోతూ ఉంటారు. వీరెవరో గుర్తించలేని సెక్యూరిటీ గార్డులు ద్వారం దగ్గరే వారిని నిలిపేస్తున్నారు. ఆ కార్యాలయంలో పనిచేసేవారిని తప్ప ఎవరినీ అనుమతించమని వెనక్కి పంపించి వేస్తున్నారు. మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల మధ్యే రావాలని సూచిస్తున్నారు. ఈ పరిస్థితిని చూసి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వైద్యాధికారులు, ఉద్యోగులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఉదయం కార్యాలయ సిబ్బంది ఆఫీసుకు వచ్చిన తర్వాత ప్రధాన ద్వారాన్ని బయటి నుంచి తాళం వేసి ఎవరూ వెళ్లకుండా నిలువరించడాన్ని అక్కడ పనిచేసే ఉద్యోగులు కూడా తప్పుపడుతున్నారు. కార్యాలయ సిబ్బంది చేస్తున్న అసాంఘిక కార్య కలాపాలు వెలుగు చూశాయనే కోపంతోనే కొందరు అధికారులు ఈ చర్యలకు పాల్పడుతున్నారని, సర్క్యులర్‌లో స్పష్టత ఉన్నా సాకుగా చూపి ఇలా తాళం వేస్తున్నారని గుసగుసలాడుకుంటున్నారు.

అయ్యప్ప కేసులో మలుపు

సంపాదకీయం

శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళలందరినీ అనుమతిస్తూ ఇచ్చిన తీర్పును తిరిగి పరిశీలించాలని దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ ఆసక్తికరమైన మలుపుతో ముగియడం విశేషం. అసలు కేసులో విచారణ సందర్భంలో రుతుస్రావ వయసు (10 – 50 సంవత్సరాలు) లోని మహిళల ప్రవేశంపై గల సంప్రదాయపరమైన నిషేధానికి అనుకూలంగా గట్టిగా వాదించిన ఆలయ పాలక వ్యవస్థ తిరువాన్కూరు దేవాస్థానం బోర్డు రివ్యూ పిటిషన్‌పై విచారణలో అందుకు పూర్తి విరుద్ధంగా సుప్రీంకోర్టు తీర్పును సమర్థిస్తూ వాదనలు వినిపించడం ఈ కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం అంతిమ నిర్ణయంపై ప్రభావం చూపే అవకాశమున్నది. ఆలయంలోకి రుతు స్రావ వయసులోని మహిళలకు అనుమతిని నిరాకరించడం స్త్రీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడడం కిందికే వస్తుందని, శరీరంలో కలిగే మార్పుల ఆధారంగా వారిని వెలికి గురి చేయడం నిషేధిత అంటరానితనం దురాచారాన్ని పాటించడంగానే భావించాలని సుప్రీంకోర్టు గత సెప్టెంబర్‌లో ఇచ్చిన చరిత్రాత్మకమైన మెజారిటీ తీర్పులో స్పష్టం చేసింది. ఆ విధంగా శబరిమలలో పురుషులతో సమానమైన ప్రతిపత్తిని మహిళలకు కట్టబెట్టింది. రాజ్యాంగం 51 ఎ (ఇ) అధికరణ జాతికి నిర్దేశిస్తున్న శాస్త్రీయ చైతన్యం, మానవత్వం, హేతుతత్వం అలవర్చుకోవాలనే ప్రాథమిక విధికి తద్వారా సుప్రీంకోర్టు పట్టం కట్టింది. వ్యక్తుల, సమూహాల విశ్వాసాలు, మత సంప్రదాయాలు రాజ్యాంగపరమైన సమానత్వ సూత్రానికి లోబడి ఉండవలసిందేననే సందేశాన్ని చాటింది. విచిత్రమేమిటంటే ముస్లింల విడాకుల సంప్రదాయంలోని ముమ్మారు తలాక్ పద్ధతిని రద్దు చేస్తూ ఆ మేరకు వారి మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని చాటుకుంటూ ఆర్డినెన్స్ తెచ్చిన కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ సారథి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శబరిమలపై సుప్రీంకోర్టు తీర్పును వమ్ము చేయించే లక్ష్యంతో అక్కడ రోజుల తరబడి ఉద్రిక్తమైన ఆందోళన జరగడం. గుడిలో ప్రవేశించడానికి వెళ్లిన కొంత మంది మహిళలను ఆందోళనకారులు భయోత్పాతానికి గురి చేసి వెనుకకు మళ్లించడం, వారికి సామాజిక వెలి వంటి దుస్థితి ఎదురయ్యేలా చూడడం విదితమే.

తీర్పును పునస్సమీక్షించాలని కోరుతూ దాఖలైన 65 పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు బుధవారం నాడు ముగించి తీర్పును మాత్రం వాయిదా వేసింది. విచారణ సమయంలో పిటిషనర్ల తరపు న్యాయవాదులు సుప్రీం తీర్పులో తప్పుడు సూత్రీకరణలనదగినవి ఉన్నాయని ఎత్తి చూపారు. రుతు స్రావంలోని మహిళలకు అనుమతి నిరాకరణలో అంటరానితనం, వెలి వంటిదేమీ లేదని దానిని ఆ దృష్టితో చూడవద్దని అది ఆలయ మూల విరాట్టుకున్న సహజ స్థితికి సంబంధించిన నిబంధన మాత్రమేనని వాదించారు. తీర్పులో మెజారిటీ జడ్జీలు పేర్కొన్నట్టు రాజ్యాంగ నైతికత అనేదానికి ఆస్కారం లేదని కూడా అభిప్రాయపడ్డారు. మహిళలపై నిషేధం హిందూ మతంలో అంతర్భాగంకాని దాని అవసరంకాని కాదని తీర్పులో పేర్కొన్న దానిని కూడా వ్యతిరేకించారు. మతానికి ఏది ముఖ్యమో కోర్టులు చెప్పజాలవని వాదించారు. అయితే అసలు కేసు విచారణలో మహిళలపై నిషేధం ఎత్తివేతను తీవ్రంగా వ్యతిరేకించిన తిరువాన్కూరు దేవస్థానం బోర్డు ఇప్పుడు రాజ్యాంగాన్ని గౌరవిస్తూ జడ్జిమెంట్‌ను సమర్థిస్తున్నట్టు తెలియజేయడం హర్షించదగిన పరిణామం. దేవస్థానం బోర్డులో కేరళ ప్రభుత్వ ప్రతినిధులు కూడా ఉంటారన్నది వాస్తవమే. దానిపై రాష్ట్ర పాలకుల అదుపాజ్ఞలూ నిజమే. కేరళలో ఉన్నది మార్క్సిస్టుల ప్రభుత్వం కాబట్టి వారిది సమానత్వ, సెక్యులర్ పాలక నీతి కనుక వారు చెప్పినట్టు బోర్డు నడుచుకొని ఉండవచ్చు. అయితే అది దేశ, సమాజ హితాన్ని కోరేది స్త్రీకి పురుషుడితో సమానమైన ఆధ్యాత్మిక గుర్తింపును ఇచ్చేది కావడమే ఇక్కడ గమనించవలసిన విషయం. ఇతరత్రా అనేక సందర్భాల్లో పురుషులతో మహిళలూ సమాన గౌరవాన్ని పొందడాన్ని హర్షించే సమాజం మనది. స్త్రీని దేవతగా పూజించే సంప్రదాయం వేళ్లానుకున్నది. పైపెచ్చు సర్వసమానత్వం లక్ష్యంగా పలు అధికరణలు, ఆదేశిక సూత్రాలు పొందుపరుచుకున్న రాజ్యాంగపరమైన ప్రజాస్వామ్యాన్ని పరిపూర్ణంగా నెలకొల్పుకుంటామని సంకల్పం చెప్పుకున్న జాతి మనది. దేశంలోని జన జీవన విధానాలపై రాజ్యాంగం వెలుగులో దిశా నిర్దేశం చేసే సుప్రీంకోర్టు శబరిమల కేసులో ఇచ్చిన తీర్పును రివ్యూ పిటిషనర్ల తరపు న్యాయవాదులు అదే రాజ్యాంగ సూత్రాల ప్రాతిపదికగా సవాలు చేయలేకపోవడం వారి వాదనల్లో స్పష్టంగా కనిపిస్తున్న లోపం. సుప్రీంకోర్టు అంతిమ తీర్పు ఏ విధంగా ఉండనున్నప్పటికీ దేవస్థానం బోర్డు అసలు జడ్జిమెంటును సమర్థించడం ఒక మంచి పరిణామం.

ప్రియాంక కుటుంబ ప్రేమ!



వాహెద్
7093788843

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రాబర్ట్ వాద్రాను సుదీర్ఘంగా ప్రశ్నించింది. ప్రియాంక గాంధీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు తన భర్తతో కలిసి ఇడి కార్యాలయంలో భర్తను వదిలి కాంగ్రెస్ ఆఫీసుకు వెళ్ళారు. ఈ కేసు గురించి ఏమంటారని అడిగితే, వాద్రా నా భర్త, ఆయన నా కుటుంబం, నా కుటుంబానికి మద్దతుగా ఉంటాను. ఏం జరుగుతుందో ప్రపంచానికి తెలుసు అన్నారు. విచారణ ఎదుర్కొంటున్న భర్త గురించి ఒక భార్య చెప్పిన మాటలు మాత్రమే కాదు, ఇది రాజకీయ ఎత్తుగడ కూడా. కాంగ్రెస్ పార్టీ అంటే కేవలం ఆ ఒక్క కుటుంబం మాత్రమే అని మోడీతో సహా బిజెపి నేతలంతా విమర్శిస్తున్న సంగతి తెలిసి కూడా ప్రియాంక ఈ మాటలు చెప్పారంటే ఇవి వ్యూహాత్మకంగా చెప్పిన మాటలు. కుటుంబం, కుటుంబ సభ్యుల పట్ల ప్రేమాభిమానాలు, అప్యాయతలు సగటు మనిషికి సెంటిమెంట్లు. కుటుంబ సభ్యులు కష్టాల్లో ఉన్నప్పుడు వారితో నిలబడడం సెంటిమెంట్. కుటుంబం ఉన్నవారికే ప్రేమాభిమానాలుంటాయన్న నిగూఢమైన సందేశం ఆమె మాటల్లో ఉంది. ఈ సందేశాన్ని ప్రజలు ఎలా స్వీకరిస్తారో వేచి చూడాలి.

అటు రాబర్ట్ వాద్రాను ఇడి అధికారులు ప్రశ్నించడం ప్రారంభించిన వెంటనే బిజెపి ప్రతినిధి సంబిత్ పాత్రా తీవ్రమైన విమర్శలతో మీడియా ముందుకు వచ్చాడు. అగస్టా వెస్ట్ ల్యాండ్ కుంభకోణంలో వాద్రా ప్రమేయం ఉందన్నారు. యుపిఎ ప్రభుత్వ కాలంలో అనేక



విధాలుగా అవినీతికి వాద్రా పాల్పడ్డాడని, గాంధీ, నెహ్రూ కుటుంబం బెయిలు కుటుంబమని, రాహుల్ గాంధీ క్రిమినల్ నెంబర్ వన్ అని, రాబర్ట్ వాద్రా క్రిమినల్ నెంబర్ 2 అని చాలా దురుసుగా ఆయన మాట్లాడిన మాటలు చాలా మందికి నచ్చలేదు. సోషల్ మీడియాలో సంబిత్ పాత్రాపై ట్రోలింగ్ కూడా జరిగింది.

మరోవైపు వాద్రాను ఇడి ప్రశ్నించడం ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే జరిగిన పరిణామం. ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంపై బిజెపికి చెందిన సుబ్రహ్మణ్య స్వామి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ప్రియాంక 'బైపోలార్ డిజార్డర్' అనే మానసిక రుగ్మతతో బాధపడుతోందని అన్నారు. ప్రియాంక అందమైన బొమ్మ మాత్రమేనని, ఆమెకు రాజకీయంగా ఎలాంటి నైపుణ్యం లేదని బీహార్ మంత్రి వినోద్ నారాయణ్ ఝా వ్యాఖ్యానించాడు. అవినీతి, కళంకిత మనిషి రాబర్ట్ వాద్రా భార్య కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు చేపట్టడం బిజెపికి లాభిస్తుందని బీహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ మోదీ వ్యాఖ్యానించారు. చాకొలేట్ ఫేస్‌లతో లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొందామని కాంగ్రెస్ నేతలు కలలుగంటున్నారు అని ఎద్దేవా చేశారు. ఈ అవహేళనలతో బిజెపి ఏం సాధించగలదు. పప్పు... పప్పు అని రాహుల్ ని హేళన చేసి సాధించిందేమిటి? వరుసగా అసెంబ్లీ ఎన్నికలు ఓడిపోయారు. ప్రజల సానుభూతిని అర్థం చేసుకోవడంలో బిజెపి పప్పులో కాలేస్తున్నట్లు కనిపిస్తోంది.

రాజకీయ అవినీతిని కూకటివేళ్ళతో పెకలించేస్తానని 2014లో మోడీ చెప్పారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తానని అన్నారు. బలమైన లోక్‌పాల్ తీసుకొస్తామన్నారు. ఎన్నికల విరాళాలను ప్రక్షాళన చేస్తానన్నారు. ఇవేవీ జరగలేదు. ఒక్క కేసు కూడా కొలిక్కి రాలేదు. 2జి కేసులో ఎవరికీ శిక్షలు పడలేదు. బొగ్గు కుంభకోణం, కామన్వెల్త్ కుంభకోణం ఇలా అనేక కుంభకోణాల పేర్లు 2014 ఎన్నికల్లో వినిపించాయి. ఇప్పుడు వాటి గురించి ఎవరూ ప్రస్తావించడం లేదు. వాద్రా పేరు కూడా 2014 నుంచి ప్రతి ఎన్నికకు ముందు వినిపిస్తుంది. తర్వాత ఎవరూ పట్టించుకోరు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులను అణచేయడానికి సాధనాలుగా ఉపయోగిస్తున్నారన్న అనుమానాలు నానాటికి బలపడుతున్నాయి. కర్ణాటక ఎన్నికలకు ముందు రెడ్డి సోదరులకు సిబిఐ ఊరట ఎందుకు ఇచ్చింది? కర్ణాటక కాంగ్రెస్ నాయకుడు శివకుమార్ పై మాత్రమే దాడులు ఎందుకు జరిగాయి? మాయావతి, అఖిలేష్ యాదవ్ కూటమి కట్టిన వెంటనే 12 సంవత్సరాల పాత కేసును సిబిఐ ఎందుకు తిరగదోడింది? ఈ పని ముందే ఎందుకు చేయలేదు? చంద్రబాబు నాయుడు ఎన్‌డిఎపై ధ్వజమెత్తిన తర్వాత మాత్రమే పాత కేసులు ఎందుకు ముందుకు వస్తున్నాయి? మాయావతిపై ఇడి ఇటీవల కాలంలో ఎందుకు దృష్టి కేంద్రీకరించింది? మమతా బెనర్జీని ఇబ్బంది పెట్టేలా శారదా స్కాం విషయంలో ఇప్పుడే విచారణ వేగం చేశారెందుకు? ఇంతకు ముందే ఈ పని ఎందుకు చేయలేదు? ఇలాంటి చాలా చాలా ప్రశ్నలు ఇప్పుడు ముందుకు వస్తున్నాయి. ఒడిశాలో నవీన్ పట్నాయక్ కూడా తన పార్టీకి వ్యతిరేకంగా సిబిఐని ఉపయోగిస్తున్నారని అంటున్నారు. పశ్చిమబెంగాల్లో సిబిఐ దాడులు ఇప్పుడు ప్రతిపక్ష ఐక్యతకు దారితీశాయి. బిజెపి, సిబిఐ, ఇడి, ఆదాయపన్ను శాఖలన్నీ ఒకవైపు, ప్రతిపక్షాలన్నీ ఒకవైపు అన్నట్లు ప్రతిపక్ష నేతలు మాట్లాడుతున్నారు.

మమతా బెనర్జీ ఎందుకు పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌ను కాపాడ్డానికి ప్రయత్నిస్తున్నారు? ఆయన వద్ద ఉన్న రహస్యాలేమిటి? అని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. కాని ఈ ప్రశ్న బిజెపికి కూడా వర్తిస్తుంది. సిబిఐ స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్థానాను కాపాడ్డానికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు తాపత్రయపడుతుంది? ఆయన వద్ద ఉన్న రహస్యాలేమిటి? అనే ప్రశ్నలు వస్తాయి. ఎందుకంటే, సిబిఐలో అవినీతి నిరోధక విభాగానికి అధిపతిగా వ్యవహరించిన డిఐజి స్థాయి అధికారి ఎం.కె.సిన్హా సుప్రీంకోర్టులో ఒక అఫిడవిట్ దాఖలు చేశారు. ప్రధానమంత్రి కార్యాలయం సిబిఐ విచారణల్లో జోక్యం చేసుకుంటుందని అన్నారు. అంతేకాదు, ప్రభుత్వ యంత్రాంగమంతా సిబిఐ స్పెషల్ డైరెక్టర్ రాకేష్ అస్థానాను కాపాడ్డానికి పూనుకున్నట్లుంది చెప్పారు. సిబిఐ అంటే సెంటర్ ఫర్ బోగస్ ఇన్వెస్టిగేషన్‌గా మారిపోయిందని, ఇడి అంటే ఎక్స్ టార్షన్ డైరెక్టరేట్ అయిపోయిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత అరవై సంవత్సరాల్లో ఇలాంటి వ్యాఖ్యలు ఎన్నడూ వినరాలేదు. మరోవైపు సిబిడిటి చైర్మనుకు 2019 మే వరకు పదవీకాలం పొడిగింపు ఇచ్చారు. ఆయన రిటైరై చాలా కాలమైనా ఆయనపట్ల ప్రభు త్వం ఎందుకు అంత ఔదార్యంతో వ్యవహరిస్తుందన్న ప్రశ్నలతో పాటు, ఆయనకు సంబంధించి ఆరోపణలు కూడా మీడియాకు లీకవుతున్నాయి.ఆదాయపన్ను శాఖలోనూ ప్రస్తుత పరిస్థితులపట్ల అసంతృప్తి రగులుతున్నట్టు వార్తలు వచ్చాయి. సిబిఐలో అలోక్ వర్మ, రాకేష్ అస్థానాల మధ్య వివాదం, అందులో కేంద్రం తలదూర్చిన తీరుపై కూడా అనేక ప్రశ్నలు పుట్టాయి. సిబిఐ విచారణ చేస్తున్న కేసులన్నీ సరయినవే కావచ్చు. కాని సిబిఐ కేవలం ఎంపిక చేసుకున్న కేసులను, ఎన్నికలకు ముందు మాత్రమే విచారణ చేయడం అనుమానాలకు తావిస్తుంది.అధికారంలోఉన్న బిజెపి కేంద్ర దర్యా ప్తు సంస్థను జేబు సంస్థగా వాడుకుంటుందన్న అభిప్రాయం బలపడేలా చేస్తోంది. ఫాస్ట్ ట్రాక్ ద్వారా కేసులను త్వరగా తేల్చి దోషులకు శిక్షలు పడేలా చేసి ఉంటే విశ్వసనీయత పెరిగేది. కాని ప్రభుత్వంలో ఉండి కూడా బిజెపి ఒక ప్రతిపక్షం మాదిరిగా ఆరోపణలకే పరిమితమవుతుంది తప్ప చర్యలు లేవు.



శిలువపై స్త్రీ శిశువులు!



కాళంరాజు వేణుగోపాల్
8106204412

ఈ మధ్య పేపర్ చదివే వాళ్ళ కు ఒక సమస్య తీవ్రంగా ఆలోచింప చేసింది. తెలుగు రాష్ట్రాలలో 6 సంవత్సరాలలోపు శిశువుల లింగ నిష్పత్తిలోతేడా దారుణంగా ఉండడం. సాధారణంగా ఈ సమస్య అధికంగా ఉండే పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, తెలంగాణలలో నవజాత శిశువుల లింగ నిష్పత్తి క్రమంగా తగ్గుతోందని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ వెలువరించిన సమాచారం ద్వారా వెల్లడైంది. 2007 నుంచి 2016 వరకు ఆయా రాష్ట్రాలలో ఎస్‌ఆర్‌బిలను విశ్లేషణ చేసి ఈ ఫలితాలను వెల్లడించారు. దీని ప్రకారం దక్షిణాది రాష్ట్రాలలో బాలికల ఎస్‌ఆర్‌బి ప్రమాదంలో ఉన్నది. తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో బాలబాలికల నిష్పత్తిలో అంతులేని అంతరం ఉన్నట్టు తాజా పరిశీలనలు తేల్చి చెప్పాయి. 2007 నుంచి 2016కి ఆంధ్రప్రదేశ్ బాలబాలికల నిష్పత్తి దేశంలోకెల్లా అత్యంత దారుణంగా పడిపోయి సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో బాలబాలికల నిష్పత్తి 2007 నుంచి, 2016కి 168 పాయింట్లు పడిపోయి ప్రతి వెయ్యి మంది మగపిల్లలకు ఆడ పిల్లలు కేవలం 806 మంది ఉన్నట్టు తేలింది. 2007లో ప్రతి వెయ్యి మంది మగపిల్లలకు 974 మంది ఆడపిల్లలుంటే ఆ సంఖ్య తీవ్రంగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. తమిళనాడులోఈ సంఖ్య 2007లో 935గా ఉంటే 2016లో 840 మందికి పడిపోయింది. దేశ సగటు (877 మంది) తో పోల్చుకుంటే ఈ రెండు రాష్ట్రాల సంఖ్య ప్రమాదకర స్థాయిలోఉన్నది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో బాలబాలికల లింగ నిష్పత్తి ప్రతి వెయ్యి మంది బాలురకు 954 మంది బాలికలు వున్నారు. 2016 నాటికి 73 పాయింట్లు పడిపోయి ఆడపిల్లల సంఖ్య మరింత క్షీణించి 881కి చేరింది. దక్షిణాది రాష్ట్రాలే గాక ఉత్తరాదిలో బీహార్, యుపిలో కూడా బాలికల నిష్పత్తిలో అంతరం స్పష్టంగా కనిపిస్తోంది. గణాంకాల ప్రకారం యుపిలో 885 మంది, బీహార్‌లో 837 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. కాగా, కేరళలో మాత్రం ఎప్పటిలాగే నవజాత శిశువుల లింగ నిష్పత్తిలో ఆ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నది. 2016లో కేరళలో వేయి మంది బాలురకు 954 మంది బాలికలు ఉన్నారు. ఇది దేశ సగటు కంటే అధికం కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాల్లో స్త్రీ పురుష అంతరాలు అంతకంతకూ అధికమవుతున్నట్టు తాజా అధ్యయనాలలో వెల్లడయ్యాయి. కర్ణాటకలోనూ పరిస్థితి ఇదే కొనసాగుతోంది. కర్నాటకలో 2007 – 2016 మధ్య బాలబాలికల లింగ నిష్పత్తి 108 పాయింట్లు పడిపోయింది. తమిళనాడులో 95 పాయింట్లు పడిపోయి ఆ రాష్ట్రంలో సైతం లింగ నిష్పత్తి వ్యత్యాసం అధికంగా ఉంది. ఇదే సమయంలో గోవాలో 47 పాయింట్లు పడిపోయింది.

దక్షిణ భారతదేశంలో కేవలం కేరళలో మాత్రమే లింగ నిష్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించింది. కేరళలో లింగ నిష్పత్తి 10 పాయింట్లు పెరిగి ప్రతి వెయ్యి మంది బాలురకు 2007లో 944 మంది ఆడపిల్లలు పుడితే 2016 కి ప్రతి వెయ్యి మంది మగపిల్లలకు 954 మంది ఆడపిల్లలు ఉండడం ఆశావహంగా కనిపించింది. ఇదే కాలంలో ఒడిశాలో చైల్ సెక్స్ రేషియో 61 పాయింట్లు పడిపోయింది. ఉత్తరాఖండ్ లో 44 పాయింట్లకు పడిపోయింది. 2016లో ఆంధ్రప్రదేశ్, ఆడపిల్లల సంఖ్య అతి తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందుంటే రాజస్థాన్ కూడా అదే స్థితిలో ఉంది. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రతి వెయ్యి మంది మగపిల్లలకీ ఆడపిల్లలు కేవలం 806 మంది ఉంటున్నారు. ప్రతి వెయ్యి మంది మగపిల్లలకి ఆడపిల్లలు ఉత్తరాఖండ్‌లో 825 మంది, బీహార్‌లో 837 మందికే పరిమితమయ్యారు. తమిళనాడు ఆడపిల్లల నిష్పత్తిలో ఐదో స్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో ప్రతి వెయ్యి మంది మగపిల్లలకు 840 మంది ఆడపిల్లలే ఉంటున్నట్టు గణాంకాలు వెల్లడించాయి.

2011 జనాభా లెక్కల ప్రకారం బాల, బాలికల లింగ నిష్పత్తి వేగంగా తగ్గిపోవడాన్ని గుజరాత్ నిరోధించగలిగింది. అయితే ఇప్పటికీ జాతీయ సగటు నిష్పత్తికి దూరంలోనే ఉంది. తొంబ్బై దశకంలో ప్రతి వేయి మంది బాలురకు 883 మంది బాలికలు ఉన్నారు. అంతకు ముందు దశాబ్దంలో వేయి మంది బాలురకు 928 బాలికలు ఉండేవారు. కాగా 2011 లెక్కల ప్రకారం ఈ నిష్పత్తి 1000 : 886 గా ఉంది. బాలబాలికల

2016లో కేరళలో వేయి మంది బాలురకు 954 మంది బాలికలు ఉన్నారు. ఇది దేశ సగటు కంటే అధికం కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాల్లో స్త్రీ పురుష అంతరాలు అంతకంతకూ అధికమవుతున్నట్టు తాజా అధ్యయనాలలో వెల్లడయ్యాయి. కర్ణాటకలోనూ పరిస్థితి ఇదే కొనసాగుతోంది. కర్నాటకలో 2007 – 2016 మధ్య బాలబాలికల లింగ నిష్పత్తి 108 పాయింట్లు పడిపోయింది. తమిళనాడులో 95 పాయింట్లు పడిపోయి ఆ రాష్ట్రంలో సైతం లింగ నిష్పత్తి వ్యత్యాసం అధికంగా ఉంది.

నిష్పత్తి తగ్గిపోవటంతో ఆందోళలన చెందిన అధికారులతో పాటు పౌర సమాజం 'బేటీ బచావో ఆందోళన్' కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా జాతీయ స్థాయిలో బాల, బాలికల నిష్పత్తి 1000 : 914 గా ఉన్నట్లు సోషియాలజిస్ట్ గౌరంగ్ జానీ వెల్లడించారు.

అంతా వెనుకబడ్డాయని భావిస్తున్న ఈశాన్య రాష్ట్రాలలో దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఎంతో మేలు. లింగ నిష్పత్తిలో ఈశాన్య రాష్ట్రాల పరిస్థితి మెరుగ్గా ఉన్నట్టు ఈ అధ్యయనం తేల్చి చెప్పింది. సిక్కింలో ప్రతి వెయ్యిమంది మగపిల్లలకు అత్యధికంగా 999 మంది ఆడపిల్లలు ఉంటున్నారు. ఇది నిజంగా ఆదర్శనీయం. ఇది భారత దేశంలోనే అత్యంత ఎక్కువ లింగ నిష్పత్తి గల రాష్ట్రం. నాగాలాండ్‌లో 967 మంది, అరుణాచల్ ప్రదేశ్‌లో 964, మిజోరాం సైతం 964, త్రిపురలో 917 మంది ఆడపిల్లలతో 2016లో పుట్టుకలో లింగనిష్పత్తి విషయంలో మెరుగ్గా ఉన్నట్టు తేలింది. అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లో 987 మంది ఆడపిల్లలు, చత్తీస్‌గఢ్‌లో 980 మంది ఆడపిల్లలు, డామన్ దయ్యూలో 974 మంది ఆడపిల్లలతో ప్రతి వెయ్యి మంది మగపిల్లలతో పోటీపడుతున్నాయి.

పుట్టేబిడ్డ ఆడో, మగో స్కానింగ్‌లతో తెలుసుకుని ఆడపిల్ల అయితే అబార్షన్ చేయించే సంఘటనలు ఇరవై ఏళ్ళ క్రితం జరిగేవి. ప్రస్తుతం అటువంటి భ్రూణ హత్యలు కొంత తగ్గాయి. ఇరవై ఏళ్ల నాటి 'అబార్షన్' ప్రభావం ఇప్పుడు కనిపిస్తోంది. అమ్మాయిలకు కొరత ఏర్పడి పిల్లనిస్తామంటే కానుకలు ఇచ్చే పరిస్థితులు తలెత్తాయి. చదువుకున్న వారు, ఉద్యోగస్తులు ఒకరికే ప్రాధాన్యం ఇవ్వడం, ముఖ్యంగా కొన్ని కులాల వాళ్ళు అమ్మాయి కంటే అబ్బాయికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం గర్భంలో ఆడపిల్ల ఉందని తెలిస్తే అబార్షన్‌కు మొగ్గుచూపుతున్న సందర్భాలే అధికం. ఇది కొన్ని చోట్ల మహిళలకు ప్రాణాంతకంగా మారే ప్రమాదముంది. అయినప్పటికీ అమ్మాయి అయితే నిర్దాక్షిణ్యంగా తీసేస్తున్నారు. లింగ నిర్ధారణ వల్ల దేశంలో స్త్రీల సంఖ్య తగ్గి తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. ఎన్ని చట్టాలు చేసినా ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలు ఆగకపోగా వాటి నివారణకు ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు అంతంత మాత్రమే.

ఆకాశంలో సగం, అవనిలో సగం అనుకుంటున్నా ఆడవారి జనాభా ప్రశ్నార్థకం అవుతుంది. ఆడపిల్ల వద్దు, మగపిల్లాడు ముద్దు అనే నేటి నవ నాగరిక కుటుంబ గణితంలో పిల్లలకు ఎప్పుడో కూడిక, తీసివేత సంకేతాలను స్థిరపరిచారు. భారతదేశ సామాజిక వ్యవస్థలోని అవలక్షణాలు ఎందరో స్త్రీలను బలి తీసుకుంటున్నాయి. స్త్రీ జన్మే శాపమై పసికందులుగా ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారెందరో. పిండం స్త్రీగా లేదా పురుషునిగా వృద్ధి చెందడానికి పూర్తిగా తండ్రిలోని జన్యువులే కారణమని ఇందులో తల్లి ప్రమేయం ఏమీ ఉండదని ప్రజలకు తెలియజేయాలి. ఆడబిడ్డని పెంచటం ఒక ఎత్తయితే విద్యాబుద్ధులు చెప్పించటం మరో ఎత్తు. కట్నకానుకలు ఇచ్చి పెళ్ళిచేయడం ఇంక మరో సమస్య.

పురుషాధిక్య సమాజంలో స్త్రీ దౌర్భాగ్య స్థితికి వీళ్ళ ధోరణి అద్దం పడుతుంది. మహిళా దినోత్సవాలు ఏటేటా జరుపుకుంటున్నా, రాజకీయ రంగంలో సైతం స్త్రీలు రాణిస్తున్నా ఇంకా బాలికల పట్ల నిర్లక్ష్యం వీడలేదు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల మహిళల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు 18 సంవత్సరములు నిండకుండానే తల్లులు అవుతున్నారు. మన సమాజంలో గర్భస్థ శిశువు ఆడ అని తెలియగానే గర్భస్రావానికి పాల్పడి ప్రాణాలు పోగొట్టుకొనే మహిళలు ఎందరో ఉన్నారు. దీన్నిబట్టి సామాజిక దౌష్ట్యానికి స్త్రీలు ఎలా బలవుతున్నారో అర్థమవుతుంది. గర్భస్థ పిండంగా ఆమెకు చట్టం రక్షణ కల్పిస్తుంది. అది సరిగా అమలు కావడం ప్రజల సహకారం మీదనే ఆధారపడి ఉంటుంది. నేరస్థుల్ని చట్టానికి పట్టివ్వడం పౌర ధర్మం. బాధ్యత గల పౌరులుగా వ్యవహరించి ప్రభుత్వ అధికారులకు సహకరిస్తే వాటిని అరికట్టవచ్చు. విచిత్రం ఏమిటంటే ఆడపిల్లకు జరిగే అన్నిరకాల అన్యాయాలను అడ్డుకోవడానికి రకరకాల చట్టాలు తెచ్చారు. గర్భస్థ పిండపరీక్ష ప్రక్రియ నియంత్రణ నివారణ చట్టం, విద్యాహక్కు చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, వివాహ నిరోధక చట్టం, అత్యాచార నిరోధక చట్టం, నిర్భయ చట్టం, గృహ హింస నిరోధక చట్టం ఇలాంటివి కోకొల్లలు. అయినప్పటికీ సమాజంలో మార్పు రాక, ప్రభుత్వ ఉదాసీనత, డబ్బు, పలుకుబడి గల వ్యక్తులకు భయపడి ఇలా రకరకాల కారణాలతో బాల్య వివాహాలు, వరకట్నాలు, అత్యాచారాలు, ఇతర పరిస్థితులకు బలి అవుతున్న వారెందరో ఉన్నారు. కొన్ని చట్టాలు పేపర్‌కే పరిమితం కావడం జరుగుతుంది. అలాంటి వాటికి పదును పెట్టి సమాజంలో బాలికలకు రక్షణ చూపించకపోతే సమాజం అధోగతి పాలు కావాల్సి వస్తుంది. ఇది ప్రతి ఒక్కరు తెలుసు కోవలసిన విషయం.

వెండితెరపై 'చేనేత' జీవన దృశ్యాలు



కోడం పవన్‌కుమార్
9848992825

భారీ బడ్జెట్ సినిమాలకు చిరునామాగా మారిన తెలుగు చలనచిత్ర రంగంలో ఓ సామాజిక వెనుకబడిన నేపథ్యంతో చిత్రం తీయడం సాహసోపేతమైన యత్నం. కూడు, గూడు తర్వాతి స్థానంలో ఉన్న గుడ్డ... అదే చేనేత వృత్తి జీవనాధారంగా వివిధ భాషల్లో వచ్చిన చిత్రాలను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. తెలంగాణ ప్రాంతం నుంచి ఇప్పటికే 'సుస్మన్' పేరుతో ఓ హిందీ చిత్రం వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తెలుగులో 'మల్లేశం' పేరుతో చిత్ర రూపకల్పన జరుగుతుండడం ఓ అరుదైన అపూర్వమైన ప్రయత్నంగా చెప్పుకోవచ్చు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత భాష, యాస, కట్టుబాట్లు, సంస్కృతి, సంప్రదాయాలను మేళవించి ఇక్కడి గ్రామీణ వాతావరణంలో రూపుదిద్దుకుంటున్న చిత్రాల సంఖ్య క్రమంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా పద్మశాలీల కుల వృత్తి అయిన చేనేతలోని ఎత్తుపల్లాలు, కష్టనష్టాలు, ఆకలి చావులు ఇత్తివృత్తంగా తీసుకుని కోయిలమ్మ కూసింది, సుస్మన్, సిల్కు మారియానో... తదితర చిత్రాలు ముప్పై, నలభై ఏళ్ల క్రితమే వచ్చాయి. తాజాగా 'మల్లేశం' పేరుతో నిర్మాణం జరుగుతున్న ఈ చిత్రంలో పాలుపంచుకుంటున్న వారందరూ తెలంగాణ ప్రాంతానికి చెందినవారు కావడం విశేషం.

సత్యజిత్‌రే సినిమాల స్ఫూర్తితో ఫ్రాన్స్‌కు చెందిన మార్సియనో అనే మహిళ పారిస్‌లో ఫిల్మాలజీపై అధ్యయనం చేసింది. 1973 నుంచి 1985 వరకు ఆమె ఫ్రెంచ్ టెలివిజన్‌కు అనేక చిత్రాలు అందించింది. ఇందులో భాగంగా 'సిల్క్ మారియానో' పేరుతో తీసిన చిత్రం అనేక ప్రశంసలు అందుకుని దర్శకురాలుగా గుర్తింపు తెచ్చిపెట్టింది. 1914లో పారిస్‌లో జరిగిన ఓ వాస్తవిక కథ ఆధారంగా తీసిన చిత్రమిది. పారిస్ నగరంలోని ఓ డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో మార్సియానో పేరుతో ఓ మహిళ పనిచేస్తుండేది. ఓ రోజు శిశిర కాలపు సాయంత్రం వేళ ఆమె పొడుగాటి పట్టు వస్త్రం ధరించి వచ్చింది. ఒక్కసారిగా అక్కడి వాతావరణం మారిపోయింది. ప్రతిఒక్కరూ ఆమె అందానికి అబ్బురపడుతూ పొగడ్తలు అభినందనలతో కొనియాడారు. ఆ ఉన్మత్త ఏకాంతంలో మార్సియానోను గత జ్ఞాపకాలు వెంబడించి కలవరానికి గురిచేశాయి. వెంటనే ఆమె స్పృహ కోల్పోయింది.

స్త్రీ, పురుష లైంగిక సంబంధాలకు తోడ్పాటు, ప్రతీక, ఉత్ప్రేక్షగా పట్టు వస్త్రం ఉన్నట్లు అక్కడివారు గుర్తించారు. ఈ కథాంశాన్ని తీసుకుని మార్సియనో ఫ్రెంచ్ టెలివిజన్‌కు 'సిల్క్ మారియనో' పేరుతో సినిమా తీసింది. ఇందులో పట్టు వస్త్రం నేసిన చేనేతకారుల జీవితం కూడా చిత్రీకరించారు. తన పేరు కలిగివున్న మార్సియనోను తెరకెక్కించడంతో ఈ సినిమా పెద్ద సంచలనం సృష్టించి దర్శకురాలుకు కీర్తి తెచ్చిపెట్టింది. పారిస్‌లో 'సిల్క్ మారియనో' పేరుతో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ షోరూం ప్రపంచ ప్రఖ్యాతిపొంది ఇప్పటికీ ప్రజాదరణ పొందుతున్నది. ఇక తెలుగులో 1976లో వై.ఆర్.బాబు దర్శకత్వంలో 'కోయిలమ్మ కూసింది' పేరుతో చిత్ర నిర్మాణం జరిగింది. తెలుగులో వచ్చిన పూర్తి నిడివిగల చేనేత సినిమాగా చెప్పుకోవచ్చు. చితికిపోయిన ఓ చేనేత కుటుంబ నేపథ్యాన్ని తీసుకుని ఈ సినిమా తీశారు. కానీ, ఆర్థిక ఇబ్బందుల వలలో చిక్కుకుని ఈ సినిమా విడుదలకు నోచుకోలేదు. చేనేత పనివారి జీవితాన్ని, వారు ఎదుర్కొంటున్న వొడిదుడుకులను సుప్రసిద్ధ సినీ దర్శకులు శ్యామ్‌బెనగల్ 'సుస్మన్' పేరుతో హిందీలో తీశారు. 1987లో వచ్చిన ఈ చిత్రం పూర్తిగా పోచంపల్లిలో చిత్రీకరించారు. చేనేత కుటుంబంలోని యదార్థ జీవితాలను, సహకార సంఘాల పనితీరును, మాస్టర్ వీవర్ చేనేత కళాకారుల మధ్య జరిగే సంఘర్షణను కళ్లకు కట్టినట్లుగా తెరకెక్కించారు. పారిస్‌లో జరుగబోయే అంతర్జాతీయ చీరల ప్రదర్శనకు ప్రత్యేకంగా పట్టు చీర నేయడం అనే అంశం చుట్టూ కథ నడుస్తుంది. ఈ చిత్రం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు, ప్రశంసలు అందుకున్నది. ఇటీవల హిందీలో వచ్చిన 'సూయిదగా (సూది దారం)' చిత్రం కూడా నూలు మిల్లు కార్మికుల జీవితాలకు చిత్రిక పట్టింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో నేత కార్మికుల దయనీయ స్థితిని కళ్ళకు కట్టినట్లు చూపించిన తమిళ చిత్రం 'కంచివరం'. సహకార చేనేతోద్యమం ఎందుకు ప్రారంభమైందో సినిమా ఆలోచింపజేస్తుంది. 55వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఈ సినిమా జాతీయ ఉత్తమ చిత్రంగా నిలిచింది.

తెలంగాణలో చేనేతకు విశిష్టస్థానముంది. పద్మశ్రీని అందుకున్న కళాకారులున్నారు. పేటెంట్ హక్కుతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన 'ఇక్కత్' చీరల నేతలున్నాయి. మరోపక్క ఆకలి చావులకు చిరునామాగా మారిన సిరిసిల్ల మరమగ్గాల హబ్ ఉంది. చేనేత పరిశ్రమ ఎత్తుపల్లాల మధ్య ఓ సామాన్యుడు మాన్యుడుగా మారిన 'మల్లేశం' జీవితం సినిమాగా రావడం తెలంగాణ సినీ తెర కొత్తదారులు తొక్కుతుందని భావించాలి. ఆరు గజాల చీర నేయడానికి ఇంటిల్లిపాది కష్టపడాలి. భర్త మగ్గం నేస్తే, భార్య రాట్నం తిప్పాలి, అచ్చు అతకాలి, ఆసుపోయాలి. ఆసు పోయడం భుజాలకు ఇబ్బంది కలిగే విషయం. తన తల్లి ఆసు పోసి పోసి భుజాలు కుదేలయిన విషయాన్ని గుర్తించిన మల్లేశం, దీనికి ప్రత్యామ్నాయం కనుగొనాలనే ఆలోచనలో పడ్డాడు. కష్టపడి, ఆలోచనలకు పదునుపెట్టి, అనేక అవమానాలు, ఇబ్బందులు ఎదుర్కొని ఆసు యంత్రాన్ని సృష్టించి అంతర్జాతీయ గుర్తింపు పొందాడు. రాష్ట్రపతి ప్రశంసలు అందుకున్నాడు. పద్మశ్రీని చేజిక్కించుకున్నాడు. ఆయన జీవనగాథనే 'మల్లేశం' పేరుతో వస్తున్న బయోపిక్. తెలంగాణ భాష, యాస, దర్శక నిర్మాతలు, కళా దర్శకుడు, పాటల, మాటల రచయితలు, నటీనటులందరూ తెలంగాణకు చెందినవారు. పోచంపల్లికి సమీపంలోని రేవణపల్లిలో ఈ చిత్ర నిర్మాణం జరిగింది. మహామహుల జీవిత గాధతో వస్తున్న బయోపిక్‌ల సరసన ఓ సామాన్య మానవుడి బయోపిక్ రావడం తెలంగాణ సమాజం తెలుగు చిత్ర సీమలో గర్వంగా తల ఎత్తుకునే నిలబడగలదని ఆశించవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వినోదం పన్ను మినహాయించి విడుదలకు మార్గం సుగమం చేస్తే ఇలాంటి చిత్రాలు మరెన్నో రావడానికి ఆవకాశముంటుంది.

సమష్టి చైతన్యంతో స్వయంసమృద్ధి



''సమయానికి టైలర్స్ ఇవ్వక పోవడం వల్లనే, ఈసారి బడి పిల్లలకు యూనిఫామ్స్ ఇవ్వలేకపోతున్నాం'' అన్న సింగిల్‌కాలమ్ వార్త మాడుగులపల్లి మహిళలను ఆలోచింపజేసింది. ఈసారి తమ ప్రాంతంలో ప్రతీ విద్యార్థికీ యూనిఫాం అందించాలంటే తామే టైలరింగ్‌లో నైపుణ్యం పెంచుకోవాలనుకున్నారు. వారి పట్టుదలకు నాబార్డు జిల్లా అధికారి దయామృత అండగా నిలిచారు. 90మంది స్వయం సహాయక బృంద మహిళలను ఎంపిక చేసి 'స్వామి వివేకానంద రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ' ద్వారా ఎల్ఇడిపి కార్యక్రమంలో నైపుణ్యాలను మెరుగుపరిచారు. ఇపుడు వారందరికీ కుట్టుమిషన్లకు లోన్ ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు వస్తున్నాయి. ఉత్పత్తి కంటే ముందే మార్కెట్‌ని సృష్టించుకున్న వీరి ఆత్మవిశ్వాసం నల్గొండ జిల్లా గ్రామీణ ఆర్థిక వ్యవస్థనే మార్చ బోతుంది...



గ్రామీణ పేద మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరిచి, సుస్థిర జీవనోపాధులు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం పేదమహిళల జీవనోపాధుల మెరుగుదల కార్యక్రమం మొదలుపెట్టింది. ఆధునిక పద్ధతులు నేర్చుకోవడం, ఆదాయం సమకూర్చుకోవడం ద్వారా దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నవారిని పైకి తీసుకురావడం, వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం. టెక్నాలజీ అధునీకరణ, నైపుణ్యం పెంపు, కొత్త డిజైన్ల రూపకల్పన, స్థిరమైన అభివృద్ధి కోసం వీటి మార్కెటింగ్ అవకాశాలు మెరుగు పర్చడం ఈ కార్యక్రమంలో ప్రధానాంశాలు.

టైలరింగ్‌లో శిక్షణ...

గ్రామీణ పేద మహిళలకు ఉపాధి లేక వలస పోవాల్సిన పరిస్థితుల నేపథ్యంలో నల్గొండ జిల్లాలో మాడుగుల పల్లి, ఇందుగుల, దాచారం గ్రామాలకు చెందిన మహిళల కోసం స్వామి వేకానంద రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. స్కూల్ యూనిఫాంలు కుట్టడంలో నైపుణ్యం పెంచారు. స్వయం సహాయక గ్రూపులకు చెందిన మహిళలకు టైలరింగ్‌లో నిష్ణాతులైన నిపుణులతో స్కూల్ యూనిఫామ్స్ రూపొందించడంలో శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల యూనిఫాంలతోపాటు ఆధునిక దుస్తుల తయారీలో మహిళలు శిక్షణ పొందారు. ఇవన్నీ తమ ఇంట్లోనే కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకోవచ్చు. దీనివల్ల వారికి రోజుకు రూ.300 నుండి రూ.500 దాకా ఆదాయం సమకూరుతుంది. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లాలో 3 గ్రామాలకు చెందిన 90 మంది మహిళలు 3 బ్యాచ్‌లుగా 15 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నారు.

ఫలితాలు ఇలా...

* ప్రతీ మహిళా సొంతంగా ఒక టైలరింగ్ యూనిట్ పెట్టుకునే సామర్థ్యం పెంచుకున్నారు.
* కేవలం నైపుణ్యాలు పెంచడమే కాకుండా రుణ సదుపాయం, మార్కెటింగ్ మొదలైన అంశాల్లో కూడా స్వామి వివేకానంద రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కౌన్సిలింగ్ ఇచ్చింది.
* నైపుణ్యం పొందిన మహిళలు ఉత్పత్తి యూనిట్లు ప్రారంభించడానికి ఆసక్తి చూపుతున్నారు. బ్యాంకులు వారికి రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నాయి.
* డిమాండ్‌కి తగిన డిజైన్ల రూపకల్పన, ఆధునిక పద్ధతులు నేర్చుకోవడం, ఆదాయం సమకూర్చుకోవడం ద్వారా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు పైకి వస్తున్నారు.
* మహిళలు బృందాలుగా ఏర్పడి యూనిట్లు ఏర్పాటు చేసుకోవడంవల్ల కుట్టుపనిలో నాణ్యత పెరిగి, సకాలంలో దుస్తులు మరింత మెరుగ్గా తయారు చెయ్యగలరు.
* మహిళల ఆదాయం స్థిరీకరణ అవుతుంది. గ్రామీణ ఉద్పాదకత పెరుగుతుంది. నైపుణ్యాలు మెరుగవ్వడం వల్ల గ్రామీణ మహిళలు ఉత్పత్తి మార్కెటింగ్ క్రమంలో భాగస్వాములవుతారు. 'కూలీ పనులు కూడా లేక ఖాళీగా ఉన్న మాకు ఉచితంగా శిక్షణ ఇచ్చి టైలర్లగా మార్చారు. బ్యాంకులు కూడా మాకు లోన్‌లు ఇస్తామంటున్నాయి. స్కూల్ యూనిఫారాలకు మంచి డిమాండ్ ఉంది. వచ్చే సంవత్సరం చాలా ఆర్డర్లు వస్తాయనే నమ్మకంతో ఈ శిక్షణ పొందాను..' అంటోంది మాడుగుల పల్లికి చెందిన జూకంటి లలిత.

శ్యాంమోహన్
మన తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

మెరిసే దంతాలకు తులసి

దంతాలు చాలామందిలో రంగుమారినట్టుగా ఉంటాయి. ఆ రంగు తొలగించడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయినా కూడా ఎలాంటి ఫలితం ఉండదు. మరి బయట షాపుల్లో దొరికే వాటిని వాడుదాం అనుకుంటే.. సమస్య మరింత ఎక్కువవుతుంది. మన ఇంట్లో ఉండే పదార్థాలు కూడా దంతాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. కనుక వీటినే ఉపయోగించి దంతాల రంగు, చిగుళ్ల ఆరోగ్యం కూడా కాపాడుకోవచ్చు. ఎలాగో తెలుసుకుందాం..

* తులసి ఆకుల్నిఎండబెట్టి పొడి చేసుకోవాలి. ఈ పొడితో ప్రతిరోజూ బ్రష్ చేసుకుంటే పళ్లపై వచ్చే పసుపు మరకలు తొలగిపోతాయి. అంతేకాకుండా పళ్లకు సంబంధించిన ఇతర సమస్యలు కూడా పోతాయి.



* లవంగాలను వేయించి పొడి చేయాలి. ఇందులో కొద్దిగా నిమ్మరసం కలిపి పళ్లు రుద్దుకోవాలి. ఇలా చేయడం వల్ల దంతాలు తళతళా మెరవడమే కాకుండా బలంగా కూడా ఉంటాయి.
* బొప్పాయి తొక్కలతో పళ్లు రుద్దుకుంటే దంతాలపై ఏర్పడే ఎటువంటి మచ్చలైనా సులభంగా పోతాయి. అంతేకాకుండా చిగుళ్లు కూడా ఆరోగ్యంగా ఉంటాయి.
* ఉప్పులో కొన్ని చుక్కలు నిమ్మరసం కలిపి ఈ మిశ్రమంతో పళ్లు రుద్దుకొని కాసేపటి తరువాత కడుక్కోవాలి. ఇలా చేయడం వల్ల పళ్లకుండే పసుపు రంగు పోతుంది.

అమ్మ నుంచే మంచితనం..!

ప్రపంచంలో మంచి తల్లులు తప్పించి చెడ్డ తల్లులు వుండరనే అందరి నమ్మకం. ఆ మంచితనం ఎక్కడినుంచో రాదనీ వారి జన్యువుల్లోని ఒక ప్రత్యేక భాగం ఇస్తుందని తేల్చాయి పరిశోధనలు. ఎ.వి.పి.ఆర్ 1 ఎ అనే జన్యువు మంచితనం నిర్దేశిస్తుందట. పిల్లల ప్రవర్తన విషయంలో తమ మాటకు కట్టుబడి ఉండకపోతే తల్లులు క్షమించలేరు. భయపెట్టి లేదా దండించి తమ దారికి తెచ్చుకుంటారు. పిల్లలకు అర్థంకాదని వాళ్ళు పసివాళ్ళని తెలిసినా అలిగే తల్లులుంటారు. ఇటువంటి తరహా ప్రవర్తన వుండే తల్లులతో ఆ జన్యువు దానికి ప్రతిగా మరో జన్యుభాగం కారణమంటున్నారు. ఇదే జన్యువులను తల్లి పిల్లలకు అందిస్తుంది. ఈ జన్యువులోని భాగాలను బట్టి తల్లితో కొందరికి విడదీయలేని బంధం వుంటే మరికొందరు కొంచెం దూరంగా ఉండటం కనిపిస్తుంది. బిడ్డలలో మంచితనం అన్నది తల్లి జన్యువు లోంచే అన్న విషయం రూఢీ చేసాయి.



పింక్ మార్కెట్.. అన్నీ ఒకచోటే!

మహిళలు ఇంట్లో ఉండి కూడా అనేక వస్తువులను తయారుచేస్తుంటారు. వాటిని ఎలా అమ్ముకోవాలో తెలియక సతమతమవుతుంటారు.ప్రతి ఒక్కరికీ ఆన్‌లైన్ వ్యాపారంపై అవగాహన ఉండదు. అలాంటివారికోసం ఏర్పడిందే **'షీ మార్ట్ అండ్ లూస్'.** చందానగర్‌లో ఏర్పాటైన ఈ షీ మార్ట్‌ను జీహెచ్‌ఎంసీ ఏర్పాటుచేసింది. ఇక్కడ మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువులను వారే విక్రయించుకోవచ్చు. వారు ఇబ్బంది పడకుండా ప్రత్యేకంగా మరుగుదొడ్లు, చిన్నారులకు పాలిచ్చేందుకు అనువైన ఓ గది ఇక్కడ ఏర్పాటుచేయడం విశేషం. ఇలా అన్ని సదుపాయాలు ఒకచోటే లభ్యం కావడం దేశంలో ఇదే మొదటిసారి. వీటి నిర్వహణ మొత్తం మహిళలే చూసుకుంటారు.





ఈ పింక్ మార్కెట్‌లో రెండు స్టాళ్లు ఉంటాయి. ఒక దాంట్లో స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన వస్తువులు, మరోదాంట్లో తినుబండరాలు ఉంటాయి. బాలింతలు పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గది, పింక్ టాయిలెట్లు, దివ్యాంగ మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు ఇక్కడ ఉన్నాయి.

జవహర్‌నగర్‌లోని స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన జూట్, కాటన్ బ్యాగులు, చిరుధాన్యాలతో తయారుచేసే స్వీట్లు ఇక్కడ తక్కువ ధరకే లభిస్తాయి.

మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతను చందానగర్ సర్కిల్ పరిధిలోని వేముకుంట మహిళా సమాఖ్య చేపట్టింది. స్టాళ్లలో అమ్మకాల ద్వారా వచ్చే లాభాలతో పింక్ టాయిలెట్లను నిర్వహిస్తారు. వీటిని పరిశుభ్రంగా ఉంచడం కోసం ఇద్దరు మహిళలు షిఫ్టుల వారీగా పనిచేస్తున్నారు. మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకొని సీసీ కెమెరాల ఏర్పాటు కూడా ఉంది. మరో ఇద్దరు మహిళలు స్టాల్స్‌లో వస్తువులు విక్రయిస్తున్నారు.



ఇవి ధరించడం తప్పనిసరి

స్పోర్ట్స్ బ్రా ధరించి వర్కవుట్స్ కొనసాగించమంటున్నారు వ్యాయామ నిపుణులు. రెగ్యూలర్ బ్రాతో సమస్యలు వస్తాయంటున్నారు. ఈ బ్రాతో రన్నింగ్ కొనసాగిస్తే ఛాతిలోని కండరాలు, వెన్ను నొప్పి వస్తుంది. చర్మం కూడా సాగిపోతుంది. జిమ్‌లో కొన్ని రకాల వ్యాయామాల వల్ల అసౌకర్యాలు కూడా కలుగుతాయి. ఎక్కువ దూరం వాకింగ్ రన్నింగ్ చేసేవారికి సక్రమమైన సపోర్ట్ లేకపోతే స్తనాలు సాగిపోతాయి. స్ట్రెచ్ మార్క్ ఏర్పడటం వంటి సమస్యలు రావచ్చు. ఇలాంటి ఇబ్బందులు లేకుండా వర్కవుట్స్ చేయాలంటే స్పోర్ట్స్ బ్రా తప్పనిసరి అంటున్నారు.

వాముతో రోగాలు దూరం

ఘాటుగా, వగరుగా, కారంగా ఉండే వంటలకు వాముతో ఒక ప్రత్యేకమైన రుచి వస్తుంది. చాలా మంది వామును ఎక్కువగా వాడరు గానీ ఇందులో ఔషధగుణాలు అపారంగా ఉంటాయి. కాస్త వాముని వేయించి, రాత్రంతా నీళ్ళలో నాననిచ్చి ,ఆ నీళ్ళతోనే వాముని మరిగించాలి. ఆ నీళ్ళు తాగితే జీర్ణ సంబంధమైన అనారోగ్యాలు అన్నీ పోతాయి. వాములో ఉండే థైమల్ అనే రసాయనం ఫంగల్ బాక్టీరియా వ్యాధులను నిరోధిస్తుంది. ఆయుర్వేదంలో వాముకు ప్రాధాన్యత చాలా ఎక్కువ. వీటిలో మినరల్స్, విటమిన్లు యాంటీ ఆక్సిడెంట్స్ ఫైబర్ చాలా ఎక్కువ. వామును వేయించి పొడి చేసి అన్నంలో నేతితో కలిపి తింటే ఎన్నో అనారోగ్యాల నుంచి ఉపశమనం లభిస్తుంది.



చిట్కాలు

* మనం ఇంట్లో కూరగాయలు, పండ్లను శుభ్రం చేసినట్లే, మాంసాన్ని కూడా అలాగే శుభ్రం చేయమని చెఫ్‌లు సలహా ఇస్తున్నారు. మాంసంలో ఎలాంటి కీటక నాశకాలు లేదా రసాయన ఎరువులు వాడరు. కానీ దాన్ని కట్ చేసే విధానంలో చాలా మురికి చేరుతుంది. కనుక దాన్ని కడిగాక ఉడికించండి. కడిగిన తర్వాత కూడా దానికి రుచి తగ్గదు.

జిఎస్ఐలో అంతర్జాతీయ స్థాయి శిక్షణ

మన తెలంగాణ/ హైదరాబాద్ : శిక్షణ, నైపుణ్యాన్ని పెంపొందించేదుకు విద్యార్థుల నుంచి శాస్త్రవేత్తల వరకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సిహెచ్. వెంకటేశ్వర రావు తెలిపారు. ఇప్పటివరకు 62 దేశాలకు చెందిన 433 విద్యార్థులు శిక్షణ పొందారని, భూ భౌతిక శాస్త్రం, రిమోట్ సెన్సింగ్, ఫోటో జియాలజీలో వస్తున్న ఆధునిక సాఫ్ట్‌వేర్, సాంకేతిక పరిజ్ఞానంపై ఈ శిక్షణ ఉంటుందని వివరించారు. నగరంలోని కవాడీగూడలోని సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 'భూవి సంవాద్' అనే కార్యక్రమం ద్వారా దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లోని అధ్యాపకులు, విద్యార్థులకు కూడా శాస్త్ర సాంకేతిక శిక్షణను అందిస్తున్నట్టు వివరించారు. హైదరాబాద్, నాగ్‌పూర్, కోల్‌కతా, లక్నో, జైపూర్, షిల్లాంగ్‌లోని ప్రాంతీయ శిక్షణా సంస్థలతోపాటు కర్ణాటకలోని చిత్రదుర్గ, రాజస్థాన్‌లోని జావార్, చత్తీస్‌గడ్‌లోని రాయపూర్, జార్ఖండ్‌లోని కుజుల్లోని శిక్షణా సంస్థల్లో ఈ శిక్షణా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్టు చెప్పారు. సుమారు 50 మంది అనుభవజ్ఞులైన భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 32 వేలమంది లబ్ధి పొందినట్టు తెలిపారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా క్షేత్ర స్థాయి శిక్షణవల్ల ఆయా రంగాల్లో ఉద్యోగాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. విదేశాంగ శాఖ, ఇస్రో సంస్థలు కూడా ఈ శిక్షణా కార్యక్రమానికి సహకారం అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రీజనల్ అడిషనల్ జనరల్ టివికె రెడ్డి, డాక్టర్ తారక్ నాథ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నేడు సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్ : దేశంలో విద్యారంగం అనేక సమస్యలను ఎదుర్కొంటుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ స్టాలిన్, ప్రధాన కార్యదర్శి రావి శివరామకృష్ణ ఓ ప్రకటనలో ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి కేంద్రం ప్రయత్నం చేయడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత, గిరిజన, వెనకబడిన వర్గాల విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేలా వసతులు కల్పించాలని, విద్య కార్పొరేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ నేడు (శుక్రవారం) సదస్సు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. బషీరాబాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. ఈ సదస్సుకు ప్రొఫెసర్ హరగోపాల్ ముఖ్య అతిథిగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి గౌరవ అతిథిగా హాజరవుతారని వారు పేర్కొన్నారు.

కోరుట్ల, కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్లు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధిత జిల్లా కలెక్టర్లకు అందచేయాలని రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి తివారీ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కోరుట్ల రెవెన్యూ డివిజన్‌లో కోరుట్ల, మేడిపల్లి, కత్లాపూర్ మండలాలను; కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్‌లో కొల్లాపూర్, పెద్ద కొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి మండలాలను రెవిన్యూ శాఖ చేర్చింది. ఎన్నికల సందర్భంగా కొత్త జిల్లాలు, రెవిన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇవ్వడంతో వాటి అమలులో భాగంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను జారీ చేసింది. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా పన్నెండు మండలాలతో నారాయణపేట జిల్లాను, తొమ్మిది మండలాలతో ములుగు జిల్లాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్‌ను ఇప్పటికే వెలువరించింది. అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలియజేయడానికి ఇచ్చిన నెల రోజుల గడువు కూడా ముగిసిపోయింది. త్వరలో తుది నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

ఎస్‌బిఐ లాకర్ నుంచి 80 తులాల బంగారం మాయం

(మొదటిపేజీ తరువాయి)

చెందిన మోజం హుస్సేన్, అమీనా దంపతులు 2005లో ఎస్‌బిఐలో లాకర్ తీసుకున్నారు. అమెరికాకు వెళ్లే సమయంలో లాకర్‌లో 80 తులాల బంగారు ఆభరణాలు పెట్టి వెళ్లారు. ఈ మధ్యే అమెరికా నుంచి తిరిగి వచ్చిన దంపతులు లాకర్ తెరిచి చూసే వరకు బంగారం లేదు. దీంతో ఈ నెల 5వ తేదీన హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్ సునీల్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్‌స్పెక్టర్ తెలిపారు.

కవ్వాల్ పులులకు కరెంట్ ఉరి నుంచి రక్షణ

(మొదటిపేజీ తరువాయి)

విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఎవరికి పడితే వారికి విద్యుత్ లైన్లు/సరఫరా ఇవ్వకుండా చట్ట ప్రకారం అర్హత/అనుమతి ఉన్న వారికి మాత్రమే ఇవ్వాలని తేల్చి చెప్పింది. కేంద్ర అటవీ శాఖ, జాతీయ పులుల సంరక్షణ సంస్థ అభిప్రాయాలను కూడా రెండు వారాల్లో తమకు తెలియజేయాలని ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశించింది. రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, అదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను, ఎక్సైజ్ కమిషనర్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, ఎండీలను హైకోర్టు ప్రతివాదులుగా చేసింది. పూర్వపు అదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పులుల సంరక్షణ పథకాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైదరాబాద్‌కు చెందిన జాగిర్ దియాసుర్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని ధర్మాసనం గురువారం మరోసారి విచారించింది.

కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పోలీసు, అటవీ, ఎక్సైజ్, విద్యుత్ శాఖాధికారులు ఉమ్మడి పరిశీలన చేసి వాస్తవ స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అటవీ, జంతు సంరక్షణ, పోలీసు, ఎక్సైజ్, నార్కోటిక్ డ్రగ్స్ మొదలైన చట్టాలు అమలు తీరు ఎలా ఉందో కూడా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కూబింగ్ నిర్వహించాలని, పులులు ఇతర వన్య ప్రాణుల్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. కవ్వాల్, ఆమ్రబాద్ పులుల సంరక్షణ కేంద్రాల్లో స్పెషల్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటుబలగాలను కేంద్రం ఇస్తున్నందున రాష్ట్రం కూడా అటవీ అధికారులకు ఆయుధాలు సమకూర్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని ఆదేశించింది. హైకోర్టు గత విచారణ సమయంలో కోరిన మేరకు కోర్టుకు సహకరించేందుకు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా, కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం ఫీల్ డైరెక్టర్ సి.శరవణన్ విచారణకు హాజరయ్యారు. విద్యుత్ తీగలు తగిలి పులులు మృత్యువాతపడుతున్నాయని, తీగ తగిలినా విద్యుత్ సరఫరా కాకుండా ఇన్సులేషన్ చేయించితే బాగుంటుందని అధికారులు సూచన చేశారు. అడవుల్లో జంతువుల్ని వేటాడకుండా అడ్డుకునేందుకు డ్రోన్ల వినియోగించాలని పిటిషనర్ తరపు సీనియర్ లాయర్ నిరంజన్‌రెడ్డి సూచన చేశారు. విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.



నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని పార్వతి జడల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానిస్తున్న ఆ జిల్లా నేతలు ఎంపి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ వేముల వీరేశం, బండారి నరేందర్‌రెడ్డి, రేగట్ట మల్లికార్జునరెడ్డి తదితరులు

విద్యార్థులకోసం ప్రత్యేక బస్సులు

టికెటేతర ఆదాయంపై ఆర్‌టిసి ప్రత్యేక దృష్టి



మన తెలంగాణ / సిటీబ్యూరో : పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఆర్టిసిని ఆర్థికంగా గట్టెక్కించేందుకు అధికారులు అందుబాటులో ఉన్న అవకాశాలను ఒకొక్కటిగా కార్యరూపంలోకి తీసుకువస్తున్నారు. అందులో భాగంగానే నగరంలో ప్రైవేట్ విద్యాసంస్థలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆ మార్గంలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సులును నడిపేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈపాటికే సంస్థకున్న స్థలాలను అద్దెకు ఇవ్వడం, ఖాళీగా ఉన్న కార్యాలయాలను లీజుకివ్వడం చేస్తున్నది. అయితే, గ్రేటర్ పరిధిలో ఆయా మార్గాల్లో ఉన్న విద్యాసంస్థల వివరాలు, అందులో చదివే విద్యార్థుల సంఖ్య వంటి వివరాలను సేకరించాలని నిర్ణయించింది. గతంలో కొన్ని విద్యాసంస్థల అభ్యర్థన మేరకు బస్సులను నడిపిన అనంతరం కొన్ని ప్రత్యేక కారణాల వల్ల ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నది. అయితే, ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో విద్యాసంస్థలు పెరగడం, విద్యార్థుల సంఖ్య మేరకు రవాణా సదుపాయాలు లేకపోవడాన్ని గ్రహించిన ఆర్‌టిసి తిరిగి విద్యా సంస్థలున్న మార్గాల్లో బస్సులను నడపాలని నిర్ణయించింది.

ప్రయోగాత్మకంగా అమలు

గతంలో విద్యాసంస్థల అభ్యర్థన, విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని వారాసిగూడ హబ్సిగూడ మార్గాల్లో ఆర్‌టిసి బస్సులను నడిపింది. ప్రభుత్వం నిర్వహించే పలు రంగాలకు చెందిన పోటీ పరీక్షల సందర్భంగా అభ్యర్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలోపెట్టుకుని, ఇటు వారికి రవాణా సౌకర్యం, అటు సంస్థకు ఆదాయం పెరగడం జరుగుతుందనేది అధికారులు అభిప్రాయం. ప్రధానంగా పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా విద్యార్థుల కోసం ఏర్పాటు చేస్తున్న బస్సుల తరహాలోనే నిత్యం విద్యాసంస్థలకు వెళ్ళేవారి మార్గంలో బస్సులను నడపడం ద్వారా సంస్థకు అదనపు లాభాలను తీసుకురావచ్చనేది అధికారులు స్పష్టంచేస్తున్నారు. తరచూ పాఠశాలల ఆటోలు ప్రమాదాలకు గురవడం, వ్యాన్లలో వెళ్ళేవారికి భద్రతలేకపోవడం, ఈ రకమైన వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తడం వంటి విషయాలను పరిగణలోకి తీసుకుని ఈ ప్రయత్నం చేయాలని సంస్థ నిర్ణయించింది.

సేవా భావంతో

విద్యాసంస్థల దూరాన్ని బట్టి ఒక్కో విద్యార్థి నుంచి నెలకు సుమారు రూ. 1000 నుంచి 1500 వసూలు చేస్తున్నారు. పాఠశాలల నిర్వాహకులు సైతం ఒక్క విద్యార్థి నుంచి రూ. 2000ల ఆపైనే వసూలు చేస్తున్నారు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఆర్టిసి అధికారులు విద్యాసంస్థలకు నేరుగా ప్రత్యేక బస్సులను సేవాభావంతో నడపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పాఠశాలల ఆటోలు,వ్యాన్‌లు, బస్సుల ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకోక పోవడాన్ని కూడా అధికారులు పరిగణలోకి తీసుకుంటున్నారు. భద్రత, ఫిట్‌నెస్‌పరంగా స్కూల్ ఆటోలు, వ్యాన్ల కంటే ఆర్టిసి బస్సులు మెరుగ్గా ఉండటంతో విద్యార్థులు తల్లిదండ్రులు,పాఠశాలల యాజమాన్యాలు ఆర్టిసి వైపు మొగ్గు చూపే అవకాశం ఉంటుందనేది సంస్థ భావన. ఆర్‌టిసి బస్సులకు సాధారణ చార్జీ లు ఉండటంతో వీటిపైనే విద్యార్థుల, తల్లిదండ్రులు మొగ్గు చూపే అవకాశం ఉంటుందని అధికారులు ధీమాతో ఉన్నారు. విద్యార్థులకు ప్రత్యేక స్టూడెంట్ పాస్ లు, రూట్ పాస్‌లు ఉన్నప్పటికీ కొన్ని మార్గాల్లో ప్రయోగాత్మకంగా బస్సులను నడపన్నుట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

మేటిగడ్డ నీటిసిరి



(మొదటిపేజీ తరువాయి)

దేశ్ పాండే, నీటి పారుదల ఇ.ఎన్.సి.లు మురళీధర్, అనిల్ కుమార్, నాగేందర్, సిఇలు శంకర్, శ్రీనివాస్ రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపిలు జె.సంతోష్ కుమార్, సీతారామ్ నాయక్, ఎమ్మెల్యేలు ఈటల రాజెందర్, డి.ఎస్. రెడ్యానాయక్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీష్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బాల్క సుమన్, సుంకె రవి శంకర్, సంజయ్ కుమార్, కోరుకంటి చందర్, కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, గంగుల కమలాకర్, ఆరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, గ్యాదరి కిశోర్, నన్నపునేని నరేందర్, వి. సతీష్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ఆర్.ఎస్.పి. పరిధిలోని మొత్తం ఆయకట్టుకు నీరందించడానికి అనుసరించాల్సిన వ్యూహంపై కూలంకశంగా చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు. ఎక్కడ ఏ సమస్య ఉందో గుర్తించి, దాన్ని అప్పటికప్పుడే పరిష్కరించారు. భూసేకరణకు, ఇతర పనులకు కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. గోదావరిలో పుష్కలంగా ఉన్న నీటిని భారీ వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యాంలకు తరలిస్తామని, ఈ వర్షాకాలం నుంచే మేడిగడ్డలో పంపింగ్ ప్రారంభిస్తామని సిఎం అన్నారు. ఈ నీటిని ఎస్ఆర్ఎస్‌పి కాలువల ద్వారా అన్ని చెరువులకు మళ్లించాలని సూచించారు. చెరువులను నింపడమే ప్రథమ ప్రాధాన్యంగా గుర్తించి, అన్ని ఎస్.ఆర్.ఎస్.పి. కాల్వలకు మరమ్మత్తులు చేయాలని సూచించారు. కావాల్సిన చోట తూములు వెంటనే నిర్మించాలి. భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. ఎస్ఆర్ఎస్‌పి రెండో దశలో నిర్మించిన కాల్వలకు లైనింగ్ పూర్తి చేయాలని, అవసరమైతే కాల్వల క్యారీయింగ్ కెపాసిటీ (నీటి ప్రవాహ ఉధృతి సామర్థ్యం) ని పెంచుకోవాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం 50 మంది ఇంజనీర్లను నియమించి, యుద్ధ ప్రాతిపదికన సర్వే చేసి, అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. నిధులు వెంటనే మంజూరు చేస్తామని, పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన జరగాలని, ఈ వర్షాకాలానికి ఎస్.ఆర్.ఎస్.పి. పరిధిలోని 14.40 లక్షల ఎకరాలకు సాగునీటిని తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ప్రాంతం నుంచి మొదలుకుని చివరి ఆయకట్టు కలిగిన డోర్నకల్, తుంగతుర్తి, భూపాలపల్లి, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల వరకు అన్ని దిక్కులకు నీరు అందాలి'' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

కాకతీయ, వరద కాలువల మధ్య ఉన్న 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుగా సర్వే నిర్వహించి, పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. రెం డో దశలో ఉన్న అన్ని డిస్ట్రిబ్యూటరీలకు లైనింగ్ చేయాలని, వెంటనే అంచనాలు రూపొందించి, టెండర్లు పిలవాలని, ఎండాకాలం లోపు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఎస్.ఆర్.ఎస్.పి కాల్వల పనులు చేయడానికి ఎక్కడికక్కడ ఎక్కువ మంది కాంట్రాక్టర్లను నియమించాలని, అన్ని చోట్ల పనులు సమాంతరంగా జరగాలని ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రాజెక్టుల కాల్వలకు సంబంధించిన హద్దులను నిర్ణయించాలని, ప్రాజెక్టుల భూముల సమగ్ర వివరాలను (ఇన్వెంటరీ) రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. దీంతో పాటు ఆయకట్టు పరిధిలో కడెం గేటు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని, ఎస్.ఆర్.ఎస్.పి పంట కాల్వలను ఎవరైనా దున్నుకుంటే, వాటిని పునరుద్ధరించాలని, ఈ విషయంలో ఎమ్మెల్యేలు చొరవ చూపి, రైతులను ఒప్పించాలని సూచించారు. అన్ని ప్రాజెక్టుల ప్రొఫైల్ తయారు చేయాలి. ప్రతీ ప్రాజెక్టుకు ఆపరేషన్ రూల్స్ తయారు చేయాలని, ప్రాజెక్టుల నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందో అంచనా వేస్తే, బడ్జెట్ లో కేటాయిస్తామన్నారు. మే 15 నాటికి చనాకా కొరాటా పనులు పూర్తి చేయాలని గడువు విధించారు. దేవాదుల నీటిని తరలించే రామప్ప, లక్నవరం, ఘనపూర్, పాఖాల కాల్వల పనులను ఈ ఎండాకాలంలోనే పూర్తి చేయాలన్నారు. ఇదేవిధంగా దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించతలపెట్టిన పాలకుర్తి, ఉప్పుగల్లు, చెన్నూరు రిజర్వాయర్ల నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలి.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల బి.ఇడి కోర్సు

న్యూఢిల్లీ: కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు ప్రభుత్వ పాఠశాల వ్యవస్థకు రోల్ మోడల్స్ అని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవడేకర్ అభివర్ణించారు. గురువారం ఇక్కడ జాతీయ కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల ప్రిన్సిపాల్స్ సమావేశం ముగింపు కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ టీచింగ్ అనేది ఇష్టమైన అంశంగా ఉండాలే తప్ప చిట్టచివరి ఆప్షన్‌గా ఉండకూడదని అంటూ,అందువల్లనే వచ్చే విద్యా సంవత్సరంనుంచి నాలుగేళ్ల బి.ఇడి కోర్సును ప్రవేశపెడుతున్నామని చెప్పారు.'ఉపాధ్యాయులు తమ వృత్తిపట్ల ఇష్టగా ఉండాలి. ఈ దేశ భవిష్యత్తును తీర్చి దిద్దే శిల్పులు టీచర్లే' అని ఆయన అన్నారు.ఈ సందర్భంగా మంత్రి కేంద్రీయ విద్యాలయాల సంఘటన్ స్వాస్థ బచ్చే– స్వాస్థ్ భారత్ కార్యక్రమం కోసం రూపొందించిన 'ఫిట్‌కెవియన్' యాప్‌ను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 1,199 కేంద్రీయ విద్యాలయాల్లోని దాదాపు 2.7 లక్షల మంది పిల్లల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది.

హామీ లేకుండా రైతురుణం

(మొదటిపేజీ తరువాయి)

రుణాల అంశాన్ని ప్రస్తావించింది. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి హామీ లేకుండా ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని రూ. 1.6లక్షల వరకు పెంచుతున్నట్లు పేర్కొంది. చిన్న, సన్నకారు రైతులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఆర్‌బిఐ ఆశాభావం వ్యక్తం చేసింది. దీనిపై త్వరలోనే అన్ని బ్యాంకులకు నోటీసు జారీ చేస్తామని తెలిపింది. హామీ రహిత వ్యవసాయ రుణాల పరిమితిని రూ. లక్ష వరకు పెంచుతూ 2010లో ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంది.

భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

పదిమంది నక్సల్స్ మృతదేహాలతో పాటుగా 12 ఆయుధాలు కూడా లభించాయి. అందులో 11 బర్మార్ రైఫిల్స్, 315 రివాల్వర్ ఒకటి ఉంది. మందుగుండు సామాగ్రితో పాటు ఐఇడి ఎక్స్‌ప్లోజివ్స్ దొరికాయి. పలు సోలార్ ప్లేట్స్, కిట్‌బ్యాగులు, డ్రస్సులు లభించాయి. మృతిచెందిన నక్సల్స్ ఇంకా ఎవరనేది తేలలేదు. దాదాపు పది కిలోమీటర్లు అటవీ ప్రాంతం కావటంతో పోలీసు బలగాలు అక్కడి నుంచి సమీప ప్రాంతానికి రావటానికి కొన్నిగంటల సమయం పడుతుంది. మృతిచెందిన వారిలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. వారిలో అగ్రశ్రేణి నాయకులు ఎవరైనా ఉన్నారా? లేదా అనేది ఇంకా తేలాల్సి ఉంది. మృతిచెందిన నక్సల్స్ ఎవరనేది ఇంకా గుర్తించాల్సి ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం బీజాపూర్‌కు సుమారు 80 కిలో మీటర్ల దూరంలో ఉంది. నక్సల్స్ మృతదేహాలను సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం కోసం బయటికి తరలిస్తున్నారు.

చత్తీస్‌ఘఢ్ రాష్ట్ర పోలీసులే ఎక్‌కౌంటర్‌లో పాల్గొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులు పెద్ద ఎత్తున మందుగుండు సామాగ్రి తో పాటు ఐఇడి, 10 మంది సహచరులను కొల్పోయారు. దాదాపు ఎన్‌కౌంటర్ సమయంలో సుమారు పెద్దఎత్తున వరకు నక్సల్స్ ఉన్నారని, పోలీసులు కూడా పెద్ద ఎత్తున ఉండటంతో పోలీసులపై కాల్పులు జరుపుతూ మిగతావాళ్లు తప్పించకున్నారని సమాచారం. పోలీసులు కూడా పెద్ద ఎత్తున కాల్పులు జరపటంతో నక్సల్స్ నేలకొరిగారు. కొందరు పోలీసులు కూడా గాయపడ్డారని సమాచారం. చత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టులకు ఇటీవల కాలంలో ఇది పెద్ద ఎదురు దెబ్బగా భావిస్తున్నారు.

రోడ్లకు బలి

(మొదటిపేజీ తరువాయి)

29 రాష్ట్రాలు, ఏడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 4.64 లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగితే 1.47 లక్షల మంది చనిపోయారని, ఇందులో 20,457 మంది పాదచారులేనని పేర్కొనింది. 2014లో 1.39 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే ఆ తర్వాతి సంవత్సరం (2015) 1.46 లక్షలకు పెరిగిందని, 2016లో ఇది 1.50 లక్షలకు చేరుకుందని మంత్రిత్వ శాఖ లోక్‌సభలో సమర్పించిన నివేదికలో పేర్కొనింది. 2014లో సగటున 34 మంది పాదచారులు రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే, ఆ తర్వాతి సంవత్సరం 38మంది, 2016లో 43 మం ది, 2017లో 56 మంది చొప్పున చనిపోయినట్లు తేలిందని ఆ శాఖ మంత్రి మన్‌సుఖలాల్ మాండవీయ లోక్‌సభలో గురువారం ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు. 2014లో 12,330 మం ది పాదచారులు ఈ ప్రమాదాల్లో చనిపోగా, ఆ తర్వాతి సంవత్సరం 13,894 మంది, 2016లో 15,746 మంది, 2017లో 20,457 మంది చనిపోయినట్లు తెలిపారు. రోడ్డు భద్రతను ప్రాధాన్యతా అంశంగా తీసుకు న్న మంత్రిత్వశాఖ అన్ని కార్పొరేట్ సంస్థల వార్షిక ఆదాయంలో కనీసంగా 2 శాతం రోడ్డు భద్రతకు వెచ్చించాల్సిందిగా నిబంధన తీసుకొచ్చినట్లు వివరించారు.

ప్రమాదాలకు అనేక కారణాలు

రోడ్డు ప్రమాదాలు జరగడానికి పలు కారణాలు ఉన్నట్లు అధ్యయనంలో తేలిందని, జాతీయ రహదారులు మాత్రమే కాకుండా రాష్ట్ర రహదారులమీద కూడా ప్రమాదాలు గణనీయంగా జరుగుతున్నట్లు తేలిందని వివరించారు. రాష్ట్ర రహదారులపై జరుగుతున్న ప్రమాదాల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సుమారు 52 వేల కి.మీ. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చే విధంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. రోడ్లపై 'బ్లాక్ స్పాట్'లు ఉండడంతో పాటు డ్రైవర్ల నిర్లక్ష్యం, డ్రైవింగ్‌లో ప్రావీణ్యత లేకపోవడం, రోడ్ల ఇంజనీరింగ్‌లోనే లోపం ఉండడం లాంటి అనేక కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్ల నిర్వహణ నిమిత్తం రాష్ట్రాలకు కేంద్రం ప్రతీ ఏటా 'సెంట్రల్ రోడ్డు ఫండ్' నుంచి విడుదల చేస్తున్న నిధుల్లో కనీసంగా పది శాతం రోడ్డు భద్రత అవసరాలకు ఖర్చు చేయాలన్న నిబంధనను విధించినట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలపై అధ్యయనం చేసి తగిన సిఫారసులు చేయాల్సిందిగా వివిధ రాష్ట్రాల రవాణా మంత్రులతో 'గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్' కమిటీని కూడా నియమించామని, ఆ సిఫారసులను పరిగణనలోకి తీసుకుని మోటారు వాహన బిల్లు 2017ను రూపొందించినట్లు మంత్రి వివరించారు.

నాలుగు 'ఇ'లతో ఒక విధానాన్ని (ఎడ్యుకేషన్ (అవగాహన), ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ కేర్) కూడా రూపొందించినట్లు తెలిపారు. భారీ వాహనాలను నడిపే డ్రైవర్లకు నైపుణ్యాన్ని కల్పించడం కోసం ప్రత్యకంగా 'మోడల్ డ్రైవింగ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్'లను నెలకొల్పాల్సిందిగా రాష్ట్రాలకు సూచించినట్లు తెలిపారు. జాతీయ రహదారులపై ఎక్కడెక్కడ బ్లాక్ స్పాట్స్ (ప్రమాదం జరగడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలు) ఉన్నాయో గుర్తించి వాటిని సవరించేందుకు దేశం మొత్తం మీద ఉన్న ప్రాంతీయ అధికారుల (కేంద్ర రవాణా మంత్రిత్వశాఖకు చెందిన)కు తగిన అధికారాలను ఇచ్చినట్లు తెలిపారు. రోడ్డు భద్రతపై ఆడిట్ నిర్వహించడానికి సర్టిఫికేషన్ కోర్సులను కూడా ప్రవేశపెట్టామని, ఇప్పటివరకు 42 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ ప్రమాదాలు

జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా పట్టణాలు, ద్వితీయ శ్రేణి పట్టణాల శివారు ప్రాంతాల్లోనే ఉంటున్నట్లు మంత్రిత్వశాఖ గుర్తించింది. సగటున 60 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో వెళ్తున్నప్పుడు పట్టణాలకు చెందిన చిన్న రోడ్లు కలిసే చోట ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు. దేశం మొత్తం మీద ఉన్న జాతీయ రహదారులు 100 కి.మీ. వేగంతో వాహనాలు ప్రయాణించడానికి సరిపోయే విధంగా నిర్మించినప్పటికీ ఢిల్లీముంబాయి కారిడార్‌లో 30% మేర రోడ్డు, చెన్నయ్‌ముంబాయి కారిడార్‌లో 50% మేర రోడ్డు వాహనాలు 85 కి.మీ. వేగంతో ప్రయాణించడానికి కూడా శ్రేయస్కరం కాదని అంతర్జాతీయ రోడ్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐఆర్‌ఏపి) సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తేలిందని మంత్రి గుర్తుచేశారు.

ఏటేటా పెరుగుతున్న పాదచారుల మరణాలు

రోడ్డు ప్రమాదాల్లో సాధారణంగా వాహనాల్లో ప్రయాణించేవారే చనిపోతుంటారని, కానీ గడచిన నాలుగేళ్ళ ప్రమాదాలను విశ్లేషించిన తర్వాత రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్ళేవారు (పాదచారులు) కూడా మృత్యువాతపడుతున్నారని, 2014 నుంచి ప్రతీ ఏటా ఇది పెరుగుతూ ఉన్నట్లు కేంద్ర మంత్రిత్వశాఖ నిర్ధారించింది. తమిళనాడులో అత్యధికంగా 2017లో 3507 మంది పాదచారులు చనిపోయారని, ఆ తర్వాతి స్థానంలో మహారాష్ట్రలో 1831 మంది ఆంధ్రప్రదేశ్‌లో 1379 మంది చొప్పున మృతిచెందినట్లు మంత్రి ఆ సమాధానంలో తెలిపారు.

తెలంగాణలో ఇది 972గా ఉంది. ఇక రోడ్డు ప్రమాదాల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే కూడా దేశంలోనే అత్యధికంగా తమిళనాడులో చోటుచేసుకుంటున్నాయి. 2014లో 67,250 ప్రమాదాలు జరగ్గా ఆ తర్వాతి సంవత్సరం 69,059 జరిగాయి. 2016లో 71,431, 2017లో 65,562 చొప్పున నమోదయ్యాయి. ఆ తర్వాతి స్థానంలో మధ్యప్రదేశ్‌లో 53,399 (2017లో), కర్నాటకలో 42,542, కేరళలో 38,740 చొప్పున నమోదయ్యాయి. తెలంగాణలో ఇది 22,484గా ఉంది. పాదచారులు మృతి చెందుతున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ప్రమాదం జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను, అండర్‌పాస్‌లను నిర్మిస్తున్నట్లు మంత్రి వివరించారు. గతేడాది నుంచి జాతీయ రహదారులకు సమీపంలో మద్యం దుకాణాలు లేకుండా సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన ద.మ.రైల్వే జిఎం



మన తెలంగాణ / హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా గురువారం మర్యాద పూర్వకంగా రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్.నరసింహన్‌ను కలిశారు. ఇటీవల బాధ్యతలను స్వీకరించిన జిఎం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటి అయిన సందర్భంగా ద.మ. రైల్వే నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధికి తీసుకునే చర్యలతో పాటు అభివృద్ధిపై చర్చించినట్లు సమాచారం. దేశంలోని అన్ని జోన్ల కంటే ఆదాయాన్ని ఆర్జించడంలో ద.మ. రైల్వే మొదటి స్థానంలో ఉండడంతో పాటు నిర్వహణలో సైతం మెరుగ్గా ఉన్న అంశాన్ని గవర్నర్‌కు వివరించిన నూతన జిఎం మాల్యా భవిష్యత్తులోనూ ఇదే ఒరవడిని కొనసాగించడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పినట్లు తెలిసింది.

9న ఎడ్యుకేషన్ ఫెయిర్

మన తెలంగాణ / సిటీబ్యూరో : విదేశాలలో ఉన్నత చదువులను అభ్యసించాలన్న అభిలాషతో ఉన్న విద్యార్థులకు ఈనెల 9వ తేదీన అవకాశం అందుబాటులోకి రానున్నది. కెనడా, యుకెలకు చెందిన 30 ప్రభుత్వ విశ్వ విద్యాలయాలు నగరానికి రానున్నాయి. దరఖాస్తు ఖర్చు, ప్రాసెసింగ్ ఛార్జీలు చెల్లించకుండానే విదేశీ చదువులకు ఎంపికయ్యే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు ఆస్ట్రేలియా ఎడ్యుకేషన్ కెరియర్ కన్సల్టెంట్(ఎఈసిసి) ఆపరేషన్స్ హెడ్ ఇంతియాజ్ బన్నూరు తెలిపారు. గురువారం సోమాజీగూడలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ.. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో విదేశీ వర్శిటీల్లో అర్హత సంపాదించిన విద్యార్థులు స్కాలర్‌షిప్ సదుపాయాన్ని పొందవచ్చన్నారు. పదవ తరగతి కానీ, ఇంటర్మీడియేట్‌లో కానీ 58 శాతం ఉత్తీర్ణతను సాధించిన విద్యార్థులు ఎంట్రన్స్ ఎగ్జామ్‌తో ప్రమేయం లేకుండానే ఎంపిక కావచ్చన్నారు. దేశవ్యాప్తంగా 350 విశ్వ విద్యాలయాలకు సంబంధించి స్వదేశీ విద్యార్థులకు సేవలందిస్తున్నట్లు ఆ సంస్థ కోఆర్డినేటర్ ఉమ తెలిపారు.

వేధింపులకు యువతి ఆత్మహత్య



మన తెలంగాణ/కథలాపూర్ : కొన్ని సంవత్సరాలుగా తనను ప్రేమిస్తున్నానంటూ ఓ యువకుడు వేదించడంతో జగిత్యాల జిల్లా కథలాపూర్ గ్రామానికి చెందిన తోట హర్షిత (18) అనే యువతి గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ నాగేశ్వర్ వివరాల ప్రకారం కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు తనను ప్రేమించాలని హర్షితను వెంబడించి వేదిస్తుండడంతో తీవ్ర మనస్థాపానికి గురై తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని. ప్రస్తుతం హర్షిత కోరుట్లలో డిగ్రీ చదువుతుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి




మన తెలంగాణ / జడ్చర్ల : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాచారం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందని సీఐ జక్కుల బాలరాజు తెలిపారు. గురువారం హైదరాబాద్ నుండి జడ్చర్ల వైపు వస్తున్న మారుతి ఓమ్ని కారును ఆయిల్ ట్యాంకర్ అతి వేగంగా వచ్చి ఢీ కొనడంతో రోడ్డు డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడిందని ఆయన తెలిపారు. హన్వాడ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సుజాత అక్కడికక్కడే మృతి చెందగా ముగ్గురిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం, అతి వేగమే కారణమని ఆయన అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బాలరాజు తెలిపారు.

మహిళపై హత్యాయత్నం



మనతెలంగాణ / రుద్రంగి : వివాహేతర సంబంధం పెట్టుకుందని మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలోరుద్రంగి మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కథలాపూర్ మండలం కలికోట గ్రామానికి చెందిన చింతం సాయవ్వ అనే మహిళ తన భర్తతో విడాకులు తీసుకుంది. కూతురుకు వివాహం చేసింది. మతి స్థిమితం లేని తన కొడుకుతో కలికోట గ్రామంలో నివాసం ఉంటున్న ఆమె అదే గ్రామానికి చెందిన గిరిజన తాండా వాసి ధరావత్ రాజు అనే వ్యక్తితో గత కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకుంది. రాజు కొంతకాలం గల్ఫ్ దేశం వెళ్లి వచ్చి గత నెల 30వ తేదిన ఆమెను వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన వెంటనే మొదటి భార్య ధరావత్ పూర్భన్ కథలాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా గురువారం రుద్రంగి మండల కేంద్రానికి పని నిమిత్తం వచ్చిన సాయవ్వను రాజు మొదటి భార్య అతని రెండవ కూమారుడు ధరావత్ మోహన్ ఇరువురు స్థానిక ఆంధ్రాబ్యాంక్ ముందర తాడు మెడకు చుట్టి కింద పడేసి చంపడానికి ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించడంతో ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, గాయపడిన సాయవ్వను సిరిసిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించి, దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతామని పోలీసులు తెలిపారు.

పసుపు, ఎర్రజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



మనతెలంగాణ/ఆర్మూర్ : రైతులు పండించిన పసుపు, ఎర్రజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతులు నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పసుపు క్వింటాలుకు రూ.15వేలు, ఎర్రజొన్నలకు రూ.3500మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతు న్నారని రైతు నాయకులు ఆరోపించారు. సుపును ఆన్‌లైన్ ట్రేడింగ్ నుండి మిన హాయించాలని కోరారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ వల్ల రైతులకు జరిగే అన్యాయంపై మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనకు ఆర్మూర్ డివిజన్ పరిధిలోని జక్రాన్‌పల్లి, వేల్పూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి తదితర మండలాల పరిధిలోని వంద గ్రామాల నుండి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రైతుల ఆందోళన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆర్మూర్ ఎసిపి రాములు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఆందోళనలో రైతు నాయకులు అన్వేష్, ప్రభాకర్, దేవరాజ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ దవాఖానాలు 'కిట్' కిట



ప్రతిష్ట పెంచిన 'కెసిఆర్ కిట్'

- ప్రసవాలకు సర్కార్ దవాఖానాల వైపు గర్భిణీల మొగ్గు
- వరంగల్ గ్రామీణ జిల్లాకు రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

మన తెలంగాణ/ వరంగల్ గ్రామీణ జిల్లా ప్రతినిధి : 'తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'కెసిఆర్ కిట్' పథకం ప్రభుత్వ దవాఖానాల ప్రతిష్టను పెంచుతుంది. కెసిఆర్ కిట్‌తో పాటు ప్రోత్సాహకాలు గర్భిణీలను ఆకర్శిస్తుంది. గతం కంటే భిన్నంగా గర్భిణీలు సర్కార్ దవాఖానాలలోనే ప్రసవాలకు మొగ్గు చూపుతున్నారు. దీంతో సర్కార్ దవాఖానాలలో ప్రసవాలు సంఖ్య గణనీయంగా పెరిగి సర్కార్ దవాఖానాల ప్రతిష్టతో పాటు కెసిఆర్ ప్రభుత్వం పై ప్రజలకు మరింత నమ్మకాన్ని పెంచుతుందనేది గమనార్హం. రాష్ట్రంలోనే సర్కార్ దవాఖానా ప్రసవాలలో వరంగల్ రూరల్ జిల్లా ప్రథమ స్థానంలో ఉందనేది గమనార్హం.'

కెసిఆర్ కిట్ అమలుతో గర్భిణీలు ప్రసవాలకు సర్కార్ దవాఖాలను అశ్రయించటం గతం కంటే పెరిగింది. కార్పొరేట్ వైద్యం కంటే సర్కార్ వైద్యమే బెటర్ అనే నమ్మకాన్ని కెసిఆర్ కిట్ కలిగించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2017 నుంచి ఫిబ్రవరి 2019 వరకు సర్కార్ దవాఖానాలలో జరిగిన ప్రసవాల గణంకాలు సర్కార్ వైద్యసేవల పట్ల ప్రజలు ఆకర్శితులవుతున్నారనే అంశాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. వరంగల్ రూరల్ జిల్లా వ్యాప్తంగా గణంకాలను పరిశీలిస్తే 2017 జూన్ నుంచి 2019 ఫిబ్రవరి వరకు 6779 ప్రసవాలు జరిగినట్లు లెక్కలు తెలుపుతున్నాయి. ఇందులో జిల్లాలోని వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలో 3293 ప్రసవాలు జరిగి జిల్లాలో ప్రథమ స్థానంగా నిలిచింది. ఇక రెండవ స్థానంలో నర్సంపేట ఆరోగ్య కేంద్రం పరిధిలో 1888 ప్రసవాలు జరిగాయి. పరకాల పిహెచ్‌సీ కేంద్రం పరిధిలో 1033 ప్రసవాలు జరిగి మూడవ స్థానంలో ఉందని లెక్కలు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. వరంగల్ రూరల్ జిల్లాలోని ఆరోగ్యకేంద్రాలైనటువంటి దామెర, ఆత్మకూర్, గీసుగొండ పర్వతగిరి, సంగెం, రాయపర్తి, శాయంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపూర్, నెక్కొండ తదితర చోట్ల పదుల సంఖ్యలో ప్రసవాలు నమోదైనట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఈ లెక్కన జిల్లాలో అత్యధిక ప్రసవాలు సర్కార్ దవాఖానాలలో నమోదై రాష్ట్రంలోనే రికార్డు సృష్టించటంతో పాటు వరంగల్ రూరల్ జిల్లాను సర్కార్ దవాఖానా ప్రసవాలలో ప్రథమ స్థానంలో నిలబెట్టిందనేది గమనార్హం. ఇక కేసిఆర్ కిట్లు సైతం వర్ధన్నపేట, నర్సంపేట ప్రాంతాలలో రిజిస్టర్ అయినటువంటి 6194 మందికి అందించటం విశేషం. దీనితో పాటు సర్కార్ దవాఖానాలో ప్రసవాలు జరిగిన వారికి ప్రభుత్వం అదించే నగదు ప్రోత్సాకంలో భాగంగా రూ.3వేల చొప్పున 2017 జూన్ నుంచి 2019 జనవరి వరకు వరంగల్ రూరల్ వ్యాప్తంగా మూడు దశల్లో 9214 మందికి ప్రోత్సాహకం అందించినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఏదిఏమైనప్పటికీ కేసిఆర్ కిట్ గర్భిణీల్లో సర్కార్ దవాఖానాల పట్ల నమ్మకాన్ని పెంచిందనేది గమనార్హం. కేసిఆర్ కిట్, నగదు ప్రోత్సాహకంతో కార్పొరేట్ వైద్యం కంటే సర్కార్ వైద్యం వైపు గర్భిణీలు అత్యధిక సంఖ్యలోనే మొగ్గు చూపుతున్నారనటానికి పై గణంకాలు సాక్ష్యంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరో వైపు సర్కార్ దవాఖానాల ప్రతిష్ట పెరుగుతన్న కొద్ది సర్కార్ వైద్యులు కూడా బాధ్యతాయుతమైన పాత్రను పోషిస్తున్నారని సర్కార్ వైద్య సేవకులను పలువురు ప్రశంసించటం గమనార్హం. కేసిఆర్ కిట్, ప్రోత్సాహకం వివరాలను సైతం విస్తృతంగా గ్రామీణ ప్రాంతం లో ప్రచారం చేయటంతో పాటు, సర్కార్ దవాఖానాలకు ప్రసవాలకు వచ్చే గర్భిణీలకు, వారి కుటుంబాలకు నమ్మకాన్ని కలిగించే విధంగా వైద్యసేవలు అందించటలో బాధ్యతగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించటం ఫలితాలు రావటానికి ఉయోగపడ్డాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదిఏమైనప్పటికీ కిట్, నగదు ప్రోత్సాహకం, సర్కార్ దవాఖానాలలో ప్రసవాల సంఖ్యలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి వరంగల్ రూరల్ జిల్లా ప్రశంసలు అందుకుంటుందని, కేసిఆర్ కిట్‌తో సర్కార్ దవాఖానాల ప్రతిష్టను పెంచిందనేది గమనార్హం.






ఉద్యమ పాఠాలు నేర్పింది జయశంకర్ సారే

- సిఎం కెసిఆర్ ప్రత్యేక రాష్ట్రం సాధించారు
- జయశంకర్ వెన్నుదన్నుగా నిలిచారు
- ఎంబిసిలకు 90శాతం సబ్సిడీ రుణాలు : హరీశ్‌రావు



మన తెలంగాణ/సిద్ధిపేట ప్రతినిధి : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఉద్యమ పాఠాలు నేర్పింది కీర్తిశేషులు ప్రొఫెసర్ జయశంకర్ సారేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో రూ.70లక్షల వ్యయంతో నిర్మించిన జయశంకర్ కమ్యూనిటీ భవనంను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. తొలి, మలిదశ ఉద్యమాల్లో జయశంకర్ వెన్నంటి ఉన్నారని గుర్తుచేశారు. సిఎం కెసిఆర్, జయశంకర్‌లు ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. సిద్ధిపేట పట్టణంలో నిర్మించిన విశ్వకర్మ భవానానికి మహనీయులు జయశంకర్ పేరు పెట్టడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. త్వరలోనే రూ.50 లక్షలతో గజ్వేల్‌లో సైతం భవనాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. జయశంకర్ అందించిన స్ఫూర్తి చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. అలాగే గతంలో సిద్ధిపేటలో జయశంకర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. మాజీ స్పీకర్ మధుసూదనచారి సైతం తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంబిసిలకు సబ్సిడీపై రుణాలు అందిస్తుందన్నారు. వృత్తిపరమైన నైపుణ్యం కోసం సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణను సైతం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన విశ్వకర్మ నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో చోటు కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్‌ను నివారించి పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి, వాటి సంరక్షణకు పాటుపడాలన్నారు. అంతకుముందు అక్కడే ఉన్న విశ్వకర్మ దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ ప్రతాప్, కౌన్సిలర్లు బూర శ్రీనివాస్, తెల్జరి శ్రీనివాస్ యాదవ్, బాసంగారి వెంకట్, నాయకులు బూర విజయ మల్లేశం, కంటెం రాజు, సతీష్, విశ్వకర్మ సంఘం ప్రతినిధులు నాగభూషణం, గురుచరణం, గణేష్, మదన్‌మోహన్, లక్ష్మీ నారాయణ, రాములు, యాదగిరి, శ్రీనివాస్, రవీంద్రచారి తదితరులు ఉన్నారు.

ఆశపుర సుద్ద కంపెనీ మేనేజర్ ఆత్మహత్య



మన తెలంగాణ/తాండూరు: ఆశపుర సుద్ద కంపెనీ మేనేజర్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాండూరులో జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూల్ జిల్లా, ఆదోని గ్రామానికి చెందిన ఆనంద్ దివాటి (55) పదేళ్ల క్రితం తాండూరుకు వచ్చి స్థిర పడ్డారు. భార్య జయశ్రీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆనంద్ ధారూర్ ఆశపుర సుద్ద కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం కంపెనీ మూత పడటంతో సొంత డబ్బులతో సుద్ద వ్యాపారం చేపట్టేవారని పలువురు తెలిపారు. భార్య జయశ్రీ వారం రోజుల క్రితం తిరుపతి దేవాలయంలో సేవ చేసుకునేందుకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొడుకు, కూతురు ఇద్దరు హాస్టల్స్‌లో ఉండి చదువుకుంటున్నారు. తాండూరు పోలీసులకు సమాచారం అందించటంతో పట్టణ సిఐ ప్రతాఫ్ లింగం, ఎస్ఐ, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్య చేసుకోవడంలో ఎవరి ప్రమేయం లేదని, సూసైడ్ నోట్ రాసి చనిపోయాడని, భార్య, పిల్లలు తిరుపతి నుంచి వచ్చాక విచారణ చేపడతామని సిఐ తెలిపారు.

విద్యుత్ వాహనాల నోడల్ ఏజెన్సీగా 'రెడ్‌కో'

మన తెలంగాణ/హైదరాబాద్ : విద్యుత్ వాహనాల చార్జింగ్‌కు సంబంధించిన మౌలిక వసతుల కల్పనకు టిఎస్ రెడ్‌కో (సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యుత్ సంస్థలకు, వినియోగదారునికి మధ్య అనుసంధానంగా టిఎస్ రెడ్‌కోను నోడల్ ఏజెన్సీగా నియమిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. కేంద్ర విద్యు త్ శాఖ గతంలో విద్యుత్ వాహనాల చార్జింగ్ వసతులపై కొన్ని ప్రమాణాలు, నిబంధనలు రూపొందించింది. ఆ నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రెడ్‌కోను నోడల్ ఏజెన్సీగా నియమించింది.

నల్లబెల్లం పట్టివేత

- 128 క్వింటాళ్ల నల్లబెల్లం, 10క్వింటాళ్ల పటిక స్వాధీనం



మన తెలంగాణ/మహబూబాబాద్ ప్రతినిధి : చిత్తూరు వ్యవసాయ మార్కెట్ నుంచి అమ్మడానికి తరలిస్తున్న గుడుంబా తయారీకి వినియోగించే నల్లబెల్లం పటికను తరలిస్తున్న లారీని మహబూబాబాద్ రూరల్ పోలీసులు శుక్రవారం పట్టుకుని లారీ, సరుకు సీజ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్‌పి నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి గ్రామానికి చెందిన భూక్య వీరేందర్, ఏటిగడ్డ తండాకు చెందిన గుగులోతు సుమన్ జమాండ్లపల్లి శివారులో ఎపి 36 టిఎస్ 9155నెంబర్ గల లారీలో 250 బస్తాల నల్లబెల్లం, 125 క్వింటాళ్ల పటిక 20 సంచుల్లో అక్రమంగా తరలిస్తుండగా మహబూబాబాద్ రూరల్ ఎస్సై పి.జితేందర్, సిబ్బంది రవీందర్‌రెడ్డి, నరేందర్, అమ్రు, హోంగార్డు జంపయ్య బృందం పట్టుకున్నట్లు ఎస్‌పి తెలిపారు. దీని విలువ సుమారు రూ.8.5లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులపై కేసునమోదు చేసి, పరారైన వాంకుడోతు సుధాకర్‌లను అదుపులోకి తీసుకున్నామని, పరారీలో ఉన్న వారిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌పి తెలిపారు. అలాగే గుండాల గడ్డ తండాకు చెందిన భూక్య సోమ్లా తన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 3క్వింటాళ్ల నల్లబెల్లం, 20కెజిల పటికను స్వాధీనం చేసుకున్నామని భూక్యాకు నల్ల బెల్లాన్ని సరఫరా చేస్తున్న కిషన్‌ను పట్టుకుని అరెస్ట్‌చేసి వారి నుంచి బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు తిరిగి నేరాలు చేయకుండా వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పి కోటిరెడ్డి తెలిపారు. నల్లబెల్లం లారీని పట్టుకున్న ఎస్సై జితేందర్‌కు రివార్డు అందించారు.

లిఫ్ట్ కూలి నలుగురికి తీవ్రగాయాలు

మనతెలంగాణ/నాగర్‌కర్నూల్ ప్రతినిధి : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలో గల సుఖజీవన్‌రెడ్డి ఏసీ ఫంక్షన్‌హాల్‌లో గురువారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తూ లిఫ్టుతీగ తెగడంతో అందులో ఉన్న తొమ్మిది మందికి గాయాలుకాగా , ముగ్గరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సుఖజీవన్‌రెడ్డి ఫంక్షన్‌హాలులో మధ్యాహ్నం ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన అతిథులు సుమారు 12మందిదాకా లిఫ్టులో ఎక్కారు. అదే సమయంలో ఓవర్ లోడ్ కావడంతో ఐదో అంతస్థు నుంచి కిందికి వస్తున్న క్రమంలో ఒక్కసారిగా తీగతెగడంతో గ్రౌండ్ ఫ్లోర్‌కు వేగంగా లిఫ్టు జారిపడింది. దీంతో దాని కిందభాగాన అమర్చే సెక్యూరిటీ స్ప్రింగ్‌లు ఉండటం వల్ల తిరిగిలిఫ్టు రెండో అంతస్థుకు అంతేవేగంతో వెళ్లి ఆగిపోయింది. దీంతో అక్కడేఉన్న వారు గమనించి లిఫ్టు తలుపులను బద్దలకొట్టి బాధితులను బయటకు తీశారు. ఈక్రమంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ విందుకు హాజరైన బుషరా , సుధ అనే ఇద్దరు ప్రైవేట్ టీచర్లకు కాళ్లు విరిగాయి. వీరికి మోకాళ్ల వద్ద మూడు మూడు చొప్పున ప్యాక్చర్‌లు ఉన్నట్లు వైద్యులు తెలిపారని బాధితుల బంధువులు తెలిపారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ నిరంజన్‌కు సైతం కాలు విరిగింది. ఇతను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుషరా, సుధలు మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరితోపాటు మరికొందరికి కూడా గాయాలయ్యాయి. వీరికి ప్రాథమికంగాచికిత్స నిర్వహించి పంపించారు. ఇదిలా ఉండగా లిఫ్టులో ప్రమాదసమయంలో 12మంది ఉండటం ఫంక్షన్‌హాల్ యాజమాన్యం లిఫ్టువద్ద సెక్యూరిటీని , లిఫ్టు ఆపరేటర్‌ను అందుబాటులో ఉంచకపోవడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు పలువురు ఆరోపించారు. దీనికితోడు ఓవర్‌లోడ్ ఉంటే వచ్చే బీప్ సిస్టమ్ కూడా అమర్చలేదని అందుకే ఈ ప్రమాదం సంభవించిందనితెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

ఎసిబికి చిక్కిన పంచాయితీరాజ్ డిఇ

- రూ. 60 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిన వైనం





మన తెలంగాణ/ వేములవాడ: ఏసిబి వలలో మరో అవినీతి చేప చిక్కింది. ఏకంగా మూడు లక్షల బిల్లు కోసం రూ. 60వేల లంచం తీసుకుంటూ వేములవాడ పంచాయితీ రాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మహేందర్‌రెడ్డి గురువారం ఏసిబి డిఎస్పి రవికుమార్ బృందానికి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. వివరాల్లోకి వెళ్తె వేములవాడ సబ్ డివిజన్‌లో పంచాయితీరాజ్ కార్యాలయంలో డిఈగా విధులు నిర్వహిస్తున్న మహేందర్‌రెడ్డి, బోయినపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కట్ట కనకవ్వ హాయాంలో గ్రామ పంచాయితీ భవనం నిర్మించారు. భవనానికి సంబంధించిన బిల్లు రూ. 10లక్షలు గతంలోనే మంజూరయ్యింది. ఫైనల్ బిల్ అయినా మిగతా రూ. 3లక్షలు మంజూరీ కోసం కట్ట కనకవ్వ భర్త కట్ట లచ్చయ్య డిఈ మహేందర్‌రెడ్డిని సంప్రదించాడు. దీనికి లంచంగా రూ. 70వేల రూపాయాలు డిఈ డిమాండ్ చేయడంతో, లచ్చయ్య డిఈని సార్ నా వద్ద డబ్బులు లేవు...! సార్ కొంచెం తగ్గించండి.. అని ప్రాదేయపడ్డానని అయిదు నెలల నుండి ఇలానే ఇబ్బందికి గురి చేసాడని, భరించలేకే ఏసిబిని ఆశ్రయించానని లచ్చయ్య పేర్కొన్నాడు. స్పందించిన ఏసిబి సిబ్బంది పక్కా ప్రణాళికతో లచ్చయ్యకు సూచనలు చేశారు. వారు చెప్పిన ప్రకారమే లచ్చయ్య రూ. 2 వేల రూపాయల నోట్లతో రూ. 50వేల రూపాయలను డిఈకి ఇవ్వబోయాడు. దానికి రూ. 50వేలు వద్దు, రూ. 60వేలు కావాలని డిఈ లచ్చయ్యను డిమాండ్ చేశాడు. ప్రణాళిక ప్రకారమే వాటికి రూ. 50వేలకు రూ. 10వేలు కలిపి రూ. 60వేలు లంచంగా డిఈకి ఇచ్చారు. వెంటనే ఏసిబి అధికారులు ఒక్కసారిగా దాడి చేసి పంచాయితీ జ్ కారాలంలోనే డిఈ ఏసిబి వలలో చిక్కాడు. అనంతరం డిఎస్పి రవి కుమార్ మాట్లాడుతూ పంచానామ నిర్వహించి, డబ్బులు రికవరీ చేసుకుని, నేడు ఏసిబి ప్రత్యేక కోర్టులో నిందితుడిని హాజరుపరచడం జరుగుతుందని వెల్లడించారు.

> తెరి, మెర్సల్ చిత్రాల తర్వాత దర్శకుడు అట్లి, స్టార్ హీరో విజయ్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మూడవ చిత్రానికి నేను సంగీతాన్ని అందించడం ఎంతో ఆనందంగా ఉంది. అట్లీకి ఉన్న సంగీత జ్ఞానం అద్భుతమైనది. ప్రతి ట్యూన్ సన్నివేశానికి కనెక్ట్ అవుతుందా, లేదా అని ఆయన పలుసార్లు చెక్ చేసుకుంటారు. అట్లి మాదిరిగా సంగీత జ్ఞానం ఉన్న దర్శకులు చాలా అరుదు.
>
> – ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్

సినిమా



అల్లరి నరేష్, వంశీపైడిపల్లి, దిల్‌రాజులతో 'మహర్షి' చిత్ర బృందం



డబ్బింగ్ మొదలుపెట్టిన మహర్షి

'భరత్ అనే నేను' చిత్రం తర్వాత సూపర్‌స్టార్ మహేష్‌బాబు చేస్తున్న 'మహర్షి' సినిమాపై ప్రేక్షకులు, అభిమానుల అంచనాలు మామూలుగా లేవు. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో దిల్‌రాజు, అశ్వనీదత్, పివిపి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది. ఇక 'మహర్షి' చిత్రం డబ్బింగ్ వర్క్‌ను మొదలుపెట్టారు ఫిల్మ్‌మేకర్స్. దిల్‌రాజు, వంశీ పైడిపల్లి, అల్లరి నరేష్‌తో పాటు సినిమా టీం సభ్యులు పాల్గొనగా పూజా కార్యక్రమాలతో దీన్ని ప్రారంభించారు. ఫిల్మ్‌మేకర్స్ ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను విడుదల చేశారు. మహేష్ ఇందులో లేకపోయినా అభిమానులు ఈ ఫొటోలను సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేస్తున్నారు. ఇక అల్లరి నరేష్‌తో పాటు ఇతర పాత్రధారుల డబ్బింగ్ కొనసాగుతున్నట్టు తెలిసింది. ఈ సినిమాలో మహేష్ క్లాస్‌మేట్‌గా నటించిన అల్లరి నరేష్ తన ఊరిలో వ్యవసాయం చేస్తూ చితికిపోయిన యువ రైతుగా కనిపిస్తారట. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు.

సేవ చేసే నాయకులు మనకు అవసరం



అట్లూరి నారాయణరావు, వాయు తనయ్, సుచిత్ర, శశి

స్వలాభం కోసం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో వచ్చే రాజకీయ నాయకులను మాత్రమే ఎన్నికల్లో గెలిపించాలనే కథాంశంతో 'నేనే ముఖ్యమంత్రి' చిత్రాన్ని నిర్మించామని చిత్ర నిర్మాతల్లో ఒకరైన అట్లూరి నారాయణరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నందిగామలో ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరిగింది. శ్రీ వైష్ణవి ఫిలింస్, ఆలూరి క్రియేషన్స్ పతాకాలపై అట్లూరి నారాయణరావు, ఆలూరి సాంబశివరావు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. దేవిప్రసాద్, వాయు తనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రల్లో మోహన్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం శుక్రవారం విడుదల కానుంది. సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ ''ప్రస్తుత పరిస్థితుల్లో నిస్వార్థంతో సేవ చేసే నాయకులు మనకు అవసరం. సరైన నాయకుడిని ఎన్నుకోవాల్సిన బాధ్యత మనదే అని మా సినిమాలో చూపించాం''అని తెలిపారు. దర్శకుడు మోహన్ రావిపాటి మాట్లాడుతూ ''మన అభివృద్ధి కోసం మనకు ఎలాంటి నాయకుడు అవసరమో తేల్చి చెప్పే సినిమా ఇది. అవినీతి పరులను కాకుండా నిజాయితీపరులను ఎన్నుకోండి అనే మంచి సందేశంతో సినిమా రూపుదిద్దుకుంది''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్మన్ పద్మావతి, సంగీత దర్శకుడు ఫణి కళ్యాణ్, నటులు వాయుతనయ్, శశి, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.



కిల్ బిల్ పాండేను కలవడం సంతోషంగా ఉంది

స్టార్ కమేడియన్ బ్రహ్మానందానికి ముంబయిలోని ఏషియన్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌లో గత నెల 14న హార్ట్ సర్జరీ జరిగిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ తర్వాత బ్రహ్మానందం విశ్రాంతి తీసుకుంటున్నారు. అభిమానులు మాత్రమే కాకుండా టాలీవుడ్ ప్రముఖులు ఆయన త్వరగా కోలుకోవాలని మళ్లీ సినిమాలు చేయాలని కోరుకుంటున్నారు. ఇదిలాఉండగా స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ బ్రహ్మానందాన్ని కలిసి పరామర్శించారు. ఆయనతో చాలాసేపు ముచ్చటించడమే కాకుండా తమ ఫొటోను ట్విట్టర్ ఖాతా ద్వారా షేర్ చేస్తూ ఒక ట్వీట్ చేశారు. ''నిజమైన ఐరన్ మ్యాన్. మనోస్థైర్యం ఉన్న వ్యక్తి బ్రహ్మానందం. సరదాగా ఉంటారు. భయమే లేదు. మా కిల్ బిల్ పాండేను కలవడం చాలా సంతోషంగా ఉంది''అని అల్లు అర్జున్ పేర్కొన్నారు. ఇక ఫొటోలో బ్రహ్మానందం, అల్లు అర్జున్ ఇద్దరూ థంబ్స్ అప్ సింబల్ పెట్టి చిలిపిగా నవ్వారు. అందులోనూ ముఖ్యంగా బ్రహ్మానందం నాలిక పక్కకు పెట్టిన పోజు ఆయన ఎంత జోవియల్‌గా ఉంటారో తెలియజేస్తుంది.

ప్రేమ ఎలా ప్రారంభమవుతుంది?



సిద్ధికా శర్మ, రజత్ రాఘవ్, కరిష్మా కౌర్

ప్రేమ్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'ప్రేమ పరిచయం' చిత్రం గురువారం హైదరాబాద్‌లో లాంఛనంగా మొదలైంది. రజత్ రాఘవ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధికా శర్మ, కరిష్మా కౌర్ హీరోయిన్లు. శివ.ఐ దర్శకత్వంలో ఎ.పెరుమాండ్లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి చిత్ర నిర్మాత పెరుమాండ్లు కెమెరా స్విచ్చాన్ చేశారు. పారిశ్రామికవేత్త సుభాష్ రెడ్డి క్లాప్‌నిచ్చారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత పెరుమాండ్లు మాట్లాడుతూ ''యువతీ యువకులు తెలిసీ తెలియక ఎన్నో పొరపాట్లు చేస్తుంటారు. అయితే వాటి ప్రభావం భవిష్యత్తుపై ఉంటుందని చెప్పే చిత్రమిది. రొమాన్స్‌తో పాటు అన్ని అంశాలు ఇందులో ఉంటాయి. యువత కు చక్కటి సందేశాన్నిచ్చే సినిమా ఇది. ఈనెల 11 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం''అని అన్నారు. దర్శకుడు శివ మాట్లాడుతూ ''ప్రేమ గురించి ఎన్నో చిత్రాలు వచ్చాయి. అయితే అసలు ప్రేమ ఎలా ప్రారంభ మవుతుంది? అనే విషయాన్ని లోతుగా ఈ సినిమాలో చూపిస్తున్నాం. ఈ సినిమా ద్వారా కొత్త టెక్నాలజీని ఉపయోగిస్తు న్నాం. బ్యాక్‌గ్రౌండ్‌లో వచ్చే నేచర్‌ని కూడా విజువల్ ఎఫెక్ట్స్ ద్వారా చూపిస్తు న్నాం. దర్శకుడిగా ఇది నా తొలి సినిమా'' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతంః అగస్త్య, కెమెరాః మాదేశ్, ఎడిటర్ః నందమూరి హరి.

అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ షూటింగ్ షురూ



సందీప్ కిషన్, హన్సిక

యంగ్ హీరో సందీప్ కిషన్ 'తెనాలి రామకృష్ణ బిఎ బిఎల్' అనే అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ చేస్తున్నారు. కొన్ని రోజుల కింద ఓపెనింగ్ జరుపుకున్న ఈ చిత్రం షూటింగ్ గురువారం కర్నూలులో మొదలైంది. హీరోహీరోయిన్లు సందీప్ కిషన్, హన్సిక ఈ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. దర్శకుడు జి.నాగేశ్వర రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మురళీశర్మ, వరలక్ష్మి శరత్‌కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శేఖర్ చంద్ర ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా... సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎస్ఎన్ఎస్ క్రియేషన్స్ బ్యానర్‌పై అగ్రహారం నాగిరెడ్డి, సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్ః ఛోటా కె.ప్రసాద్, ఆర్ట్ః కిరణ్, మాటలుః నివాస్, భవానీ

ఇసుక తిన్నెల్లో అందాల ఆరబోత



ఇసుకలో అందాల భామల సొగసులు రెట్టింపు అవుతాయని ఎందరో హీరోయిన్లు నిరూపించేశారు. బీచ్‌లలో వయ్యారాలు ఒలకబోస్తూ పలువురు అందాల భామలు హాట్ హాట్‌గా దర్శనమిచ్చి అభిమానులను మురిపిస్తున్నారు. తాజాగా ముద్దుగుమ్మ అమలాపాల్ ఇసుకు తిన్నెల్లో కూర్చొని సిగ్గులొలికించింది. చేతిలో జ్యూయలరీ బాక్స్‌తో అందంగా దర్శనమిచ్చింది. ఆమె ముఖంలో హాట్ అండ్ వైల్డ్ ఎక్స్‌ప్రెషన్ యూత్‌ను ఆకట్టుకుంటోంది. అమలాపాల్ గ్లామర్ పోజు ప్రస్తుతం సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఇదిలాఉండగా అమలాపాల్ తెలుగులో చేసినవి చాలా తక్కువ సినిమాలే అయినా హీరోయిన్‌గా ఆమె మంచి పేరు తెచ్చుకుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ మలయాళంలో వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. తమిళంలో ఒకటి, రెండు సినిమాల్లో నటిస్తోంది అమలాపాల్.

గ్లామర్ పండించడానికి సిద్ధమే



'నన్ను దోచుకుందువటే' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన బ్యూటీ నభా నటేష్. 'సిరి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్...' అంటూ ఈ సినిమాలో క్యూట్ క్యూట్‌గా తన అల్లరితో హీరో సుధీర్ బాబునే కాదు ప్రేక్షకులు అందరినీ ఆకట్టుకుంది. ఆతర్వాత ఈ భామకు తెలుగులో వరుసగా అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఎనర్జిటిక్ హీరో రామ్‌తో కలిసి 'ఇస్మార్ట్ శంకర్' సినిమాలో నటిస్తోంది ఈ యంగ్ బ్యూటీ. ఈ సినిమాతో పాటు మరో రెండు, మూడు సినిమాలు నభా చేతిలో ఉన్నట్లు తెలిసింది. ఇదిలాఉండగా సినిమాలో సన్నివేశం డిమాండ్ చేస్తే గ్లామర్ పండించడానికి సిద్ధమేనని అంటోంది ఈ భామ. తన అందచందాలను ప్రదర్శించడానికి వెనుకాడనని చెబుతోంది. తొలి సినిమాలో ట్రెడిషనల్‌గా చూశాం కదా. అందుకే శాంపిల్‌గా తనలోని గ్లామర్‌ను ఇదిగో ఇలా ఎక్స్‌పోజ్ చేసి చూపిస్తోంది. తాజాగా నభా నటేష్ తన గ్లామర్ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ భామ హాట్ ఫొటోలు కుర్రకారును మైమరపిస్తున్నాయి.

పౌల్ట్రీ పరిశ్రమకు అండగా సిఎం కెసిఆర్

- మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న సరఫరాకు ఆదేశాలు
- తెలంగాణ పౌల్ట్రీ బీడర్స్ అసోసియేషన్ హర్షం

మన తెలంగాణ/ హైదరాబాద్ : కోళ్ల పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి. రంజిత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అధిక కోళ్ల దాణా వ్యయం, కోళ్లకు వచ్చే జబ్బులు, పౌల్ట్రీ ఉత్పత్తులకు తక్కువ మార్కెట్ ధరలు మొదలైన సమస్యలతో పౌల్ట్రీ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అండ్ నేషనల్ ఎగ్ కోఆర్డినేషనల్ కమిటీ సంయుక్తంగా పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాయి. మొక్కజొన్న దిగుబడి లేక కోళ్ల దాణా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. మొక్కజొన్నకు అధిక ధరలు చెల్లించాల్సి వస్తోంది. రైతులకు మద్దతు ధర చెల్లించి మొక్కజొన్న ప్రభుత్వం తెలంగాణ సర్కారు మాత్రమే. మొక్కజొన్న రైతులను ఆదుకున్నట్టుగా తమనూ ఆదుకోవాలని సిఎంకు విన్నవించగా సానుకూలంగా స్పందించారు. తెలంగాణ పౌల్ట్రీ రైతుల సంఘాలు విన్నవించిన విధంగా నాలుగు లక్షల టన్నుల మొక్కజొన్నను, కిలో రూ.18 చొప్పున తెలంగాణ మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేయాలని సిఎం కెసిఆర్ ఆదేశాలు జారీ చేశారు. సిఎం స్పందనకు గాను పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి. రంజిత్ రెడ్డి, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు ఇ.ప్రదీప్ కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు.

సామ్‌సంగ్ సేల్స్‌లో దేశంలో మూడో స్థానానికి బిగ్‘సి’



మన తెలంగాణ/ హైదరాబాద్ : సామ్‌సంగ్ మొబైల్ విక్రయాల్లో బిగ్‘సి’ దేశంలోనే మూడో స్థానం సాధించింది. ఈ సందర్భంగా మొబైల్ రిటైల్ సేల్స్ దిగ్గజం బిగ్‘సి’ని సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ సౌత్‌వెస్ట్ ఏసియా ప్రెసిడెంట్, సిఇఒ హెచ్‌సి హంగ్ సందర్శించారు. బిగ్‘సి’ సంస్థ వ్యవస్థాపకుడు, సిఎండి ఎం.బాలు చౌదరీని ఆయన అభినందించారు. 16 సంవత్సరాలు సామ్‌సంగ్ అమ్మకాల్లో బిగ్‘సి’ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో మొదటి స్థానంలో నిలిచింది. బిగ్‘సి’ సిఎండి ఎం.బాలు చౌదరీ మాట్లాడుతూ, సామ్‌సంగ్ నుంచి పూర్తి సహకారం ఉండడం వల్లే ఈ ఘనతను సాధించామని అన్నారు. కంపెనీ సహకారంతో భవిష్యత్‌లో కొత్త మొబైల్స్ అమ్మకాలతో మరిన్ని లక్ష్యాలను సాధిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సామ్‌సంగ్ సిబ్బంది, బిగ్ సి డైరెక్టర్స్ వై.స్వప్నకుమార్, జి.బాలాజీ రెడ్డి పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36,971.09	-4.14	(-0.01%)
నిఫ్టీ	11,069.40	6.95	(0.06%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	71.72
యూరో	81.48
బ్రిటిష్ పౌండ్	92.73
ఆస్ట్రేలియన్ డాలర్	50.98
కెనెడియన్ డాలర్	54.18
సింగపూర్ డాలర్	52.91
స్విస్ ఫ్రాంక్	71.53
చైనీస్ యువాన్	10.63
మలేషియన్ రింగిట్	17.59
న్యూజిలాండ్ డాలర్	48.48
హాంకాంగ్ డాలర్	9.14
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	236.41
సౌతాఫ్రికన్ రాండ్	5.29

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	31580	33775.40	0.57%
ముంబై	32360	34609.63	0.8%
ఢిల్లీ	32250	34491.98	0.62%
కోల్‌కతా	32590	34855.61	0.61%
కేరళ	30800	32941.18	0.96%
బెంగళూరు	31050	33208.56	0.96%
హైదరాబాద్	31580	33775.40	0.57%
గల్ఫ్	138.61	148.25	0.84%


వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 43848.00
ముంబై	₹ 43848.00
ఢిల్లీ	₹ 43848.00
కోల్‌కతా	₹ 43848.00
హైదరాబాద్	₹ 43848.00



ఎట్టకేలకు ఆర్‌బిఐ వడ్డీ రేటును తగ్గించింది. గురువారం ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ కీలక వడ్డీ రేట్లను (రెపో రేటు) 0.25 శాతం తగ్గిస్తున్నామని ప్రకటించారు. దీంతో వడ్డీ రేటు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి దిగొచ్చింది. గృహ, ఇతర రుణాలు చౌక కానున్నాయి. ద్రవ్యోల్బణ లక్ష్యం స్థాయి అంచనా మేరకే ఉండవచ్చని ఆశిస్తున్నామని, అందుకే ఈసారి వడ్డీ రేట్లను తగ్గించామని దాస్ తెలిపారు. అలాగే ఎలాంటి హామీ లేకుండా ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని రూ.లక్ష నుంచి రూ.1.6 లక్షకు ఆర్‌బిఐ పెంచింది. దీని ద్వారా చిన్న, సన్నకారు రైతులకు మేలు జరుగుతుందని పేర్కొంది. ఉర్జిత్ పటేల్ రాజీనామా తర్వాత ఆర్‌బిఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన శక్తికాంత దాస్‌కు ఇది తొలి పాలసీ సమావేశం.

పావు శాతం కోత



- 6.25 శాతానికి తగ్గిన వడ్డీ రేటు
- హామీ లేని వ్యవసాయ రుణ పరిమితి పెంపు
- విధాన దృక్పథం ‘తటస్థం’కు మార్పు
- ఆర్‌బిఐ సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన గవర్నర్ శక్తికాంత దాస్

ముంబై : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆరో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో ఆర్‌బిఐ పావు శాతం వడ్డీ రేటును తగ్గించింది. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ మాట్లాడుతూ, ద్రవ్యోల్బణ లక్ష్యం స్థాయి అంచనా మేరకే ఉండడంతో కీలక వడ్డీ రేట్లను(రెపో రేటు) 0.25 శాతం తగ్గిస్తున్నామని అన్నారు. దీంతో వడ్డీ రేటు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి దిగొచ్చింది. గృహ, ఇతర రుణాలు చౌక కానున్నాయి. ద్రవ్యపరపతి విధాన దృక్పథాన్ని ‘క్రమాంకన బిగింపు’ నుంచి ‘తటస్థం’కు దాస్ మార్పు చేశారు. డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య, మరో సభ్యుడు చేతన్ ఘాటె రెపో రేటు యథాతథానికే ఓటు వేశారు. అయితే శక్తికాంత దాస్, మిగతా ముగ్గురు సభ్యులు పావు కోత విధించేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. ఇంకా రివర్స్ రెపో రేటును 6.25 శాతం నుంచి 6 శాతానికి ఆర్‌బిఐ తగ్గించింది. రెపో రేటు అంటే ఆర్‌బిఐ నుంచి వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే రుణ నిధి.. అలాగే రివర్స్ రెపో రేటు బ్యాంకుల నుంచి ఆర్‌బిఐ సేవరించే నిధికి ఇచ్చే రేటు. ఎలాంటి హామీ లేకుండా ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని రూ.లక్ష నుంచి రూ.1.6 లక్షకు పెంచింది. వ్యవసాయ రుణాల సమీక్షకు వర్కింగ్ గ్రూప్‌ల ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది.

ద్రవ్యోల్బణం అంచనా 3.2 శాతం


ద్రవ్యోల్బణం అంచనాను డిసెంబర్‌లో 2.2 శాతంతో 18 నెలల కనిష్టానికి తగ్గించింది. మార్చి త్రైమాసికానికి గాను ద్రవ్యోల్బణం అంచనా 2.8 శాతానికి సవరించింది. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో 3.2 – 3.4 శాతంగా, 2020 సంవత్సరానికి గాను 3.9 శాతంగా ఆర్‌బిఐ అంచనా వేసింది. ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్‌లను మరింత బలోపేతం చేయాల్సి అవసరం ఉందని తీర్మానించింది. రేట్లను తగ్గించడంతో రుణాలు చౌక అవుతాయని, ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులకు ఊతం అందించనట్టవుతుందని ఆర్‌బిఐ పేర్కొంది. జిడిపి వృద్ధి అంచనా 7.4% వచ్చే ఆర్థిక సంవత్సరానికి(2019–20) జిడిపి వృద్ధి అంచనా 7.4 శాతంగా ఉంది. ఇంతకుముందు 2018–19లో 7.2 శాతం నుంచి కొంత మేరకు ఆర్‌బిఐ పెంచింది. చమురు ధరల దృక్పథం అనిశ్చితిలో ఉంది. వాణిజ్య ఆందోళనలు అంతర్జాతీయ వృద్ధిపై ప్రభావం చూపుతున్నాయి. రూపాయి విలువ స్థిరత్వం కోసం ఆఫ్‌షోర్ రూపీ మార్కెట్లపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆర్‌బిఐ ప్రతిపాదించింది. పెద్ద మొత్తంలో డిపాజిట్లలోనూ ఆర్‌బిఐ సవరణ చేసింది. సింగిల్ రూపీ డిపాజిట్లు ప్రస్తుతం రూ.కోటి ఉండగా, ఇప్పుడు రూ.2 కోట్లకు పెంచింది. అలాగే ఎన్‌బిఎఫ్‌సి(నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ)ల విభాగంలో సామరస్యానికి మార్గదర్శకాలు జారీ చేయనున్నట్టు పేర్కొంది. మరోవైపు కార్పొరేట్ డెబిట్ మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పిఐ) పెట్టుబడులపై ఆంక్షలు తొలగించింది. వచ్చే ఎంపిసి సమావేశం ఏప్రిల్ 2 నుంచి 4 తేదీల మధ్య జరగనుంది.

ఆర్‌బిఐ సమీక్ష ముఖ్యాంశాలు



- ఆర్‌బిఐ కీలక వడ్డీ రేటులో(రెపో) 0.25 శాతం కోత విధించింది. దీంతో వడ్డీ రేటు 6.25 శాతానికి చేరింది.
- రివర్స్ రెపో రేటును 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించింది. సిఆర్ఆర్ 4 శాతం, దీనిలో ఎలాంటి మార్పు చేయలేదు.
- ద్రవ్యోల్బణం అంచనా మార్చి త్రైమాసికానికి గాను 2.8%నికి సవరించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో 3.2 – 3.4 శాతంగా, 2020 సంవత్సరానికి గాను 3.9% గా ఆర్‌బిఐ అంచనా వేసింది.
- వచ్చే ఆర్థిక సంవత్సరానికి(2019–20) జిడిపి వృద్ధి అంచనా 7.4 శాతంగా ఉంది. ఇంతకుముందు 2018–19లో 7.2 శాతంగా ఉంది.
- ఏప్రిల్–సెప్టెంబర్ వృద్ధి రేటు 7.2 నుంచి 7.4% మధ్యలో ఉండనుంది. అలాగే 2019–20 క్యూ3లో 7.5%గా ఆర్‌బిఐ అంచనా వేసింది.
- చమురు ధరల దృక్పథం అనిశ్చితిలో ఉంది. వాణిజ్య ఆందోళనలు అంతర్జాతీయ వృద్ధిపై ప్రభావం చూపుతున్నాయి.
- కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు సానుకూలంగా ఉన్నాయి.
- పెద్ద మొత్తంలో డిపాజిట్లలోనూ ఆర్‌బిఐ సవరణ చేసింది. సింగిల్ రూపీ డిపాజిట్లు ప్రస్తుతం కోటి ఉండగా, ఇప్పుడు రూ.2 కోట్లకు పెంచింది.
- ఎన్‌బిఎఫ్‌సి(నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ)ల విభాగంలో సామరస్యానికి మార్గదర్శకాలు జారీ.
- రూపాయి విలువ స్థిరత్వం కోసం ఆఫ్‌షోర్ రూపీ మార్కెట్లపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన.
- కార్పొరేట్ డెబిట్ మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పిఐ) పెట్టుబడులపై ఆంక్షలు తొలగింపు.
- పేమెంట్ గేట్‌వే సర్వీస్ అందించేవారు, పేమెంట్ అగ్రిగేటర్లపై చర్చల పత్రాలతో రానున్నామని చెప్పిన ఆర్‌బిఐ.
- ఎలాంటి హామీ లేకుండా ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని రూ.లక్ష నుంచి రూ.1.6 లక్షకు పెంచింది. దీని ద్వారా చిన్న, సన్నకారు రైతులకు మేలు జరగనుందని పేర్కొంది.
- వ్యవసాయ రుణాల సమీక్షకు వర్కింగ్ గ్రూప్‌ల ఏర్పాటు.
- రేటు తగ్గింపునకు అనుకూలంగా 4:2 నిష్పత్తితో ఎంపిసి(ద్రవ్య విధాన కమిటీ) ఓటు వేసింది.
- ఇద్దరు ఎంపిసి సభ్యులు చేతన్ ఘాటే, విరాల్ ఆచార్యలు రేటును యథాతథంగా కొనసాగించాలని ఓటు వేశారు.
- వచ్చే ఎంపిసి సమావేశం ఏప్రిల్ 2 నుంచి 4 తేదీల మధ్య జరగనుంది.

ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు



ముంబై : ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నేపథ్యంలో దేశీయ స్టాక్‌మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొన్నాయి. ఉదయం ప్రారంభంలో మార్కెట్లు ఉత్సాహంగా మొదలయ్యాయి. ఓ దశలో సెన్సెక్స్ 100 పాయింట్లకు పైగా లాభంతో ప్రతిష్ఠాత్మక 37వేల మైలురాయిని దాటింది. వడ్డీ రేట్లను తగ్గిస్తూ ఆర్‌బిఐ చేసిన ప్రకటనతో మార్కెట్లు ఊగిసలాటకు లోనయ్యాయి. మదుపర్ల లాభాల స్వీకరణతో సూచీలు నేలచూపులు చూశాయి. ఫలితంగా ఆరంభ లాభాలను కోల్పోయిన మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 4 పాయింట్ల నష్టంతో 36,971 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 7 పాయింట్ల లాభంతో 11,069 వద్ద స్థిరపడింది. ప్రధానంగా జి ఎంటర్‌టైన్‌మెంట్స్, సన్‌ఫార్మా, ఐషర్‌మోటార్స్, బజాజ్ ఆటో, గ్రాసిమ్ షేర్లు లాభపడ్డాయి. జెఎస్‌డబ్ల్యు స్టీల్స్, రిలయన్స్, ఎల్ అండ్ టి, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డిఎఫ్‌సి షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి.



రేటు తగ్గింపుతో వృద్ధికి ఊతం

న్యూఢిల్లీ: ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్ల తగ్గింపు ఆర్థిక వ్యవస్థ ఊతమివ్వనుందని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. దీంతో చిన్న వ్యాపారాలు, గృహ కొనుగోలుదారులకు సరసమైన రేట్లకు రుణాలు లభించనున్నాయని ఆయన అన్నారు. రిజర్వు బ్యాంక్ పావు శాతం వడ్డీ రేటును తగ్గించింది. దీంతో వడ్డీ రేటు 6.25 శాతానికి దిగివచ్చింది. ఆర్‌బిఐ వడ్డీ రేటు పావు శాతం తగ్గింపు, పాలసీ దృక్పథం తటస్థానికి మార్పు ఆర్థిక వృద్ధికి దోహదం చేయనుందని, రుణాలు చౌక కానున్నాయని గోయల్ పేర్కొన్నారు.

ఆర్‌బిఐ నిర్ణయం స్వాగతించదగింది : సుభాష్ గార్గ్



ఇది ఎంతో సహేతుకమైన, ఆచరణాత్మక పాలసీ నిర్ణయమని, ఆర్‌బిఐ నిర్ణయం స్వాగతించదగినదని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ గార్గ్ అన్నారు. దృక్పథం తటస్థం, పావు శాతం వడ్డీ రేటు కోత, అంచనాలు బాగున్నాయి. ఎఫ్‌పిఐ ఆంక్షల తొలగింపు హర్షించవలసిందన్నారు.

బ్యాంకులు రేట్లను తగ్గించనున్నాయి : రాకేష్ మిట్టల్

రెపో రేటు 0.25% కోతతో రుణాల రేట్లు తగ్గనున్నాయని, పాలసీ దృక్పథం తటస్థం మంచి పరిణామమని సిఐఐ ప్రెసిడెంట్ రాకేష్ భారతి మిట్టల్ అన్నారు. ద్రవ్యోల్బణం 2.2 శాతానికి అంచనాను తగ్గించిందని అన్నారు.

ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్‌గా డేవిడ్ మాల్పాస్

నామినేట్ చేసిన ట్రంప్

వాషింగ్టన్: ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్‌గా ఆర్థికవేత్త డేవిడ్ మాల్పాస్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నామినేట్ చేశారు. ట్రంప్‌కు విధేయుడైన ఆర్థికవేత్త మాల్పాస్(62)నే ఎంపిక చేశారు. ట్రంప్‌కు సీనియర్ ఆర్థిక సలహాదారుడిగా ఉన్న మాల్పాస్, 2016 ఎన్నికల ప్రచారంలో ఆయనతో కలిసి పనిచేశారు. ప్రపంచ బ్యాంక్ గ్రూప్ డైరెక్టర్లు ఆమోదం తెలిపినట్లయితే మాల్పాస్.. ప్రస్తుత వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్ జిమ్‌యాంగ్ కిమ్ స్థానంలో రానున్నారు. ప్రస్తుతం మాల్పాస్ అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో అంతర్జాతీయ వ్యవహారాలకు కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.



టాటా మోటార్స్‌కు భారీ నష్టాలు


క్యూ3లో సంస్థ నికర నష్టం రూ.26,961 కోట్లు

ముంబై : దేశీయ ఆటోదిగ్గజం టాటా మోటార్స్ డిసెంబర్ ముగింపు నాటి మూడో త్రైమాసిక(క్యూ3) ఫలితాల్లో తీవ్ర నిరాశపర్చింది. సంస్థకు భారీ నష్టాలు వచ్చాయి. క్యూ3లో కంపెనీ నికర నష్టం రూ.26,961 కోట్లుగా నమోదైంది. కష్టాల్లో ఉన్న బ్రిటీష్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్‌లో సమస్యల కారణంగా లాభాలు పడిపోయాయి. కంపెనీకి నష్టాలు వరుసగా మూడోసారి. గతేడాది ఇదే సమయంలో మాత్రం సంస్థకు రూ.1,214 కోట్ల నికర లాభం వచ్చింది. కంపెనీ కన్సాలిడేటెడ్ రెవెన్యూ రూ.77,001 కోట్లుగా, ఎబిటా రూ.6,522 కోట్లుగా ఉంది. అలాగే జాగ్వార్ ల్యాండ్ రోవర్ నికర నష్టం 3.1 బిలియన్ పౌండ్లు అని తెలిపింది. అలాగే చైనా మార్కెట్లో సేల్స్ విపరీతంగా పడిపోవడం వల్లే ఇలా జరిగిందని టాటా మోటార్స్ ఒక ప్రకటనలో తెలిపింది. జెఎల్‌ఆర్ రెవెన్యూ 6.2 బిలియన్ల ఆర్జించింది. ఫైనాన్స్ వ్యయం రూ. 1,568 కోట్లకు పెంచినట్లు కంపెనీ త్రైమాసిక ఫలితాల్లో తెలిపింది. రానున్న సంవత్సరం చాలా సవాళ్లతో కూడినదని, ఆటో పరిశ్రమ స్తబ్దుగా ఉన్నప్పటికీ టాటా మోటార్స్ పటిష్టమైన ఫలితాలను ప్రకటించిందని కంపెనీ ఎండి, సిఇఒ గ్యుంటెర్ బట్షెక్ అన్నారు. మరిన్ని కొత్త బ్రాండ్స్‌తో, ఖర్చులు తగ్గించుకొని రానున్న సంవత్సరం మరింత పురోగతి సాధిస్తామని తెలిపారు.



ఇడి దర్యాప్తుకు హాజరైన కార్తి, వాద్రా

తొమ్మిది గంటల పాటు విచారణ

న్యూఢిల్లీ: రాజకీయంగా పలుకుబడి కలిగి ఉన్నతస్థాయిలో ఉన్న రాబర్ట్ వాద్రా, కార్తి చిదంబరం తమపై ఉన్న కేసుల విచారణకు హాజరు కావడంతో గురువారం ఇన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సందడిగా కనిపించింది. అక్రమ నగదు చెలామణి కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ఇద్దరినీ ఇడి ఆరు గంటల విచారించారు. సెంట్రల్ ఢిల్లీలో ఉన్న ఇడి జామ్‌నగర్ కార్యాలయానికి మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం తనయుడు కార్తి ఉదయం 11 గంటలకు వచ్చారు. ఈ కార్యాలయంలో ప్రత్యేక దర్యాప్తు, నిఘా విభాగాలున్నాయి. ప్రముఖులను ప్రశ్నిస్తున్నందున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కార్తిని ప్రశ్నిస్తున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. అక్రమ నగదు చెలామణి నిరోధక చట్టం కింద (పిఎంఎల్‌ఎ) 2017 మేలో కార్తిపై ఇడి క్రిమినల్ కేసు నమోదు చేసింది. గతంలో మాదిరే కేసు దర్యాప్తు అధికారి కార్తి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేస్తారని ఆ వర్గాలు తెలిపాయి. కార్తినే కాక, మాజీ ఆర్థికమంత్రి చిదంబరం కూడా శుక్రవారం ఇడి విచారణకు హాజరు కావచ్చు. కార్తి వచ్చిన దాదాపు 25 నిముషాల అనంతరం ...కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ బావ రాబర్ట్ వాద్రా కూడా అక్రమ నగదు చెలామణి కేసులో విచారణకు ఈ కార్యాలయానికి వచ్చారు. విదేశీ ఆస్తుల కొనుగోలులో అక్రమ లావాదేవీలకు పాల్పడ్డారని ఆయనపై ఆరోపణలున్నాయి. స్పోర్ట్స్ యుటిలిటీ వాహనంలో తన లాయర్‌తో పాటు వాద్రా ఇడి అడిగే ప్రశ్నలకు సమాధానమిచ్చేందుకు వచ్చారు. వాద్రా బుధవారం కూడా తన భార్య ప్రియాంక గాంధీతో పాటు ఇడి దర్యాప్తుకు హాజరయ్యారు. ఈ కేసులో వాద్రా దర్యాప్తు సంస్థ ముందు హాజరుకావడం ఇదే మొదటిసారి. ఢిల్లీ కోర్టు ఆదేశాల మేరకు వాద్రా ఇడి విచారణకు వచ్చారు.

గడ్కరీ పనితీరును మెచ్చుకున్న సోనియా



న్యూఢిల్లీ: కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని యూపిఎ చైర్‌పర్సన్ సోనియాగాంధీ గురువారంనాడు లోక్‌సభలో ప్రశంసించారు. దేశంలో మౌలిక వసతుల కల్పనలో ఆయన అద్భుతంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ గడ్కరీ మంత్రిత్వశాఖకు సంబంధించిన రెండు ప్రశ్నల్ని చేపట్టింది. దేశంలో నెట్‌వర్క్‌ను విస్తృతపరిచేందుకు అమలు చేస్తున్న, చేపట్టిన పనుల గురించి గడ్కరీ సంపూర్ణమైన వివరణ ఇచ్చారు.'పార్టీలకు అతీతంగా ఎంపీలు అందరూ తమ నియోజకవర్గాల్లో నా మంత్రిత్వశాఖ చేపట్టిన పనుల్ని మెచ్చుకుంటున్నారని నేను ఈ సందర్భంగా చెప్పాలి' అని గడ్కరీ చెప్పారు. బిజెపి సభ్యులు బల్లలు చరుస్తూ ఉండగా గడ్కరీ తన వివరణ పూర్తిచేశారు. ఆ సమయంలో మధ్యప్రదేశ్‌కు చెందిన బిజెపి సభ్యుడు లేచి ...కేంద్ర రవాణామంత్రి చేస్తున్న అద్భుతమైన పనుల్ని సభ అభినందించాలి' అన్నారు. అంతవరకూ గడ్కరీ ఇస్తున్న వివరణను సోనియాగాంధీ ఓపిగ్గా వింటున్నారు. ఆయన సమాధానాలకు అప్పుడప్పుడూ మెచ్చుకోలుగా స్పందిస్తున్నారు. నవ్వుతున్నారు. చివరికి అభినందనపూర్వకంగా బల్లలు చరిచారు. అది చూసి, లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లికార్జున్ ఖర్గేతో సహా కాంగ్రెస్ సభ్యులు గడ్కరీని మెచ్చుకుంటూ బల్లలు చరిచారు. గత ఆగస్టులో నియోజకవర్గం రాయ్‌బరేలీలో రోడ్ల గురించి సోనియాగాంధీ చేసిన ప్రస్తావనకు గడ్కరీ సానుకూలంగా స్పందించారు. అందుకు ఆమె ఆయనను అభినందిస్తూ లేఖ రాశారు.

భారత్‌కు రెండు క్షిపణి రక్షణ వ్యవస్థలు

విక్రయించేందుకు అమెరికా సిద్ధం

వాషింగ్టన్: రెండు ఆధునిక రక్షణ క్షిపణి వ్యవస్థల్ని భారత్‌కు విక్రయించేందుకు అమెరికా అంగీకరించింది. బోయింగ్ 777 పేరున్న ఈ రెండు క్షిపణులు ఒక్కొక్క దాని ధర 190 మిలియన్ డాలర్లు...అంటే 19 కోట్ల రూపాయలు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి ప్రయాణిస్తున్న విమానాలకు ఈ క్షిపణి వ్యవస్థ మరింత భద్రత చేకూరుస్తుంది. ఈ విమానాల అమ్మకం ద్వారా అమెరికా–ఇండియా వ్యూహాత్మక సంబంధాలను మరింత పటిష్టమవుతాయి. ఈ అమ్మకం అమెరికా విదేశాంగ విధానాన్ని బలపరుస్తుంది. ఈ రక్షణ వ్యవస్థల వల్ల ఎయిరిండియా భద్రత, అమెరికా అధ్యక్షుడు వినియోగించే 'ఎయిర్ ఫోర్స్ వన్'తో సమామనమవుతుంది. ఈ రెండు రక్షణ వ్యవస్థల్నీ బోయింగ్ 777లో అమరుస్తారని పెంటగాన్ తెలిపింది. ఈ ప్రత్యేక అవసరం కోసం రెండు బోయింగ్ 777 ఇఆర్‌లను నేషనల్ కేరియర్ ఎయిర్ ఇండియా నుంచి కొనాలని భారత ప్రభుత్వం భావిస్తోంది.

తొలి పర్యటనలో ప్రియాంక వెంట రాహుల్

లక్నో : ఎఐసిసి ప్రధాన కార్యదర్శి హోదాలో ప్రియాంక గాంధీ తొలి పర్యటన చేపట్టనున్నారు. ఇందుకు సోదరుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ సాయం తీసుకుంటున్నారు. ఆమె వెంట రాహుల్ గాంధీ కూడా వెళ్లనున్నారు. ఫిబ్రవరి 11 నుంచి 14 వరకూ ఉత్తరప్రదేశ్‌లో ఆమె పర్యటన ఉండనుందని పార్టీ వర్గాల సమాచారం. లక్నోలో తొలుత రోడ్‌షో నిర్వహించి, అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆమె భేటీ అవుతారని చెబుతున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అత్యధిక స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో పార్టీ ఆమెకు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే.

హిందూ ధర్మ ప్రచార పరిషత్ వెబ్‌సైట్ ప్రారంభం

మన తెలంగాణ/తిరుమల ప్రతినిధి: సనాతన ధర్మాన్ని విస్తృత ప్రచారం చేసేందుకు టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ వెబ్సైట్ను ప్రారంభించినట్లు టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఉద్ఘాటించారు. హెచ్‌డిపిపి అధ్వర్యంలో నూతనంగా రూపొందించిన www.hdpp.tirumala.org వెబ్‌సైట్‌ను తిరుమల జెఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు, తిరుపతి జెఈవో పోల భాస్కర్తో కలిసి టిటిడి ఈవో గురువారం ఉదయం టిటిడి పరిపాలన భవనంలోని తమ కార్యాలయంలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ టిటిడి ధర్మ ప్రచారం కోసం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని భక్తులు తెలుసుకునేందుకు డిపిపి వెబ్‌సైట్ ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో ధర్మ ప్రచారకులు, భజన మండలి సభ్యులు, యువత, మహిళలు, ఔత్సాహికులు తమ సభ్యత్వాన్ని సులభంగా నమోదు చేసుకునేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో డిపిపి కార్యక్రమాల వార్షిక క్యాలెండర్లు, కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశం, వాటి విశిష్టత, ఆయా ప్రాంతాల్లోని ధర్మ ప్రచార మండళ్ల వివరాలు పొందుపర్చామన్నారు. అదే విధంగా పండుగలు వాటి విశిష్టత, టిటిడి పంచాంగం, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు, అనుబంధ ఆలయాలలో నిర్వహించే ఉత్సవాల వివరాలు, ఫోటోలు పొందుపర్చాలన్నారు. ధార్మిక, స్పూర్తిదాయక గ్రంథాలు, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలను ఈబుక్స్ను భక్తులు సులభంగా ఆన్లైన్లో చదువుకునేలా, డౌన్లోడ్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. అన్నమాచార్య సంకీర్తనలు, ఇతర వాగ్గేయకారుల భక్తి సంకీర్తనలు అందుబాటు ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులందరికి ధర్మప్రచార కార్యక్రమాలు చేరేందుకు ఈ వెబ్సైట్ ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్వో గోపినాథ్ జెట్టి, న్యాయాధికారి వెంకట రమణ నాయుడు, సిఈ చంద్రశేఖరరెడ్డి, ఎఫ్ఎ అండ్ సిఎవో బాలాజి, డిపిపి కార్యదర్శి రమణ ప్రసాద్, డిఈవో రామచంద్ర, ఎస్టేట్ అధికారి విజయ సారధి, ఐటి విభాగాధిపతి శేషారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తలనీలాలపై టిటిడి ఆదాయం 11.17 కోట్లు

మన తెలంగాణ/తిరుమల ప్రతినిధి: కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన తలనీలాల ఈవేలంలో టిటిడి రూ. 11.17 కోట్ల ఆదాయాన్ని గడించింది. ప్రతినెలా మొదటి గురువారం నాడు తలనీలాల ఈవేలం జరుగుతున్న విషయం విదితమే. ఇందులోభాగంగా టిటిడి తిరుమల జెఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో తలనీలాల ఈ వేలం జరిగింది. మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, తెల్లవెంట్రుకలు తలనీలాల రకాల ఈవేలం నిర్వహించారు.

ఫేక్ వర్సిటీల మాయలో పడొద్దు

- అమెరికా మోజులో తొందరపడి అడ్మిషన్లు తీసుకుంటే కష్టాలు తప్పవు
- అన్నీ పరిశీలించాకనే ప్రవేశాలు పొందాలి
- అమెరికాకు వెళ్లాలనుకునే విద్యార్థులను కలవరపెడుతున్న ఫార్మింగ్‌టన్ వర్సిటీ వివాదం



మన తెలంగాణ/హైదరాబాద్ : విద్యార్థుల బలహీనతలతో దేశంలోని విద్యాసంస్థలతోపాటు అగ్రరాజ్యం యూనివర్సిటీలు కూడా ఆటలాడుకుంటున్నాయి. మన దేశంలో ఫేక్ యూనివర్సిటీలలో డిగ్రీ, పిజి కోర్సులు చదువుకుని మోసపోయిన విద్యార్థుల గురించి తరచూ చూస్తుంటాం. ఇప్పుడు ఏకంగా అమెరికాలోనే ఫేక్ యూనివర్సిటీలో ప్రవేశాలు పొంది మోసపోయిన విద్యార్థుల కష్టాలు చూస్తున్నాం. ఫార్మింగ్‌టన్ యూనివర్సిటీ వివాదం అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థులకు ఒక హెచ్చరికలాంటిది. ఈ వివాదం ఇండియాలోనే కాదు అమెరికాలో కూడా ఫేక్ యూనివర్సిటీ ఉన్నాయి... జాగ్రత్తగా లేకపోతే మోసపోక తప్పదని విద్యార్థులు, తల్లిదండ్రులకు ఒక హెచ్చరికలా నిలిచింది. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో అమెరికాలో ఉన్నత చదువులు చదువుకోవాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఫార్మింగ్‌టన్ యూనివర్సిటీ వివాదం కలవరపెడుతోంది. ఏటా మనదేశం నుంచి సుమారు 70 వేల మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళుతుంటే అందులో తెలుగు విద్యార్థులే 60 శాతం వరకు ఉంటున్నారని నిపుణులు చెబుతున్నారు. విద్యార్థి వీసా కార్యక్రమాన్ని దుర్వినియోగం చేస్తున్నవారిని పట్టుకోవాలని భావించిన అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఓ నకిలీ యూనివర్సిటీని సృష్టించారు. అందులో భాగంగా 8 మంది దళారులను, వారి ద్వారా చేరిన 130 విద్యార్థులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

మోసపోయి గగ్గోలు పెడుతున్న తెలుగు విద్యార్థులు

ఫార్మింగ్‌టన్ యూనివర్సిటగీ వెబ్‌సైట చూస్తే ఎంతో నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యను అందిస్తామని వెబ్‌సైట్‌లో పేర్కొన్నారుర. వర్సిటీ అధికారిక యూనవర్సిటీ వెబ్‌సైట్‌లోని హంగులు చూసే మోసపోయామని మన విద్యార్థులు మొత్తుకుంటున్నారు. అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ఫోర్స్‌మెంట్(ఐసిఇ)కి చెందిన అండర్ కవర్ ఏజెంట్లు సృష్టించిన ఈ ఫేక్ యూనివర్సిటీలో అడ్మిషన్ తీసుకుని వారి ట్రాప్‌లో చిక్కుకున్న మన విద్యార్థులు ఇప్పుడు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఫార్మింగ్‌టన్ వర్సిటీ మాత్రం జాతీయ గుర్తింపు ఉందని, ఆన్‌లైన్ తరగతులు కూడా అందుబాటులో ఉన్నాయని ప్రకటించుకోవడం గమనార్హం. ఇందులో అడ్మిషన్ పొందిన విద్యార్థులది ఒక్కొక్కరిది ఒక్కో గాథ. ఇప్పుడు ఏం చేయాలో అంతుపట్టక కొట్టుమిట్టులాడుతున్నారు. యూనివర్సిటీ గురించి తెలియక రూ.లక్షల్లో ఫీజులు చెల్లించి ప్రవేశం పొందిన విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. ఫార్మింగ్‌టన్ యూనివర్సిటీలో ప్రవేశాలు తీసుకున్న సమయంలో తరగతులు జరుగవన్న సంగతి తెలియదని, ఆ తర్వాత కాలంలో తరగతులు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించినా ఎవరి నుంచి సమాధానం రాలేదని కొంతమంది విద్యార్థులు పేర్కొన్నారు. ఫార్మింగ్‌టన్ వర్సిటీ నకిలీదని భారత విద్యార్థులకు తెలియదని ఇమ్మిగ్రేషన్ అధికారులు ఇప్పటికే అమెరికా ప్రభుత్వానికి వివరించారు. ఈ వివాదంలో చిక్కుకున్న విద్యార్థులు తిరిగొచ్చిన తర్వాత మళ్లీ వీసా లభించడం అసాధ్యమని నిపుణులు అంటున్నారు. ఈ సంఘటన వల్ల భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నీ పరిశీలించిన తర్వాతనే ప్రవేశాలు తీసుకోవాలి: శ్రీకర్ ఆలపాటి, గ్లోబల్ ట్రీ కన్సల్టెన్సీ

అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు అక్కడి వర్సిటీల గురించి అన్ని అంశాలు పరిశీలించిన తర్వాతనే అడ్మిషన్ తీసుకోవాలని గ్లోబల్ ట్రీ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకర్ ఆలపాటి సూచించారు. మనదేశంలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ఎం.ఎస్ చేయడం కోసం ఎక్కువగా అమెరికా వెళ్తున్నారని, పేరున్న వర్సిటీలో ఎం.ఎస్ చేస్తే వారి భవిష్యత్తు ఎంతో బాగుంటుందని తెలిపారు. ఎం.ఎస్ తర్వాత 5 శాతం మంచి విద్యార్థులు కూడా రీసెర్చ్ వైపు వెళ్లడం లేదని అన్నారు. ఎం.ఎస్ అనేది విద్యార్థికి తన జీవితంలోనే చివరి అవకాశమని, అందుకే ఈ అవకాశాన్ని జాగ్రత్తగా వినియోగించుకోవాలని తెలిపారు. అమెరికాలో ఉన్నత చదువులు చదువుకోవాలనుకునే విద్యార్థులు అక్కడి యూనివర్సిటీ ర్యాంకింగ్, ఆ వర్సిటీల చరిత్ర, ప్లేస్‌మెంట్ రికార్డు తదితర అంశాలను పరిశీలించుకోవడంతో పాటు అనుభవజ్ఞులైన నిపుణుల సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాతనే ప్రవేశాలు తీసుకోవాలని సూచించారు.

నకిలీ వర్సిటీ విద్యార్థుల దర్యాప్తు తీరుపై ఆరా

హోంలాండ్ సెక్యూరిటీ విభాగానికి కాంగ్రెస్ సభ్యుల లేఖ

వాషింగ్టన్ : అమెరికాలోని నకిలీ విశ్వవిద్యాలయానికి సంబంధించిన స్టింగ్ ఆపరేషన్ పూర్తి వివరాల వెల్లడించాలని ఆ దేశ చట్ట సభ్యులు డిమాండ్ చేశారు. భారతీయ అమెరికన్ రాజా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రిపబ్లిక్, డెమోక్రట్ల బృందం ఈ మేరకు హోంలాండ్ సెక్యూరిటీ విభా గం, అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) విభాగాలకు లేఖ రాసింది. నిర్బంధంలో ఉన్న విద్యార్థుల విచారణ తీరు ను కూడా సభ్యులు కోరారు. న్యాయపరంగా దక్కాల్సి అన్ని హక్కులు వారికి కల్పిస్తున్నారా లేదా అన్నదానిపై వివరాలు కోరారు. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాల్సిందిగా లేఖలో పేర్కొన్నారు. నకిలీ విశ్వవిద్యాలయం పేరుతో 130 మంది విదేశీ విద్యార్థుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి అక్రమ వీసాలు ఇప్పించారన్న ఆరోపణలపై అమెరికన్ హోంలాండ్ సెక్యూరిటీ విభాగం 8 మంది భారతీయ విద్యార్థులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

మిమ్మల్ని దేవుడే కాపాడాలి

- భవిష్యత్‌లో మా ఆదేశాలతో ఆడుకోకండి
- విచారణాధికారి బదిలీ కోర్టు ధిక్కరణే
- ముజఫర్‌పూర్ షెల్టర్ హోం దారుణాలపై సుప్రీం అక్షింతలు




న్యూఢిల్లీ : కొద్ది రోజుల క్రితం వరకు సిబిఐ తాత్కాలిక చీఫ్‌గా పనిచేసిన ఎం.నాగేశ్వరరావుకు సుప్రీంకోర్టు చురకలంటించింది. కోర్టు అనుమతి లేకుండా ముజఫర్‌పూర్ షెల్టర్ హోంలో బాలికలపై లైంగిక దాడి కేసును విచారిస్తున్న సీబీఐ అధికారి ఎకె శర్మను బదిలీ చేస్తూ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని సుప్రీం కోర్టు ప్రాథమికంగా నిర్ధారించింది. గురువారం సుప్రీం సమన్లు జారీ చేస్తూ 12న న్యాయస్థానం ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. తన ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు సిబిఐ ప్రాసిక్యూషన్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ ఎస్ వాసూరాంను కూడా కోర్టు ఎదుట హాజరు కావాలని సుప్రీం బెంచ్ స్పష్టం చేసింది. ఎకె శర్మ బదిలీ ప్రక్రియలో భాగస్వాములైన అధికారుల పేర్లను ఇవ్వాలని కోర్టు సిబిఐని ఆదేశించింది. ఈ సందర్భంగా సిజెఐ రంజన్ గొగోయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'దీన్ని మేము చాలా తీవ్రంగా పరిగణిస్తున్నాం. మీరు సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా ఆదేశాలతో ఆడుకున్నారు. దేవుడే మిమ్మల్ని కాపాడాలి. భవిష్యత్‌లో ఎప్పుడూ మా ఆదేశాలతో ఆడుకోకండి' అని ఘాటైన వ్యాఖ్యలు చేసింది. కాగా ముజఫర్‌పూర్ షెల్టర్ హోమ్ కేసు విచారణను సుప్రీంకోర్టు ఢిల్లీ సాకేత్ పోక్సో కోర్టుకు బదిలీ చేసింది. విచారణను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించింది. ముజఫర్‌పూర్‌లో ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న షెల్టర్ హోంలో పలువురు బాలికలపై హోం నిర్వాహకులు లైంగిక దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు దేశవ్యాప్తంగా దుమారానికి కారణమయ్యాయి. దీన్ని అన్ని వర్గాలు తీవ్రంగా ఖండించాయి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళనలు కూడా జరిగాయి.

31 జిల్లాలకు డిసిసి అధ్యక్షులు వీరే..

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణలోని 31 జిల్లాలతో పాటు రెండు నగర కాంగ్రెస్ కమిటీలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆమోదముద్ర వేశారు. రాష్ట్ర స్థాయిలో ఇటీవలనే పలు కమిటీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాహుల్ గురువారం జిల్లా అధ్యక్షుల జాబితాకు ఆమోదం తెలపడంతో పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ విడుదల చేశారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో రాహుల్‌గాంధీ సంస్థాగత కమిటీలతో పార్టీ పటిష్టతపై దృష్టి పెట్టారు. అన్ని జిల్లాల్లోని వివిధ సామాజిక వర్గాలను దృష్టిలో పెట్టుకుని అధ్యక్షులను ఎంపికచేశారు. కమిటీలో బిసిలు, రెడ్డి సామాజిక వర్గాలకు అధిక ప్రాధాన్యత కల్పించారు. ఎంపిక చేసిన జిల్లా అధ్యక్షులలో ఇద్దరు బ్రాహ్మణ, ఒక వెలమ, ఇద్దరు ఎస్‌టిలు, ఇద్దరు ఎస్‌సిలు, పన్నెండు మంది బిసిలు, ఇద్దరు కమ్మ, పది మంది రెడ్డి, ఇద్దరు ముస్లింలకు అవకాశం కల్పించారు.

జిల్లాల వారీగా అధ్యక్షుల వివరాలు

1. ఆదిలాబాద్	భార్గవ్ దేశ్‌పాండే
2. మంచిర్యాల	కొక్కిరాల సురేఖ
3. నిర్మల్	రామారావు పటేల్ పవార్
4. అసిఫాబాద్	ఆత్రం సక్కు
5. కరీంనగర్	మృత్యుంజయం
6. జగిత్యాల	ఎ.లక్ష్మ ణ్‌కుమార్
7. పెద్దపల్లి	ఎర్ల కొమరయ్య
8. సిరిసిల్ల	ఎన్. సత్యనారాయణగౌడ్
9. నిజామాబాద్	మన్నాల మోహన్‌రెడ్డి
10. నిజామాబాద్ సిటీ	కేశ వేణు
11. కామారెడ్డి	కైలాష్ శ్రీనివాస్‌రావు
12. వరంగల్ (అర్బన్, రూరల్)	నాయిని రాజేందర్‌రెడ్డి
13. వరంగల్ సిటీ కాంగ్రెస్	కేదారి శ్రీనివాస్‌రావు
14. భూపాల్‌పల్లి	గండ్ర జ్యోతి
15. జనగాం	జంగా రాఘవరెడ్డి
16. సంగారెడ్డి	నిర్మలాగౌడ్
17. మెదక్	తిరుపతిరెడ్డి
18. సిద్దిపేట	నర్సారెడ్డి
19. వికారాబాద్	పి.రోహిత్‌రెడ్డి
20. మేడ్చల్	కూన శ్రీశైలంగౌడ్
21. రంగారెడ్డి	చల్లా నర్సింహ్మారెడ్డి
22. మహబూబ్‌నగర్	ఓబేదుల్లా కొత్వాల్
23. వనపర్తి	శంకర్ ప్రసాద్
24. గద్వాల	పటేల్ ప్రభాకర్‌రెడ్డి
25. నాగర్‌కర్నూల్	సిహెచ్. వంశీకృష్ణ
26. సూర్యాపేట్	వెంకన్నయాదవ్
27. యాదాద్రి	బి. భిక్షమయ్యగౌడ్
28. మహబూబాబాద్	భరత్ చంద్రారెడ్డి
29. నల్గొండ	కె. శంకర్‌నాయక్
30. కొత్తగూడెం	వనమా వెంకటేశ్వర్‌రావు
31. ఖమ్మం	పువ్వాడ దుర్గాప్రసాద్

నగర కాంగ్రెస్ అధ్యక్షులు

ఖమ్మం సిటీకు జావెద్‌ను,గ్రేటర్ హైదరాబాద్‌కు అంజన్‌కుమార్‌యాదవ్‌ను, ఖమ్మం సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్. దీపక్ చౌదరిలను నియమించారు.

ఢిల్లీలో వడగళ్ల వాన




న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో – ఎన్‌సిఆర్‌లో పలు ప్రాంతాల్లో గురువారం సాయంకాలం ఓ మోస్తరు వర్షం కురిసింది. బలమైన గాలులతో ఉరుములతో కూడిన జల్లులు పడ్డాయి. నోయి డా, ఫరీదాబాద్, గుర్‌గావ్‌లలో వడగళ్ల వాన కురిసినట్టు సమాచారం అందింది. గాలుల కదలికలో వచ్చిన ఆకస్మిక మార్పు ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలపై ప్రభావం చూపింది. పశ్చిమ దిశలో నెలకొన్న విపరీత వాతావరణ పరిస్థితుల ప్రభావం ఢిల్లీ – ఎన్‌సిఆర్ ప్రాం తంపై పడింది. ఢిల్లీ నైరుతి దిశలో ఏర్పడిన ఈ వాతావరణ పరిస్థితి ఉత్తర ప్రదేశ్ పశ్చిమ ప్రాంతం వైపు సాగుతుందని స్కైనెట్ వెదర్ ఏజెన్సీ తెలిపింది. 'సాయంకాలం ఆరు నుంచి ఏడు గంటల మధ్యలో తొమ్మిది విమానాలను జైపూర్ ఎయిర్ పోర్ట్‌కు మళ్లించాం. అదే సమయంలో మూడు విమానాల్ని లక్నో, అమృతసర్ ఎయిర్‌పోర్టులకు మళ్లించాం. అలాగే రెండు విమానాల్ని వారణాసికి, ఒకటి ఇండోర్ కు ఇదే సమయంలో రూట్ మార్చి తరలించడం జరిగింది' అని ఎయిర్‌పోర్ట్ అధికారి ఒకరు చెప్పారు.

ఇక విద్యుత్ వాహనాల పరుగు

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆర్‌టిసి
- మియాపూర్ 2, కంటోన్మెంట్ డిపోల్లో ఛార్జింగ్ పాయింట్లు
- ఎయిర్‌పోర్టుకే పరిమితం కానున్న బస్సులు
- రెండు మార్గాల ద్వారా రాకపోకలు... రూట్ మ్యాప్ సిద్ధం



మన తెలంగాణ / హైదరాబాద్ : నగర రహదారులపైకి నాలుగైదు రోజుల్లో ఆర్‌టిసి ఆధ్వర్యంలో విద్యుత్‌తో నడిచే సిటీ బస్సులు రానున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాంకేతికంగా ఎలాంటి సమస్యలూ లేవని ఆర్‌టిసి యాజమాన్యం స్పష్టంచేసింది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించగానే రోడ్లపై బస్సులు నడుస్తాయి. మొదటి విడతలో ప్రయోగాత్మకంగా 40 బస్సులను ఎయిర్‌పోర్టు రూట్‌కే పరిమితం చేయనుంది. ఇందుకోసం రూట్ మ్యాప్ సిద్ధమయింది. విద్యుత్ బస్సులు ప్రారంభమైన తర్వాత ప్రస్తుతం ఈ మార్గంలో కొనసాగుతున్న ఎసి బస్సులను నగరంలోని ఇతర ప్రాంతాల్లో తిప్పేందుకు యంత్రాంగం ప్రణాళికలను సిద్ధం చేసింది.

భారీగా తగ్గనున్న నిర్వహణ వ్యయం....

విద్యుత్ బస్సులకు ఇంజన్, గేర్‌బాక్స్, క్లచ్ లాంటి 30 రకాల విడి భాగాలు ఉండవని, దీంతో నిర్వహణ ఖర్చు దాదాపుగా ఉండదని సంస్థ అధికారులు తెలిపారు. ప్రతీ కిలో మీటర్‌కు ఒక కిలోవాట్ విద్యుత్ అవసరమవుతుందని, ఆరు రూపాయలు ఖర్చవుతుందని, ఒక్కో బస్సు రోజుకు వంద కి.మీ. వరకు తిరిగితే రూ. 600 మేర విద్యుత్ ఖర్చవుతుందన్నారు. ఐదు గంటల ఛార్జింగ్ పెడితే దాదాపు 300 కి.మీ మేర తిరుగుతుందన్నారు. డీజిల్ బస్సులతో ఒక్కో లీటర్‌కు రూ.70 వంతున ప్రతీ ఐదు కి.మీ.కు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని, సగటున ఒక కి.మీ.కు ఎనిమిది రూపాయలు ఖర్చవుతుందని తెలిపారు. ఇక ఇంజన్, గేర్‌బాక్స్, క్లచ్‌తో పాటు ఇతర విడి విభాగాల నిర్వహణ కూడా భారీగానే ఉంటుందని వివరించారు. నిర్వహణ ఖర్చు బాగా తగ్గుతుందని, సంస్థకు ఆదా అవుతుందన్నారు. ప్రస్తుతం రెండు మార్గాల్లో నడిచే విద్యుత్ బస్సుల కోసం ఆర్‌టిసి రెండు ఛార్జింగ్ పాయింట్లను నెలకొల్పింది. మియాపూర్ 2, కంటోన్మెంట్ డిపోలలో ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఛార్జింగ్ కోసం డిపోల్లో ప్రత్యేకంగా 11 కెవి సామర్థ్యంతో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఒక్కో కి.మీ.కు రూ.36

విద్యుత్ బస్సుల నిర్వహణ కోసం ఆర్‌టిసి యాజమాన్యం బివైడి ఒలెక్ట్రా గ్రీన్ టెక్ అనే సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఇందుకోసం ఒక్కో కి.మీ. కు రూ. 36 చొప్పున గ్రీన్‌టెక్ సంస్థకు ఆర్‌టిసి చెల్లిస్తుంది. పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన డ్రైవర్లు గ్రీన్‌టెక్ సంస్థకు సంబంధించిన వారే. 12 ఏళ్ల పాటు ఈ ఒప్పందం అమలులో ఉంటుంది. ప్రస్తుతం కొనసాగుతున్న అద్దె విధానం తరహాలోనే విద్యుత్ బస్సుల విధానం కూడా ఉంటుంది. టికెట్ రూపంలో వచ్చే ఆదాయం ఆర్‌టిసికి చెందుతుంది.

మన తెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 8, ఫిబ్రవరి 2019
www.manatelangana.news

గెలిచి నిలిచేనా ?

టీమిండియాకు అగ్నిపరీక్ష
నేటి రెండో టి–20లో భారీ మార్పులకు అవకాశం





ఆక్లాండ్: న్యూలాండ్‌తో తొలి టి–20లో ఘోర పరాజయాన్ని చవి చూసిన టీమిండియా ఇప్పుడు రెండో టి–20 పోరుకు సిద్ధమవుతోంది. న్యూజిలాండ్ గడ్డపై తొలి టి–20 సిరీస్ గెలిచి తీరాలన్న లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఆశించిన శుభారంభం లభించలేదు. తొలి మ్యాచ్‌లో 80 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయం పాలయింది. ఇది మూడు మ్యాచ్‌ల సిరీస్ కావడంతో టీమిండియా బరిలో నిలవాలంటే కచ్చితంగా రెండో మ్యాచ్ గెలిచి తీరాలి. శుక్రవారం భారత కాలమానం ప్రకారం ఉదయం 11.30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో గెలుపుపై రెండు జట్లూ దృష్టి సారించాయి. ఒకవైపు సిరీస్‌ను దక్కించుకోవాలన్న కసితో కివీస్ ఉంటే మరో వైపు ఈ మ్యాచ్‌ని ఎట్టి పరిస్థితుల్లోను కోల్పోకూడదన్న పట్టుదలతో టీమిండియా ఉంది. తొలి టి–20లో ఎనిమిది మంది బ్యాట్స్‌మెన్‌తో భారత్ పోరుకు సిద్ధమయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మితిమీరిన ఆత్మ విశ్వాసమో లేక కివీస్ సాధించిన భారీ స్కోరును చూసి భయపడ్డారో తెలియదు కానీ అందరూ చేతులెత్తేశారు. దీనిపై కెప్టెన్ రోహిత్ శర్మ సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తుది 11 మందిలో ఎనిమిది మంది బ్యాట్స్‌మెన్ ఉన్నప్పుడు ఎంతటి టార్గెట్‌నైనా సునాయాసంగా సాధించి ఉండవచ్చనే అభిప్రాయాన్ని సైతం వ్యక్తం చేశాడు. దీంతో రెండో టి–20 మ్యాచ్‌లో భారీ మార్పులు తప్పవని భావిస్తున్నారు. ముఖ్యంగా ఖలీల్ అహ్మద్, కృణాల్ పాండ్యాలను తప్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరి స్థానంలో చైనామ్యాన్ కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, సిద్ధార్థ్ కౌల్‌లలో ఇద్దరికి అవకాశం లభించవచ్చు. కివీస్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ ఈ సిరీస్‌కు దూరం కావడంతో చివరి జట్టులో స్థానం పొందిన టిమ్ సీఫెర్ట్ తొలి మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి పోయి తనకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. 43 బంతుల్లో ఏడు ఫోర్లు, ఆరు సిక్సర్లతో 84 పరుగులు చేసి కివీస్ భారీ స్కోరుకు బాటలు వేశాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం మ్యాచ్‌లో అతడ్ని తొందరగా పెవిలియన్‌కు పంపించకపోతే భారత్‌కు మరోసారి కష్టాలు తప్పవు. అయితే ఈ సిరీస్‌లో మ్యాచ్‌కు, మ్యాచ్‌కు మధ్య తక్కువ అంతరం ఉండడంతో కివీస్ బ్యాటింగ్ ఆర్డర్‌పై టీమిండియా ఎంతవరకు కసరత్తు చేసిందనేది ప్రశ్న. తొలి మ్యాచ్‌లో ఎప్పుడూ పొదుపుగా బౌల్ చేసే భువనేశ్వర ప్రసాద్‌తో పాటుగా బౌలర్లు అందరూ దారుణంగా పరుగులు సమర్పించుకున్నారు. ఒక వైపు భారత్ తీవ్రమైన ఒత్తిడితో బరిలోకి దిగుతుండగా, మరోవైపు కివీస్ ఫుల్ జోష్‌తో ఉంది. మరి ఈ మ్యాచ్‌లో గెలిచి భారత్ బరిలో ఉంటుందా లేక ఓడి సిరీస్‌ను కోల్పోయి అభిమానులను నిరాశపరుస్తుందా అనేది వేచి చూడాలి.

తుది జట్లు(అంచనా):

భారత్: రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్‌ధావన్, రిషబ్ పంత్, దినేశ్ కార్తిక్, ఎంఎస్ ధోనీ, హార్దిక్ పాండ్య, విజయ్ శంకర్, భువనేశ్వర్ కుమార్, చాహల్,కుల్దీప్ యాదవ్, సిద్ధార్థ్ కౌల్.

న్యూజిలాండ్: కేన్ విలియమ్సన్(కెప్టెన్), టిమ్ సీఫెర్ట్, కోలిన్ మున్రో, డార్లీ మిచెల్, రాస్ టేలర్ , గ్రాండ్‌హోమ్, సాంట్నర్, స్కాట్ కుగ్లేన్, టిమ్ సోథీ, ఇష్ సోధీ, ఫెర్గూసన్.





టి 20 సిరీస్ కోల్పోయినా బాధ లేదు -గవాస్కర్

ముంబయి: టీమిండియా న్యూజిలాండ్‌తో జరుగుతున్న టి 20 సిరీస్‌ను కోల్పోయినా తాను నిరాశ చెందనని టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అంటున్నాడు. ఇటు బౌలర్లు, అటు బ్యాట్స్‌మెన్ చేతులెత్తేయడంతో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టి 20 మ్యాచ్‌లో భారత్ 80 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలయిన విషయం తెలిసిందే.ఆ మ్యాచ్ ఫలితం అనంతరం గవాస్కర్ మీడియాతో మాట్లాడాడు.' టీమిండియాకు గెలుపు, ఓటమి అనుభవాలు రెండూ అవసరం, ఎందుకంటే ప్రపంచకప్ సమరం ముందుంది. ఈ టోర్నీలో భారత్ గెలవాలంటే వాళ్లకు కొన్ని కఠిన సవాళ్లు ఎదురవ్వాలి. అప్పుడే వాళ్లు వాటినుంచి పాఠాలు నేర్చుకుంటారు. ఈ టి 20లో న్యూజిలాండ్ ఎలాంటిదో భారత జట్టుకు ఇప్పటికే అర్థమయి ఉంటుంది. అందువల్ల ప్రపంచకప్‌లో వారు ఈ జట్టుతో కొంత జాగ్రత్తగా వ్యవహరిస్తారు. న్యూజిలాండ్‌లో టీమిండియా ఈ సిరీస్‌ను కూడా గెలుచుకోవలసిన అవసరం ఉంది. అయితే సిరీస్ కోల్పోయినా నేను నిరాశ చెందను. ప్రపంచకప్ సమరానికి భారత్ సన్నద్ధమవుతోందని భావిస్తాను. రిషభ్ పంత్, కృణాల్ పాండే. విజయ్ శంకర్‌లాంటి యువ ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలి' అని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు.



థాయిలాండ్‌లో చానుకు స్వర్ణం

గాయం తర్వాత తొలి టోర్నీలోనే మెరిసిన భారత స్టార్

న్యూఢిల్లీ: ప్రపంచ చాంపియన్, భారత మహిళా వెయిట్ లిఫ్టర్ సైఖోమ్ మీరాబాయి చాను థాయిలాండ్‌లో జరిగిన ఎగట్ కప్ టోర్నమెంట్‌లో బంగారు పతకాన్ని సాధించింది. గాయం కారణంగా గత ఏడాదిలో దాదాపు తొమ్మిది నెలల పాటు పోటీలకు దూరంగా ఉండిన చాను గురువారం 49 కిలోల విభాగంలో మొత్త 0192 కిలోల బరువు ఎత్తి స్వర్ణ పతకం దక్కించుకుంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌కు సిల్వర్ లెవల్ క్వాలిఫైయింగ్ పోటీ అయిన ఈ పోటీల్లో విజయం సాధించడంతో లభించిన పాయింట్లు చానుకు ఒలింపిక్స్‌కు ఎంపిక కావడానికి ఎంతగానో దోహదపడతాయి. చాను శ్నాచ్‌లో 82 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ లో110 కిలోలు ఎత్తింది. అయితే 2017 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో బంగారు పతకం సాధించినప్పుడు ఆమె మొత్తం 196 కిలోల బరువు ఎత్తింది. అయితే గాయం తర్వాత తాను పాల్గొంటున్న తొలి అంతర్జాతీయ పోటీ ఇదని, తన ప్రదర్శన తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని చాను థాయిలాండ్‌లోని చియాంగ్ మై సిటీనుంచి పిటిఐతో మాట్లాడుతూ చెప్పింది. జపాన్‌కు చెందిన మియాకె హిరోమీ(183 కిలోలు), రజత పతకాన్ని దక్కించుకోగా, పపువా న్యూగినియాకు చెందిన లోవా డికా తౌవా(179 కిలోలు) కాంస్య పతకాన్ని దక్కించుకుంది. గాయం కారణంగా చాను గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనలేక పోయింది. కాగా చైనాలో జరిగే ఏసియన్ చాంపియన్‌షిప్స్ తన తదుపరి టార్గెట్ అని, ఆతర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్స్ రెండూ తనకు ఎంతో కీలకమైనవని చాను చెప్పింది.



రంజీ విజేత విదర్భ

వరసగా రెండో సారి టైటిల్ దక్కించుకున్న జట్టు

నాగపూర్: డిఫెండింగ్ చాంపియన్ విదర్భ వరసగా రెండో సారి రంజీ ట్రోఫీని సొంతం చేసుకుంది. నాగపూర్‌లో జరిగిన ఫైనల్లో ఆ జట్టు సౌరాష్ట్రను గురువారం చివరి రోజు 78 పరుగుల తేడాతో ఓడించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. విజయానికి 206 పరుగులు చేయాల్సిన సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో 127 పరుగులకే ఆలవుట్ అయింది. ఎడం చేతి వాటం స్పిన్నర్ ఆదిత్య సర్వాతే విదర్భ విజయంలో స్టార్‌గా నిలిచాడు. రెండో ఇన్నింగ్స్‌లో24 ఓవర్లు బౌల్ చేసిన అతను ఆరు వికెట్లు పడగొట్టి జట్టు విజయంతో కీలక పాత్ర పోషించాడు. సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో సైతం అతను 5 వికెట్లు పడగొట్టాడు. గత నెల ఆస్ట్రేలియా గడ్డపై తొలి సారి టీమిండియా టెస్ట్ సిరీస్‌లో గెలుచుకోవడంలో అద్భుత పాత్ర పోషించిన పుజారా ఈ సారి సౌరాష్ట్రను గెలిపించడంలో విఫలమైనాడు. సెమీ ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీతో రాణించిన పుజారా ఫైనల్లోమాత్రం రెండు ఇన్నింగ్స్ లోను తక్కువ స్కోరుకే అవుటయ్యాడు.

సంక్షిప్త స్కోర్లు:

విదర్భ తొలి ఇన్నింగ్స్ 312, రెండో ఇన్నింగ్స్ 200, సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ 307, రెండో ఇన్నింగ్స్‌లో 127 ఆలౌట్(ఆదిత్య సర్వాతే 6/59).

కుంబ్లే స్పిన్ మాయాజాలానికి 20 ఏళ్లు!



న్యూఢిల్లీ: భారత క్రికెట్‌కు వన్నె తెచ్చిన క్రికెటర్లలో అనిల్ కుంబ్లే ఒకడు. ముఖ్యంగా తన లెగ్ బ్రేక్‌తో ప్రత్యర్థుల గుండెల్లో పరుగులు పెట్టించిన కుంబ్లే.. భారత జట్టుకు ఎనలేని సేవలందించాడు. సరిగ్గా ఇరవై ఏళ్ల క్రితం ఇదే రోజు (ఫిబ్రవరి 7వ తేదీ) కుంబ్లేకు చిరస్మరణీయంగా మిగిలిపోయింది. తన సంచలన బౌలింగ్‌ప్రదర్శనతో ఒక ఇన్నింగ్స్‌లోమొత్తం పది వికెట్లను తన ఖాతాలో వేసుకున్న రోజు. అదికూడా దాయాది పాకిస్తాన్‌పై కావడం కుంబ్లేకు వెరీ వెరీ స్పెషల్‌గా చెప్పవచ్చు. రెండు దశాబ్దాల నాటి ఆ మ్యాచ్‌ని మరోసారి గుర్తు చేసుకుందాం. 1999 జనవరి నెలలో భారత పర్యటనకు వచ్చిన పాకిస్తాన్ రెండు టెస్టు మ్యాచ్‌లలో తలపడింది. ఫిబ్రవరి 4న ఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో ప్రారంభమైన టెస్టులో భారత్ గెలిస్తేనే సిరీస్‌ను నిలబెట్టుకుంటుంది. ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 252 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం అనిల్ కుంబ్లే (4వికెట్లు), హర్భజన్ (3 వికెట్లు) దెబ్బకు పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాట్స్‌మెన్ రాణించడంతో 339 పరుగులు చేసిన భారత్.. పాక్ ముందు 420 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. రెండో ఇన్నింగ్స్‌లో పాక్‌కు ఓపెనర్లు శుభారంభం ఇచ్చారు. 101 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును పటిష్ట స్థితికి చేర్చారు. ఈ తరుణంలో తొలి వికెట్‌గా షాహిద్ అఫ్రిదీని ఔట్ చేసిన కుంబ్లే ఆ తర్వాత తన వికెట్ల వేటను కొనసాగించాడు. వరసగా వికెట్లు పడగొట్టి 207 పరుగులకే పాక్‌ను కుప్పకూల్చాడు. భారత్‌కు 212 పరుగుల భారీ విజయాన్ని అందించాడు. అదే క్రమంలో ఒకే ఇన్నింగ్స్‌లో పది వికెట్లను పడగొట్టిన రెండో బౌలర్‌గా చరిత్రకెక్కాడు. కుంబ్లే కన్నా ముందు ఒకే ఇన్నింగ్స్‌లో పది వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్‌గా జిమ్ లేకర్ (ఇంగ్లాండ్) ఉన్నాడు.1956లో లేకర్ ఈ ఘనత సాధించగా, నలభై మూడేళ్ల తర్వాత ఆ ఘనత సాధించిన తొలి బౌలర్ కుంబ్లే యే కావడం గమనార్హం. లక్ష్మ ణ్, ద్రావిడ్, గంగూలీలు అద్భుతమైన క్యాచ్‌లతో కుంబ్లే సాధించిన ఘనతలో భాగస్వాములయ్యారు. దీనిపై స్పందించిన కుబ్లే.. ఆ నాడు తాను తీసిన ప్రతి వికెట్టూ ఇప్పటికీ తన మదిలో మెదులుతూనే ఉందన్నాడు.తన కెరీర్‌లో మధురమైన జ్ఞాపకంగా ఆ మ్యాచ్ నిలుస్తుందన్నాడు.

తీరు మారని టీమిండియా





మన తెలంగాణ/క్రీడా విభాగం: ప్రపంచ క్రికెట్‌లో ఎదురులేని జట్టుగా మారిన టీమిండియా అప్పుడప్పుడూ ఘోర పరాజయాలతో అందరిని విస్మయానికి గురి చేయడం అలవాటుగా మార్చుకుంది. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు, వన్డే సిరీస్‌లో కూడా ఇలాంటి ఫలితాలనే భారత్ చవిచూసింది. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో చిరస్మరణీయ విజయం సాధించిన టీమిండియా తర్వాత జరిగిన రెండో టెస్టులో అవమానకర రీతిలో ఓటమి పాలైంది. దీంతో భారత జట్టు ప్రతిభపై సందేహాలు తలెత్తాయి. గతంలో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా సిరీస్‌లలో కూడా భారత్‌కు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. తాజాగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లలో కూడా భారత్‌కు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. ఆస్ట్రేలియాపై తొలి వన్డేలో ఘన విజయం సాధించిన భారత్ తర్వాతి మ్యాచ్‌లో చిత్తుగా ఓడింది. కివీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో కూడా భారత్‌కు ఇలాంటి పరాజయమే ఎదురైంది. వరుసగా మూడు మ్యాచులు గెలిచి సిరీస్‌ను దక్కించుకున్న భారత్ తర్వాత జరిగిన నాలుగో వన్డేలో అవమానకర రీతిలో ఓటమి పాలైంది. ఆ మ్యాచ్‌లో భారత్ 92 పరుగులకే కుప్పకూలిన విషయం తెలిసిందే. కానీ, తర్వాత జరిగిన చివరి వన్డేలో మళ్లీ భారీ విజయంతో ఆకట్టుకుంది. తాజాగా ట్వంటీ–20 సిరీస్‌లో భారత్‌కే గెలుపు అవకాశాలు అధికంగా ఉన్నాయని విశ్లేషకులు సయితం అంచన వేశారు. అయితే అందరి అంచనాలు తారుమారు చేస్తూ భారత్ బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో చిత్తుగా ఓడింది. భారత్ టి–20 చరిత్రలోనే ఇది అత్యంత భారీ ఓటమి అని చెప్పాలి. ఈ మ్యాచ్‌లో భారత్ 80 పరుగుల భారీ తేడాతో పరాజయం చవిచూసింది. దీంతో మరోసారి అభిమానులు జట్టు ప్రదర్శనపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు.

నిలకడలేమి అసలు సమస్య

అయితే అతి వృష్టి..లేకుంటే అనావృష్టి అనే సామెత భారత బ్యాట్స్‌మెన్‌కు సరిగ్గా అతికిపోతుందని చెప్పాలి. తమదైన రోజు ఎంతటి పెద్ద బౌలర్‌కైనా చుక్కలు చూపించడం భారత బ్యాట్స్‌మెన్‌కు వెన్నతో పెట్టిన విద్య. బౌలర్ ఎవరైనా, జట్టు ఏదైనా, పిచ్ ఎటువంటిదైనా వీరు లెక్క చేశారు. తమదైన బ్యాటింగ్‌తో పరుగుల సునామీ సృష్టిస్తారు. ఇక, పరిస్థితి కలిసి రాకపోతే మాత్రం అందరూ కలిసి జట్టు స్కోరును వంద పరుగులు కూడా దాటించరు. ఇలా సాగుతోంది భారత బ్యాటింగ్ ప్రస్థానం. విరాట్ కోహ్లి కెప్టెన్‌గా ఉన్నప్పుడూ ఇలాంటి పరిస్థితి అప్పుడప్పుడూ మాత్రమే కనిపిస్తుంది. అతనికి విశ్రాంతి ఇచ్చినప్పుడూ మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోతోంది. యువ క్రికెటర్లకు ఎన్నో అవకాశాలు ఇస్తున్నా వారు దాన్ని సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. దీనికి చక్కటి ఉదాహరణ శుభ్‌మన్ గిల్ అని చెప్పాలి. అతనికి వన్డే సిరీస్‌లో రెండు వన్డేల్లో అవకాశం ఇచ్చారు. అయినా ఫలితం లేకుండా పోయింది. రెండు మ్యాచుల్లోనూ విఫలమయ్యాడు. తాజాగా టి–20 సిరీస్‌లో రిషబ్ పంత్‌కు ఛాన్స్ ఇచారు. అతను కూడా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయాడు. జట్టు భారీ ఆశలు పెట్టుకున్న పంత్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరి నిరాశ పరిచాడు.



శుభారంభం దక్కక

ఇక, భారత పరాజయాలకు ప్రధాన కారణం ఓపెనింగ్ వైఫల్యమేనని చెప్పాలి. ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు శుభారంభం అందించిన మ్యాచుల్లో భారత్ అలవోక విజయాలు సాధిస్తోంది. ఇద్దరిలో ఒక్కరూ మాత్రమే రాణించినా భారత్ గెలుపు అవకాశాలు అధికంగా ఉంటున్నాయి. కానీ, ఇద్దరు విఫలమైతే మాత్రం ఘోర పరాజయాలు తప్పడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కివీస్‌తో జరిగిన నాలుగో వన్డేనే. ఈ మ్యాచ్‌లో రోహిత్, ధావన్ శుభారంభం అందించలేక పోయారు. ఇద్దరు కూడా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. దీంతో భారత్ వంద లోపే ఆలౌటైంది. చివరి వన్డేలోనూ ఓపెనర్లు విఫలం కావడంతో ఒక దశలో భారత్ 18 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. తాజాగా తొలి టి–20లో కూడా ధావన్, రోహిత్ విఫలమయ్యారు. దీని ప్రభావం జట్టుపై స్పష్టంగా కనిపించింది. ప్రపంచకప్ సమీపిస్తున్న తరుణంలో ఓపెనింగ్ సమస్య జట్టును కలవరానికి గురిచేస్తోంది. సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యను అధిగమించాలి. లేకుంటే ప్రపంచకప్ వంటి భారీ టోర్నమెంట్‌లో జట్టుకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. మరోవైపు సీనియర్లు దినేశ్ కార్తీక్, మహేంద్ర సింగ్ ధోనీలు కూడా తమ ఆటను మరింత మెరుగు పరుచుకోవాలి. కేదార్ జాదవ్‌కు జట్టులో చోటు కల్పించాలి. కృనాల్‌తో పోల్చితే కేదార్ మెరుగైన ఆటగాడు అనడంలో సందేహం లేదు. అతన్ని తప్పిచి కృనాల్ ఆడడం వల్లే భారత్‌కు తొలి టి–20లో ఘోర పరాజయం తప్పలేదు. అంతేగాక కుల్దీప్ వంటి మ్యాచ్ విన్నర్‌ను పక్కన బెట్టడం సరి కాదు. అతనికి తుది జట్టులో కచ్చితంగా చోటు ఇవ్వాలి. తొలి మ్యాచ్‌లో ఎదురైన ఓటమితోనైనా భారత్ గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. మిగిలిన మ్యాచుల్లో మరింత మెరుగైన ఆటను కనబరిచేందుకు ప్రయత్నించాలి.

ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం 2019–20 ఆర్థిక సంవత్సరానికి రూ.4.79 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జనాకర్షణ పథకాలు ప్రకటించింది. గురువారం రాష్ట్ర శాసన సభలో ఆర్థిక శాఖ మంత్రి రాకేశ్ అగర్వాల్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. 2018–19లో రూ. 4,28,384.52 లక్షల కోట్ల బడ్జెట్‌తో పోల్చితే ఈ ఏడాది 12 శాతం అంచనాలతో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఇందులో 21,212.95 కోట్ల కొత్త పథకాలు ఉన్నాయి.

విశాల

రాఫెల్‌పై నాతో 5నిమిషాలు మాట్లాడు

స్వతంత్ర సంస్థలపై పెత్తనానికి ఆర్‌ఎస్‌ఎస్ యత్నం: రాహుల్



న్యూఢిల్లీ: దేశంలోని స్వతంత్ర సంస్థలను స్వాధీనం చేసుకునేందుకు ఆర్‌ఎస్‌ఎస్ యత్నిస్తోందని, తమ పార్టీ అధికారంలో ఉన్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలను కూలదోసేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. గురువారం ఢిల్లీలో పార్టీ మైనార్టీ సెల్ నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోడీని 'పిరికి వాడని'గా ఆయన తీవ్రంగా విమర్శించారు. జాతీయ భద్రత, రఫేల్ వ్యవహారం, ఆర్థిక పరిస్థితిపై తనతో చర్చకు సిద్ధమా అని రాహుల్ సవాల్ చేశారు. గత ఐదేళ్లుగా ఆయనపై పోరాడుతున్నానని, మోడీ ప్రవర్తన ఏంటో తనకు తెలుసన్నారు. ఐదు నిమిషాలు నాతో చర్చకు నిలబడితే ఆయన పారిపోతారని రాహుల్ ఎద్దేవా చేవారు. ఆయన ముఖంలో భయం స్పష్టం గా కనిపిస్తోందన్నారు. ప్రజలను విభజించడం ద్వారా దేశాన్ని పాలించలేమని మోడీకి తెలిసివచ్చిందన్నారు. న్యాయ వ్యవస్థ నుంచి ఎన్నికల సంఘం వరకు స్వయం ప్రతిపత్తి సంస్థలను తన అదుపులోకి తీసుకునేందుకు ఆర్‌ఎస్‌ఎస్ యత్నిస్తోందని రాహుల్ ఆరోపించారు.

'ప్రెషర్ కుక్కర్' కు సుప్రీం నిరాకరణ



న్యూఢిల్లీ: టిటివి దినకరన్ నాయకత్వంలోని అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం(ఎఎంఎంఎ)కు 'ప్రెషర్ కుక్కర్' గుర్తు కేటాయించేందుకు గురువారం సుప్రీం కోర్టు నిరాకరించింది. తమిళనాడులో ఖాళీ స్థానాలకు నాలుగు వారాల్లోగా ఎన్నికలు ప్రకటించినట్లైతే, గత ఏడాది మార్చి9న హైకోర్టు ఉత్తర్వు ప్రకారం వారంలో దినకరన్ పార్టీకి గుర్తు కేటాయించవచ్చని జస్టిస్ ఎఎం ఖాన్విల్కర్, అజయ్ రస్తోగిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. గతంలోహైకోర్టు ఉత్తర్వులపై విధించిన స్టేను ఉన్నత న్యాయస్థానం ఎత్తి వేసింది. ఎఐఎడిఎంకెకు ఇసి 'రెండాకుల గుర్తు' కేటాయించగా, తనకు ప్రెజర్ కుక్కర్ గుర్తు ఇవ్వాలని దినకరణ్ కోరగా, అప్పట్లో హైకోర్టు అనుమతించింది. గత డిసెంబర్‌లో ఆర్‌కె నగర్ ఉప ఎన్నికల్లో ఈ గుర్తుపై పోటీ చేసిన ఆయన 40 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

వారం రోజుల్లో ఐసిస్ అంతం : ట్రంప్

వాషింగ్టన్ : సిరియాలో వారం రోజులలో ఐసిస్‌ని లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ తెలిపారు. ఇప్పటి వరకు ఐసిస్‌ను 80 శాతం వరకు అంతం చేశామని ప్రకటించారు. సిరియాలో తీవ్రవాదులు గుప్పిట్లో ఉన్న 20 వేల చదరుపు మైళ్ల భూమిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మాసూల్ రక్కా ప్రాంతాలలో ఐసిస్ కు సంబంధించిన 60 మంది లీడర్లను మట్టుబెట్టామని పేర్కొన్నారు. అమెరికా బలగాలు జరిపిన కాల్పుల్లో ఇప్పటి వరకు పది వేల మంది తీవ్రవాదులు చనిపోయి ఉంటారని సమాచారం. ఐసిస్‌కు ఉన్న మిగిలిన స్థావరాలపై కూడా దాడి చేసి అంతం చేస్తామని వెల్లడించారు. సిరియన్ డెమోక్రాటిక్ బలగాలతో అమెరికార సైన్యం కలిసి సిరియా, ఇరాక్‌లో ఉగ్రవాదులను లేకుండా అంతం చేశామని గొప్పగా చెప్పారు. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు అమెరికా కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

వధువుకు బంగారం.. బాలికలకు ఇ-బైక్‌లు

అసోం : బిజెపి పాలిత అసోం రాష్ట్రంలో ఎన్నికల తాయిలాలు ప్రకటించింది. ఆ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హిమంత బిశ్వశర్మ తాము ఐదు లక్షల వార్షికాదాయం తక్కువ ఉన్న నూతన వధువులకు రూ.38వేల బంగారాన్ని కానుకగా ఇస్తామని ప్రకటించారు. దీంతో పాటు పదోతరగతి పరీక్షల్లో ఫస్ట్‌క్లాస్‌లో పాసైన బాలికలందరికీ ఇ–బైక్ లను బహుమతిగా ఇస్తామని అన్నారు. దీంతోపాటు బాలికలకు విద్య కోసం రూ.50వేల రుణాన్ని అందజేస్తామని మంత్రి పేర్కొన్నారు. రెండువేల మంది క్రీడాకారులు, కళాకారులకు ఒక్కొక్కరికి 50వేల రూపాయలు ఇన్‌సెంటీవ్‌గా ఇస్తామన్నారు. 45 ఏళ్ల లోపు వయసున్న వితంతువులకు రూ.25వేల ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అసోం రాష్ట్రంలో వందేళ్లు దాటిన 108 పురాతన ప్రార్థనాలయాలు, ఆలయాల మరమ్మతులకు రూ.10 లక్షల గ్రాంటు ఇస్తామని బీజేపీ సర్కారు ప్రకటించింది.

ధర్నాకు వెళ్లిన ఐపిఎస్‌లపై చర్య

పశ్చిమ బెంగాల్ సర్కార్‌కు హోంశాఖ ఆదేశం

కోల్‌కతా: ఈ వారం ప్రారంభంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ఐపిఎస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోమని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంహెచ్‌ఏ) పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని గురువారం కోరినట్లు తెలిసింది. అఖిలభారత సర్వీసు నిబంధనావళి (ప్రవర్తన) ప్రకారం...ఈ నెల 4 సోమవారం మమతా బెనర్జీ ధర్నాలో పాల్గొన్న భద్రతాధికారులపై చర్యతీసుకోమని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి తెలిపినట్టు ఎంహెచ్‌ఏ వర్గాలను పేర్కొంటూ ఎఎన్‌ఐ వార్తా సంస్థ వెల్లడించింది. వారిని అపరాధం చేసిన అధికారులుగా భావించి, అనుక్రమణిక జాబితా నుంచి (ఎంపానెల్డ్ లిస్ట్) వారి పేర్లను ఎంహెచ్ ఏ తొలగించవచ్చు. కేంద్ర ప్రభుత్వ సర్వీస్ నుంచి కొంతకాలంపాటు నిషేధించవచ్చు. సిబిఐ అధికారులు కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ నివాసానికి వెళ్లినందుకు నిరసనగా పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ 'సేవ్ ఇండియా' పేరుతో కోల్‌కతాలోని మెట్రో సినిమా దగ్గర ధర్నా నిర్వహించిన సంగతి తెలిసిందే.

గగన్‌యాన్ సిబ్బందికి వైద్య సహకారం

ఐఎఎం తో చర్చిస్తున్న ఇస్రో

పుణె: గగన్‌యాన్‌లో ప్రయాణించే సిబ్బందికి వైద్యపరమైన సహకారం కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరో స్పేస్ మెడిసిన్ (ఐఎఎం) తో చర్చలు జరుపుతోంది. భారతదేశం మొదటిసారి చేపట్టిన మానవసహిత అంతరిక్ష ప్రయోగం ..గగన్‌యాన్. ముగ్గురు సభ్యులతో 2022 నాటికి గగన్‌యాన్‌ను ప్రయోగించాలని ఇస్రో సన్నాహాలు చేస్తోంది. వారు ఏడురోజులపాటు అంతరిక్షంలో ఉంటారు. సైనిక దళాల వైద్యసేవల సంస్థ (ఎఎఫ్‌ఎంఎస్) డైరెక్టర్ జనరల్ బిపిన్ పూరీ మాట్లాడుతూ... 'ఐఎఎం సహకారాన్ని అందించవలసిందిగా కోరుతూ ఇస్రో మమ్మల్ని సంప్రదించింది'...అని తెలిపారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఐఎఎం ఎఎఫ్‌ఎంఎస్‌కు అనుబంధ సంస్థ. ఐఎఎం దగ్గరున్న సిమ్యులేటర్స్ వంటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దేశంలోనే అత్యుత్తమైంది. కాబట్టి గగన్‌యాన్ సిబ్బందికి (క్రూ) శిక్షణకోసం ఇస్రో ఐఎఎంతో చేతులు కలపాలనికోరుకుంటోంది' అని పూరీ చెప్పారు. 'అంతరిక్షంలో క్రూ సభ్యులకు లైఫ్‌సపోర్ట్ అందించడమే అసలైన సవాల్' అని మెడికల్ సర్వీసెస్ (ఎఐఆర్) డైరెక్టర్ జనరల్ ఎయిర్ మార్షల్ రాజ్‌వీర్ సింగ్ విలేకరులకు చెప్పారు.

'కల్తీ సర్కార్'ను ఎవరూ కోరుకోరు



విపక్షాల ఐక్యతపై ప్రధాని మోడీ వ్యాఖ్యలు

వ్యవస్థలను నాశనం చేసింది కాంగ్రెసే

వాయుసేన బలోపేతం కావడం ఆ పార్టీకి ఇష్టం లేదు

అందుకే రాఫెల్‌ను వివాదం చేస్తోందని ధ్వజం

న్యూఢిల్లీ: విపక్షాల ఐక్యతపై ప్రధాని నరేంద్ర మోడీ తనదైన శైలిలో విరుచుకు పడ్డారు. ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీపై ఎదురు దాడి చేస్తూ అత్యవసర పరిస్థితిని విధించిన, న్యాయవ్యవస్థను బెదిరించిన, సైన్యాన్ని అవమానించిన వారు తాను రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేస్తున్నానంటూ విమర్శించడం వింతగా ఉందని ధ్వజమెత్తారు. తనను గద్దె దించడానికి 23 పార్టీలు ఒక్కటవ్వడాన్ని మహా కల్తీ(మిలావట్)గా అభివర్ణించారు. అలాంటి ప్రభుత్వాన్ని ఎవరూ కోరుకోరని అన్నారు.అలాంటి సర్కార్ వస్తే ఏమవుతుందో ప్రజలకు తెలుసునని అన్నారు. మళ్లీ తామే అధికారంలోకి వస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు. వ్యవస్థలను నాశనం చేస్తున్నానని తనను విమర్శించే వారు అదే క్రమంలో దేశాన్ని కూడా ద్వేషిస్తున్నారన్నారు. రాఫెల్ అంశంపైనా ఆయన కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేశారు. వాయుసేన బలోపేతం కావడం ఇష్ట లేక ఆ పార్టీ వివాదం చేస్తోందన్నారు.గురువారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో జరిగిన చర్చకు సమాధానమిస్తూ ప్రధాని సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్రజలకు నీతివంతమైన పాలనను అందిస్తున్నామని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆరోగ్యకరమైన పోటీ ఉంటుందని భావిస్తున్నామని అన్నారు. తొలి సారి ఓటు వేసే యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

బిసి, ఎడికి కొత్త భాష్యం

కాంగ్రెస్ పార్టీ అంతర్జాతీయంగా భారత దేశ కీర్తిప్రతిష్ఠలను మంటగలుపుతోందన్నారు. దేశంలోనైనా, బయటనైనా, పార్లమెంటులోనైనా, బయటైనా తాము నిజాలే మాట్లాడుతామన్నారు.అయితే సత్యాన్ని వినే సామర్థ్యం ప్రతిపక్షాలకు క్షీణించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు రెండు కాలాలను చూస్తున్నారని, వాటిలో ఒకటి బిసి అని అంటే బిఫోర్ కాంగ్రెస్ అని, అప్పట్లో ఏమీ జరగలేదని, రెండవది ఎడి అంటే ఆఫ్టర్ డైనస్టీ అని, కాంగ్రెస్ ప్రభుత్వాలు లేనప్పుడు అన్నీ జరుగుతున్నాయని అంటూ ఎద్దేవా చేశారు.



అందుకే రాఫెల్ వివాదం

'దేశ రక్షణకోసం ప్రాణాలర్పించే సైన్యం కోసం ఎటువంటి చర్యలకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సైన్యం యుద్ధ సామర్థ్యం పెంచేందుకు మేం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సైన్యానికి నాణ్యమైన ఆయుధ సంపత్తిని అందించాం. వాయు సేన బలోపేతం కావడం కాంగ్రెస్ పార్టీకి ఇష్ట లేదు. అందుకే రాఫెల్ అంశాన్ని ఆ పార్టీ వివాదం చేస్తోంది' అని ప్రధాని అన్నారు.

వ్యవస్థలను నాశనం చేసింది మీరా, నేనా?

నరేంద్ర మోడీ వ్యవస్థలను నాశనం చేస్తున్నారన్న ప్రతిపక్షాల విమర్శలపై మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సైన్యాన్ని అవమానిస్తోందని, సైన్యాధ్యక్షుడ్ని 'గూండా' అంటోందని అన్నారు.' వ్యవస్థలను నాశనం చేస్తున్నది నేనా, మీరా?' అని ప్రశ్నించారు. భారత సైన్యం ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు పన్నినట్లు కాంగ్రెస్ నేతలు కథలు అల్లారని అంటూ, వ్యవస్థలను నాశనం చేస్తున్నది ఎవరు? అని నిలదీశారు.1959లో కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డిస్మిస్ చేసిందన్నారు. ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూల్చిందీ కాంగ్రెస్ ప్రభుత్వమే. రాష్ట్రప్రభుత్వాలను బర్తరఫ్ చేయడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నోసార్లు 356 అధికరణాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. ఇందిరాగాంధీ 50సార్లు రాష్ట్రప్రభుత్వాలను బర్తరఫ్ చేశారన్నారు. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు విమర్శలు చేయడం సహజమే. అయితే మోడీని, బిజెపిని విమర్శించే ప్రయత్నంలో కొంతమంది దేశాన్ని అగౌరవపరుస్తుండడం విచారకరమన్నారు. 'కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్, ఇవిఎంల నిజాయితీని ప్రశ్నించింది.

కానీ నేను వ్యవస్థలను నాశనం చేస్తున్నానని అంటోంది. న్యాయవ్యవస్థను భయపెట్టేలా వ్యాఖ్యలు చేసింది వారే. అయినా నన్నే అంటున్నారు. ప్రణాళికా సంఘాన్ని 'బంచ్ ఆఫ్ జోకర్స్'గా అభివర్ణించింది వారే. వ్యవస్థలను నాశనం చేస్తున్నది ఎవరో చెప్పండి' అని ఆయన సూటిగా ప్రశ్నించారు. '55 ఏళ్ల కాంగ్రెస్ పాలనతో మా పాలనను పోల్చి చూడండి. .. వారు 55 ఏళ్లుగా అధికారం కోసం పాకులాడితే.. మేం 55 నెలలూ దేశం కోసం పని చేశాం' అని అన్నారు.



మాల్యాతో తల్వార్‌కు సంబంధాలు: ఇడి

కస్టడీ ఫిబ్రవరి 12 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ: అక్రమ నగదు చలామణీ కేసులో కార్పొరేట్ లాబీయిస్టు దీపక్ తల్వార్‌కు విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరగాడు విజయ్ మాల్యాతో సంబంధాలు ఉన్నట్లు గురువారం ఢిల్లీ కోర్టుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తెలిపింది. విదేశాల్లో ఉన్న ఆయన కుమారుడిని ఫిబ్రవరి 11 న విచారణకు పిలిచామని, మరో ఏడురోజుల పాటు ఆయన కస్టడీ పొడిగించాలని ఇడి అభ్యర్థించింది. దీంతో తల్వార్ కస్టడీని ప్రత్యేక జడ్జి జస్టిస్ ఎస్‌ఎస్ మన్ ఫిబ్రవరి 12 వరకు పొడిగించారు. తల్వార్ మధ్యవర్తిగా వ్యవహరించి విదేశీ విమానాయాన సంస్థలకు లబ్ధి చేకూర్చి, ఎయిర్ ఇండియాకు నష్టం కలిగించారనే ఆరోపణలపై ఆయనను ప్రశ్నించేందుకు ఇడికి గతంలో ఏడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది.

తండ్రి ఎదుటే కూతురిపై ఆరుగురి అత్యాచారం

మంచినీళ్లు అడుగుతూ ఇంట్లోకి చొరబాటు

ఇద్దరినీ కిడ్నాప్ చేసి

బీహార్‌లో అమానవీయ ప్రవర్తన

పాట్నా : బీహార్‌లో అత్యంత అమానవీయ ఘటన చోటుచేసుకుంది. కన్నతండ్రి ఎదుటే కొంతమది దుండగులు కూతురిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బీహార్‌లోని కిషన్ గంజ్ జిల్లాకు చెందిన ఓ 19 ఏళ్ల యువతిపై ఆరుగురు దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. మంగళవారంనాడు రాత్రి ఈ ఘటన జరిగింది. ఈ ఘోరానికి సంబంధించిన పూర్తి వివరాలను గురువారంనాడు పోలీసులు మీడియాకు వెల్లడించారు. తాగడానికి నీళ్లు ఇవ్వమంటూ ఇంటికి వచ్చిన దుండగులు యువతిని, ఆమె తండ్రిని కిడ్నాప్ చేశారు. పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి తాళ్లతో కట్టేశారు. అనంతరం తండ్రి కళ్లెదుటే కూతురిపై ఆరుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ ఘోరాన్ని చూడలేని తండ్రి తల కిందకు వేసుకుని రోదిస్తూ ఉంటే బలవంతంగా తలపైకెత్తించి మరీ కళ్లెదుట దారుణానికి తెగబడ్డారు. పోలీసులకు



ఫిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరించి పారిపోయారు. యువతి ఫిర్యాదుతో కోదోవాడి పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని కిషన్ గంజ్ ఎస్‌పి ఆశిశ్ తెలిపారు. ఇప్పటి వరకైతే ఎవరినీ అరెస్ట్ చేయలేదని, కానీ నిందితుల్లో ఏ ఒక్కరిని వదిలిపెట్టబోమని అన్నారు. తాను ప్రత్యక్షంగా ఈ కేసును పరిశీలిస్తున్నానని ఎస్‌పి పేర్కొన్నారు.



అత్యధిక స్థాయిలో భూగోళ ఉష్ణోగ్రతలు

ఇదే పరిస్థితి కొనసాగుతుంది

మానవ తప్పిదాలు కూడా కారణం

వెల్లడించిన నాసా శాస్త్రజ్ఞులు

న్యూఢిల్లీ: గత 140 ఏళ్ల రికార్డులతో పోల్చినప్పుడు 2018లో నాలుగోసారి అత్యధిక స్థాయిలో భూ ఉపరితల సగటు ఉష్ణోగ్రత నమోదైందని, మరికొంతకాలం ఇదే పరిస్థితి కొనసాగుతుందని నాసా శాస్త్రజ్ఞులు బుధవారం ప్రకటించారు. ఉష్ణోగ్రతల చరిత్రను బట్టి చూస్తే గత అయిదేళ్లను అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయినవిగా పరిగణించాలి. ఇక 19సార్లు అధిక ఉష్ణోగ్రతలు రికార్డయితే వాటిలో 18 సంవత్సరాలు 2001 నుంచి ప్రారంభమైనవే. అదివరకు ఏదోక సంవత్సరం ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే గత రెండు దశాబ్దాలుగా వార్మింగ్ ట్రెండ్ కొనసాగుతోందని పరిశోధకులు తెలిపారు. మానవ కార్యకలాపాల వల్లే వాతావరణం వేడెక్కుతోందని శాస్త్రజ్ఞులు ఏకగ్రీవంగా చెబుతున్నారు. 'భవిష్యత్తులో ప్రపంచ ఉష్ణోగ్రతలు ఇలా ఉంటాయని ఇకపై ముందుగా చెప్పలేము ' అని నాసా కు చెందిన గోడార్డ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్పేస్ స్టడీస్ డైరెక్టర్ గవిన్. ఎ. తెలిపారు. చరిత్రపూర్వపు రోజుల్లో భూగోళం బాగా వేడిగా ఉండేదని మనకు తెలుసు. ఆధునిక యుగం ప్రారంభంలో చల్లగా ఉండేది. అయితే ఈమధ్య కాలంలో వేడిమికి కారణాల్ని పరిశీలిస్తే...కార్బన్ దయాక్సైడ్, మానవ కార్యకలాపాలవల్ల వెలువడే మిథేన్ గ్రీన్ హౌస్ వంటి వాయువులు కారణం. ఫలితంగా ఆస్ట్రేలియా నుంచి వేడిగాలులు వీస్తున్నాయి.

వరదలు వచ్చే అమెరికా తీరప్రాంతాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్కిటిక్‌లో మంచు అదృశ్యమవుతోంది. హిమానీ నదాలు క్రుంగిపోతున్నాయి. గత ఏడాది సంభవించిన మైఖేల్, ఫ్లోరిన్స్ వంటి వినాశకర తుఫానులు కూడా వాతావరణంలో మార్పులకు కారణమవుతున్నాయని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

ఆర్‌వి తెలుగువారి ఆత్మీయ ట్రావెల్స్

లక్కీ డ్రా ద్వారా నలుగురు ప్రయాణికులకు సింగపూర్, దుబాయ్ ఉచిత ప్యాకేజీ

ఆర్‌వి టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎండి రమణ

మన తెలంగాణ/ కేపీహెచ్‌బికాలనీ: ఆర్‌వి టూర్స్ అండ్ ట్రావెల్స్ తెలుగువారి ఆత్మీయ ట్రావెల్స్ అని ఆ సంస్థ ఎండీ ఆర్‌వి రమణ అన్నారు. ఆర్‌వి టూర్స్ అండ్ ట్రావెల్స్ గత నెల17నుంచి ప్రారంబించి ట్రావెల్స్ ఎక్స్‌పో 19పేరుతో చేపట్టిన ప్యాకేజీలకు తెలుగు రాష్ట్రాల నుంచి మంచి స్పందన లభించిందని చెప్పారు. రానున్న వేసవి నేపధ్యంలో యాత్రలు చేయడానికి ఇప్పటికే 3వేల మంది పర్యాటకులు బుక్ చేసుకున్నారని చెప్పారు. తమ సంస్థ నుంచి ప్యాకేజీలను బుక్‌చేసుకున్నవారికి లక్కీ కూపన్స్ ఇవ్వడం జరిగిందని , కూపన్స్ నుంచి 4గురి ప్రయాణికులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి ఉచితంగా సింగపూర్, దుబాయ్‌లో పర్యటించే అవకాశం కల్పించినట్లు వివరించారు.

ప్రణాళికాబద్ధంగా యాత్రల ప్యాకేజీలు

ఆర్‌వి సంస్థ ప్రణాళిక బద్ధమైన విధంగా, పూర్తి అవగాహనతో , ప్రయాణించే వారికి ఎలాంటి లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా చూడటమే ఆర్ వి ట్రావెల్స్ సంస్థ ఉద్దేశ్యమని ఎండీ రమణ తెలిపారు. సరైన ప్రణాళిక లేని కారణంగా చలా మంది చార్‌దాం, అమర్‌నాథ్,కైలాస మానససరోవర్ తదితర యాత్రలు సంబంధించి కొన్ని



రకాల అసౌకర్యాలకు గురికావడం తరచూ చూస్తూనే ఉన్నామని, వాటిని అధిగమించే విధంగా తమ సంస్థ ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. అంతర్జాతీయ పర్యాటక రంగంలో కూడా సరైన ముందుస్తు ప్రణాళిక లేక పోవడం మూలంగా బడ్జెట్ , సౌకర్యాల విషయంలో కూడా చాలా అసౌకర్యాలకు గురికావడం పరిపాటిగా జరుగుతుందన్నారు. ఇటువంటి వాటి విషయంలో అందరికి అవగాహన కల్పించడానికి ఆర్‌వి టూర్స్ అండ్ ట్రావెల్స్ ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక వేదికగా 'ట్రావెల్స్ ఎక్స్‌పో 19' అని పేర్కొన్నారు. 2019 ట్రావెల్స్ ఎక్స్‌పో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలనుంచి అనూహ్యమైన స్పందన లభిస్తుందని రమణ తెలిపారు.



లక్కీ డ్రా ద్వారా నలుగురికి ఉచిత ప్యాకేజీలు

ఆర్‌వి టూర్స్ ట్రావెల్స్ ఎక్స్‌పో 19 ద్వారా బుక్ చేసుకున్న ప్రయాణికుల్లో 4గురిని ప్రయాణికుల చేతుల మీదుగా లక్కీ డ్రా తీశారు. లక్కీ డ్రాలో కూపన్ నెం.1541కు సంబంధించిన జిఆర్ మదన్‌మోహన్‌రెడ్డి, పి. రామసీత(0447), ఎం. రుక్మాంగధరారావు(1612) పి. పద్మశ్రీ(14441)లను ఎంపికైనట్లు ఆర్‌వి సంస్థ ఎండీ ఆర్‌వి రమణ తెలిపారు. ఎంపికైన మొదటి ఇద్దరు విజేతలకు సింగపూర్, మిగిలిన ఇద్దరు విజేతలకు దుబాయ్ ప్యాకేజీలతో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లుకల్పిస్తున్నట్లు వివరించారు. ఇంతటి అనూహ్య స్పందనకు కారకులైన ప్రతి పర్యాటకునికి, పత్రికా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666